# విప్లవ మేధావి,
# ప్రజా హక్కుల యోధుడు

(అమరుడు గొర్రెపాటి మాధవరావు సంస్మరణలో...)



ప్రచురణ :

**జంపాల చంద్రశేఖర ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్**

నిజామాబాద్

**విప్లవ మేధావి, ప్రజా హక్కుల యోధుడు**
(అమరుడు గొర్రెపాటి మాధవరావు సంస్మరణలో...)

ప్రచురణ :
**జంపాల చంద్రశేఖర ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్**
నిజామాబాద్

ప్రథమ ముద్రణ : జనవరి 2025

ప్రతులు : 1000

వెల : రూ. 75/-

***ప్రతులకు :***
జెసిఎస్ ప్రసాద్ గ్రంథాలయం
కోటగల్లి, నిజామాబాద్ – 503 001.
సెల్ : 9490700833, 7995890816

మార్క్స్‌భవన్, 658, 7వ లైన్, మసీద్ రోడ్
విద్యానగర్, హైదరాబాద్ – 500 044.
&

***అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో***

*లేఅవుట్ & కవర్ :*
**అక్షర గ్రాఫిక్స్**
నల్లకుంట, హైదరాబాద్

*ముద్రణ :*
**కర్షక్ ప్రింటర్స్,** హైదరాబాద్

# విషయసూచిక

1. నిబద్ధతగల విప్లవ మేధావి – ప్రజల హక్కుల యోధుడు 5
– వేములపల్లి వెంకట్రామయ్య
2. బహుముఖ ప్రజ్ఞాశాలి – మా మాధవరావు సార్
– ఎస్. జీవన్‌కుమార్ 13
3. అమరత్వం ఆదేశిస్తుంది... – పి. సూర్యం 19
4. విప్లవోద్యమ ప్రక్షాళనకు అమరజీవి మాధవరావు జీవితం
ఓ కర్తవ్యోపదేశం – పి. ప్రసాదు 21
5. విప్లవ స్వాప్నికుడు కామ్రేడ్ మాధవరావుకి జోహార్లు...!
– సాదినేని వెంకటేశ్వరరావు 27
6. నా బతికిన క్షణాల్లో మరొకటి ఇప్పుడు ఒక ఆకాశ తార! – హెచ్ఆర్‌కె 31
7. ప్రజా హక్కుల ఉద్యమ పతాక మాధవరావు చిరస్మరణీయుడు – కె. గోవర్ధన్ 34
8. నిజామాబాదులో నిండుగా నవ్విన గోదావరి మాధవరావు అన్న – శక్తి 37
9. భారత రాజకీయ యవనికపై చెరగని విప్లవ సంతకం
కామ్రేడ్ గొర్రెపాటి మధవరావు – ఆవునూరి మధు 40
10. మేధో పిపాసి, శ్రామిక పక్షపాతి, ఉద్యమ వకీలు
కా॥ గొర్రెపాటి మాధవరావు – పోటు రంగారావు, 45
11. మాధవన్నయ్యా అప్పుడే వెళ్ళి పోయావా...? – గొర్రెపాటి రామకృష్ణ 47
12. నిరంతర జ్ఞానాన్వేషి, న్యాయ క్షేత్ర కృషీవలుడు గొర్రెపాటి మాధవరావు
– డా. సరిత పిట్ల 50
13. An Exceptional Legal Practitioner Sri. Madhav Rao Gaaru
- *N. Ramkumar* 54
14. నింగికెగసిన నేల తారక మాధవన్న – వేములపల్లి విజయ 56
15. Joharlu to Com. Madhava Rao - *Narsa Goud* 59
16. గొర్రెపాటి మాధవరావు గారు! అలా ఎలా వెళ్లిపోయారు మాధవరావు గారు?
– *బి. రమాసుందరి* 60

17. పరోపకారమే ఆయన ఆఖరి మజిలీ – మాధవరావు గారి జీవితమే ఒక పాఠం...
– పారుపల్లి జవహర్‌బాబు (రాజా) 63
18. మాధవుడు పరిపూర్ణ మానవుడు – ప్రొ. వినయ్ బాబు 66
19. చురుకైన నాయకుడు – మాధవరావు – ప్రొ. ఎ.వినాయక రెడ్డి 69
20. హక్కుల ఉద్యమ నేత గొర్రెపాటి మాధవరావు – తులా రాజేందర్‌కుమార్ 72
21. మరపురాని మాయమైన మాధవన్న – చెరుకు సుధాకర్ 74
22. ప్రజా న్యాయవాది గొర్రె పాటి మాధవరావు – బి.ఎల్.బి. రవి 76
23. మరువలేని మానవ హక్కులనేత మాధవరావు – వి. బాల్ రాజ్ 81
24. నాన్నా! ఇంకెప్పుడు పలుకుతారు? – ఆదిత్యా మధుమిత్ గొర్రెపాటి 84
25. నా గత స్మృతులు – కొండపల్లి విజయకుమార్ 88
26. నా జ్ఞాపకాలలో పెదనాన్న – పరుచూరి సిరి 90
27. హక్కుల యోధుడు కామ్రేడ్ గొర్రెపాటి మాధవరావు అమర్ రహే
– పి. మహేష్ 94
28. మానవత్వపు నిండుకుండ మాధవరావు – బైస రామదాసు 96
29. కామ్రేడ్ మాధవన్నకి విప్లవ జోహార్లు! – మల్లిక్ పలుకూరు 98
30. మానవ హక్కులనేత గొర్రెపాటి మాధవరావు గారికి జోహార్లు
– బిజిగిరి శ్రీనివాస్ 102
31. గుండెకొలిమి అంటించిన మాధవుడి మరణం – గోపరాజు నాగేశ్వరరావు 103
32. అమరుడా మాధవన్న మాకోసం మళ్ళీ ఒకసారి రావ... – జె.సాయికృష్ణ 104
33. గొప్ప మానవతావాది మాధవన్న – జి.గంగాధర్ సిర్పా 106
34. కామ్రేడ్ మాధవన్నతో నా స్మృతులు – వి. భాస్కర్ 107
35. మానవ హక్కుల నిలువెత్తు సంతకం కామ్రేడ్ గొర్రెపాటి మాధవరావు
– మాతృక సంపాదకవర్గం 112
36. హక్కుల ఉద్యమ సేనాని – ఎమ్మెస్ 115
37. పెద్దన్నను కోల్పోయాం – గజవాడ హన్మంత్‌రావు 118
38. ఇందూరు బంధువు.. ఇందూరు ఎర్రని సింధూరం – సిర్ప లింగం 119
39. సంతాపాలు 121–123
40. పాటలు, కవితలు 124–145

# నిబద్ధతగల విప్లవ మేధావి – ప్రజల హక్కుల యోధుడు

– వేములపల్లి వెంకట్రామయ్య
*సిపిఐ(ఎం–ఎల్)న్యూడెమోక్రసీ కేంద్రకమిటీ సభ్యులు*

విప్లవ మేధావి, ప్రజల హక్కులు, ప్రజాస్వామిక హక్కుల ఉద్యమనేతగా హక్కుల ఉద్యమంలో 40 సం॥లకు పైగా సుదీర్ఘకాలం పనిచేసిన గొర్రెపాటి మాధవరావు డిశంబరు 27న తీవ్రంగా గుండెపోటుకు గుర్రై, హాస్పటల్‌లో చికిత్స పొందుతూ, 28 డిశంబర్ 2024న ఉదయం మరణించారు. వీరి మరణం అత్యంత విషాదకరం, బాధాకరం. అత్యంత ఆప్తుడు, సహచరుడుగా గత 47 సం॥రాలుగా కొనసాగించిన మా అనుబంధం యింత తొందరగా ముగుస్తుందని ఎప్పుడూ భావించలేదు. బంధుత్వ అనుబంధం కన్నా విప్లవ బంధం ఎంతో గొప్పది, విలువైనదని మా అనుభవం రుజువు చేసింది. హక్కుల ఉద్యమం ఒక పోరాట యోధుడినీ, ప్రజాస్వామిక విప్లవోద్యమాలు అత్యంత నిబద్దతతో, అండ దండలందించిన విప్లవకారుడినీ, తన రచనలు, ఉపన్యాసాల ద్వారా ప్రజాస్వామిక చైతన్యాన్నీ, స్ఫూర్తినీ కలిగించి, రగిలించే ఒక విప్లవ మేధావినీ సమాజం కోల్పోయింది.

మానవ సమాజంలో మనిషి జీవితం చాలా విలువైంది. ప్రతి మనిషి జీవితంలో మరణం ఎప్పుడో ఒకప్పుడు సహజం, అనివార్యం, తప్పించుకో వీలులేనిది. ఏ వ్యక్తి మరణమైనా బాధకరమే. అయితే, ప్రజలు మంచివారుగా భావించిన వారు చనిపోయినప్పుడు సాధారణంగా అందరూ బాధపడతారు. సమాజంలో చెడ్డ వ్యక్తులుగానూ, దుర్మార్గులుగానూ భావించిన వ్యక్తులు చనిపోయిన్పుడు ప్రజలు సంతోషిస్తారు. పీడ వదలిపోయినట్లుగా భావిస్తారు. మంచి మనిషిగానూ, ప్రజల హక్కుల కోసం కృషిచేస్తూ, విప్లవోద్యమాలకు అన్ని విధాలుగా జీవితాంతం తోడ్పడిన శ్రమజీవి మాధవ్ మొదటి కోవకు చెందుతారు.

సమాజంలో ప్రతి వ్యక్తి తాను జీవించినంత కాలం ఏదో ఒక పని లేదా వ్యాపకంలో వుంటాడు. తన కోసం, తన కుటుంబం కోసం కృషి చేయడం సాధారణంగా

జరిగే విషయమే. మరి కొందరు, తానూ, తన కుటుంబం పరిధి దాటి, తన కులం, మతం, ప్రాంతం, జాతి కోసం కృషి చేస్తుంటారు. ఈ విధంగా కృషి చేసిన వ్యక్తులు చనిపోయినప్పుడు ఆయా సమూహాలు ఎక్కువగా స్పందిస్తాయి. వారిని ఎక్కువగా బాధిస్తాయి. ఆయా సమూహాలు చనిపోయిన వ్యక్తి యొక్క కృషీ, త్యాగాలను బట్టి గుర్తుంచుకోవటం, స్మరించుకోవటం జరుగుతుంది. ఈ విధంగా చనిపోయిన వారిలో ముఖ్యమైన వారిని మొత్తం సమాజానికి సేవ చేసినట్లుగా కూడా ప్రచారం జరుగుతోంది. అయితే, సమాజాభివృద్ధి క్రమంలో వీరి పాత్ర పరిమితంగానే వుంటుంది.

సమాజాభివృద్ధి క్రమంలో నూతన ప్రగతిశీల వ్యవస్థ కొరకు, పాత వ్యవస్థకు వ్యతిరేకంగా – బానిస, భూస్వామ్య, పెట్టుబడిదారీ వ్యవస్థలలోని ఆర్థిక, రాజకీయ, సాంఘీక, సాంస్కృతిక రంగాలలోని దుర్లక్షణాలకు వ్యతిరేకంగా పోరాడిన, విశేష కృషిచేసిన గొప్ప వ్యక్తుల జీవితాలకూ, ఆ కృషిలో మరణించిన మహనీయులకూ చారిత్రక ప్రాధాన్యత వుంటుంది. ఈ కృషి సమ సమాజం ఏర్పడే వరకూ, గత దోపిడీ సమాజాల దుర్లక్షణాలూ, చివరి అవశేషాల నిర్మూలన జరిగే వరకూ కొనసాగించాల్సి వుంటుంది. వివిధ దోపిడీ వ్యవస్థలు – బానిస, భూస్వామ్య, పెట్టుబడిదారీ వ్యవస్థల దుర్లక్షణాలకు వ్యతిరేకంగా వివిధ రంగాలలో కృషిచేసిన మహనీయులంతా చరితార్థులు; చిరస్మరణీయులు. వీరు ఆయా వ్యవస్థలలో నిర్వహించిన పాత్రనూ, స్థల, కాలాదులనూ, నాటి నిర్దిష్ట పరిస్థితిని బట్టి, ప్రగతిశీలమైన, విప్లవకరమైన పాత్రను నిర్వహించినట్లుగా భావించాల్సి వుంటుంది.

మరణంలో మరో తరహాకు చెందినవి వున్నాయి. వీరు తమ కుటుంబం, కులం, మతం, ప్రాంతం పరిధులు దాటి, సమాజంలో దోపిడీ, పీడన, అణచివేతలకు గురవుతున్న అశేష ప్రజల కొరకు ఆలోచిస్తారు; అందుకొరకే కృషిచేస్తారు. తామున్న సామాజిక వ్యవస్థ కంటే మెరుగైన వ్యవస్థ కొరకు మాత్రమే పరిమితం కాకుండా, దోపిడీ, పీడన, అణచివేతలు లేని, మహోన్నత మానవ విలువలు గల సమ సమాజం లక్ష్యంగా వీరి కృషి సాగుతుంది. మానవాళి విముక్తికి దారి చూపే సిద్ధాంతం – శ్రామికవర్గ సిద్ధాంతం (మార్క్సిజం–లెనినిజం–మావో ఆలోచనా విధానం) స్వీకరించి, నిబద్దతతో కృషి సాగిస్తారు. దోపిడీ వర్గ సిద్ధాంతాలన్నింటినీ వ్యతిరేకించి, వీటితో రాజీలేని పోరాటం సాగిస్తారు. సూటిగా చెప్పాలంటే, మనదేశంలో ప్రజలకు వాస్తవంగా జీవితంలో అమలు జరిగి, అనుభవించగలిగే ప్రజాస్వామ్యం, దేశానికి నిజమైన స్వాతంత్ర్యం, సమ సమాజ స్థాపన లక్ష్యంగా పనిచేస్తారు. అందుకు ప్రజలలో ప్రజాస్వామిక చైతన్యం పెంచటానికి కృషిచేస్తారు. ప్రజలను సంఘటితం చేసి,

పోరాటాలు, ఉద్యమాలకు బాసటగా నిలుస్తారు. ఈ కోవకు చెందిన వ్యక్తులు ప్రజాస్వామిక విప్లవోద్యమాల చరిత్రలోనూ, సామాజిక చరిత్రలోనూ చిరస్మరణీయులుగానూ, చరితార్ధులుగానూ వుంటారు. ఈ కోవకు చెందిన వాడు కామ్రేడ్ మాధవరావు. ఈ విధమైన వ్యక్తులను ప్రజలు, సమాజం గుర్తిస్తుంది; గౌరవిస్తుంది. వారి జీవితాలు ఉద్యమాలకూ, సమాజానికీ స్ఫూర్తిదాయకంగానూ, మార్గదర్శకంగానూ వుంటాయి.

## ప్రజల హక్కుల ఉద్యమంలో ప్రముఖ పాత్ర

మాధవరావు విద్యార్థి దశ నుండే పిడిఎస్‌యు ఆధ్వర్యాన సాగుతున్న ఉద్యమాలకి ప్రభావితుడై, చురుకుగా పాల్గొన్నాడు. దేశంలోనూ, ప్రపంచంలోనూ సాగుతున్న విప్లవోద్యమాలకు ప్రభావితుడయ్యాడు. ప్రజా ఉద్యమాలతో సన్నిహిత సంబంధం కలిగి వుండేవాడు. భారత సమాజాన్నీ, ప్రజల స్థితిగతులనూ లోతుగా పరిశీలించి, అధ్యయనం చేశాడు. మన దేశ రాజ్యాంగంలోనూ, చట్టాలలోనూ హక్కులు వున్నప్పటికీ, అవి దేశంలో ఎక్కడా అమలు జరగటం లేదు. ప్రజలు చాలా వెనుకబాటుతనంలో వుండుటవల్ల, ప్రజాస్వామిక చైతన్యం చాలా తక్కువగా వుంది. ప్రజల హక్కులు అడుగడుగునా కాలరాచివేయబడుతున్నాయి. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికై కదిలినా, హక్కులకై మాట్లాడినా అణచివేత కొనసాగుతోంది. ప్రజా ఉద్యమాలపై నిర్బంధం కొనసాగుతోంది. చివరికి, బూటకపు ఎన్‌కౌంటర్ల పేరిట హత్యాకాండ కొనసాగుతూనే వుంది. అట్టడుగు కులాలు, వర్గాలు, ఆదివాసులు, మహిళలపై పీడన, అణచివేతలు, దాడులు కొనసాగుతూనే వున్నాయి. ఈ పరిస్థితులు మాధవరావు జీవితంపై ప్రభావం కలిగించి, హక్కుల ఉద్యమానికి ప్రేరణగా నిలిచాయి. అందులో భాగంగానే లా చదివి, న్యాయవాద వృత్తి చేపట్టి, హక్కుల ఉద్యమంలో తన శాయశక్తులా కృషిచేశాడు. వృత్తి న్యాయవాద వృత్తి అయినప్పటికీ, ప్రజా హక్కుల ఉద్యమం ప్రవృత్తిగా చేపట్టాడు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో 1983 నుండి 1996 వరకు రాష్ట్ర సహాయ కార్యదర్శిగా చురుకైన పాత్ర నిర్వహించాడు. పౌరహక్కుల సంఘం నేత బాలగోపాల్‌కు చేదోడుగా నిలబడ్డాడు. బాలగోపాల్‌తో ఏర్పడిన హక్కుల అనుబంధం చివరికంటా కొనసాగింది. ఉద్యమంలో అత్యంత సన్నిహితంగా కొనసాగింది. పౌరహక్కుల ఉద్యమ అవగాహనపై విబేధాలు తీవ్రమై పెద్ద చర్చ జరిగింది. రాజ్యహింసకు మాత్రమే పౌరహక్కుల ఉద్యమం పరిమితం కావాలనే అవగాహనతో విబేధించి, ప్రజలపై ఒక విధానంగా జరిగే (తనకు తానుగానే ఆరోపణలు చేసి, శిక్షలు (చంపటంతో సహా) విధించే, ప్రైవేటు హింసను కూడా వ్యతిరేకించాలనే

చర్చ తీవ్రంగా సాగింది. ఈ విషయంలో బాలగోపాల్‌తో సహా, విబేధించారు. చివరికి, ఏపిసిఎల్‌సికి రాజీనామా చేసి బాలగోపాల్‌తో సహా, మాధవరావు బయటకు వచ్చాడు.

బాలగోపాల్, మాధవరావు, తదితరులు కలిసి, మానవ హక్కుల వేదికను తే.11-10-1998 హైదరాబాద్‌లో ఏర్పరచుట జరిగింది. దీనికి మొదటి రాష్ట్ర కన్వీనర్లుగా యస్.జీవన్ కుమార్, డా॥ ఆర్. మధుసూధనరాజు, ఎ.సునీతలను ఎన్నుకోవటం జరిగింది. ఆ విధంగా మానవ హక్కుల వేదిక ఆవిర్భావకులలో ఒకరుగా వుండి; జీవితాంతం వరకు మానవ హక్కుల వేదికలో వివిధ స్థాయిల్లో చురుకైన పాత్రను నిర్వహించాడు. బాలగోపాల్ 2009 సం॥లో అకాల మరణం పొందిన తర్వాత, మానవ హక్కుల వేదిక బాధ్యతలు ఎక్కువగా తీసుకొని కృషిచేశాడు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షునిగా రెండుసార్లు 2019 నుండి 2023 వరకు, తర్వాత ఉపాధ్యక్షునిగా కొనసాగారు.

ఏపిసిఎల్‌సిలో వున్నప్పుడూ, మానవ హక్కుల వేదికలోనూ బూటకపు ఎన్‌కౌంటర్లు, లాకప్‌డెత్‌లు విషయంలో నిజనిర్ధారణ కమిటీ నివేదికల ద్వారా, వాస్తవాలను బయట ప్రపంచానికి తెలియజేయటలో ముఖ్యమైన పాత్ర నిర్వహించాడు. నిజ నిర్ధారణ నివేదికలు ఆయన పాల్గొన్నవన్నీ ఎక్కువగా ఆయనే రాసేవాడు. దళితుల బహిష్కరణలు, దాడుల సంఘటనల సందర్భంగా వెళ్ళి, పరిశీలించి వాస్తవాలు వెల్లడించి, ప్రభుత్వ యంత్రాంగం కదిలి చర్యలు తీసుకునేటట్లుగా ఒత్తిడి చేయగలిగాడు. బూటకపు ఎన్‌కౌంటర్లు జరిగిన సందర్భంలో వాటిని వ్యతిరేకించటానికీ, ఖండించటానికీ ముందుకు రాని రోజుల్లో, వాటిని ఖండించి, నిర్బంధం, అక్రమ అరెస్టులు, తప్పుడు కేసులు బనాయింపులను బహిరంగంగా వ్యతిరేకించి, ఉద్యమాలకు బాసటగా, ధైర్యంగా నిలబడ్డాడు.

ప్రభుత్వ యంత్రాంగం, ముఖ్యంగా పోలీసు అధికారుల బెదిరింపులు కూడా లెక్కచేయకుండా, బూటకపు ఎన్‌కౌంటర్లు జరిపిన పోలీసు అధికారుపై కేసులు వేసి, విజయం సాధంచాడు. నిజామాబాద్ జిల్లా కేంద్రం దగ్గరలోనే నాగారం గ్రామ శివారులోని భవానీగుట్ట ప్రాంతంలో తే.20-7-1991న జరిగిన బూటకపు ఎన్‌కౌంటరులో డిచ్‌పల్లి మండలం, సుద్దులం గ్రామానికి చెందిన లోలం నర్సయ్య, షేక్ మహమ్మద్‌లను కాల్చి చంపటం జరిగింది. దీనిపై కోర్టులో కేసు వేయగా, ట్రయల్ కోర్టు తే.26-9-2005న మృతులు ఒక్కొక్కరికి ఒక లక్ష రూ॥లు నష్టపరిహారం చెల్లించాలని తీర్పు చెప్పగా, నాలుగవ అదనపు జిల్లా జడ్జి ఆ తీర్పును ధృవీకరించారు. ఈ తీర్పుపై హైకోర్టుకు ప్రభుత్వం అప్పీలుచేయగా, క్రింది కోర్టు తీర్పును 2007లో

ధృవీకరించుట జరిగింది. ఆ విధంగా, మాధవరావు తన న్యాయశాస్త్ర ప్రావీణ్యంతో, మొక్కవోని ధైర్యంతో 16 సం॥ల సుదీర్ఘ న్యాయ పోరాటం చేసి, విజయం సాధించి, బాధితులకు నష్టపరిహారం యిప్పించుట జరిగింది. మరో బూటకపు ఎన్‌కౌంటరు కేసులో కూడా వాదించి విజయం సాధించాడు. నిజామాబాద్ జిల్లా, డిచ్‌పల్లి మండలం త్రయంబక్‌పేట అటవీ ప్రాంతంలో తే.6-4-1994న జరిగిన బూటకపు ఎన్‌కౌంటరులో నిజామాబాద్ మండలం, బాడ్సి గ్రామ వాసి, పంప్ మెకానిక్ గొల్ల బుచ్చయ్యను కాల్చి చంపటం జరిగింది. దీనిపై కేసు పెట్టగా, మృతుని కుటుంబానికి 1 లక్ష రూ॥లు నష్టపరిహారం ఇవ్వాలని ట్రయల్ కోర్టు తే. 28-8-2007న తీర్పు ఇవ్వగా, మొదటి అదనపు జిల్లా జడ్జి దీనిని ధృవీకరించాడు. 15 సం॥ల న్యాయ పోరాటం ద్వారా విజయం సాధించుట జరిగింది.

మరొక బూటకపు ఎన్‌కౌంటర్‌పై కోర్టు ద్వారా న్యాయ పోరాటం చేసి, మాధవరావు విజయం సాధించాడు. నిజామాబాద్ నగర శివారులోని కాలూరు రోడ్డులో తే.5-10-1998న జరిగిన బూటకపు ఎన్‌కౌంటరులో నిజామాబాద్ జిల్లా, దర్పల్లి మండలం, దుబ్బాక గ్రామ నివాసి బాణాల కోటయ్యను దొంగ అనే నెపంతో కాల్చి చంపటం జరిగింది. దీనిపై కోర్టులో కేసు వేయగా, బాధిత కుటుంబానికి 1 లక్షా 50 వేల రూ॥లు 12 శాతం వడ్డీతో సహా నష్టపరిహారం చెల్లించాలని సీనియర్ సివిల్ జడ్జి తీర్పు చెప్పగా, ప్రభుత్వం అప్పీలు చేస్తే, అప్పీలు కొట్టివేయడం జరిగింది. ఈ కేసులో మాధవరావు 12 సం॥లు న్యాయ పోరాటం చేసి, విజయం సాధించాడు. ఈ విధంగా బూటకపు ఎన్‌కౌంటర్‌పై న్యాయపోరాటం చేసి, విజయం సాధించిన ఘటనలు దేశంలో యింతవరకు ఎక్కడా కనిపించవు.

## విప్లవోద్యమంతో విడదీయరాని అనుభవం

గొర్రెపాటి మాధవరావు జీవితాన్ని విప్లవ ప్రజా ఉద్యమాల నుండి విడదీసి చూడలేము. విద్యార్థి వున్నప్పుడు ప్రారంభమైన విప్లవ విద్యార్థి ఉద్యమంలో భాగస్వామ్యం విప్లవ ప్రజా ఉద్యమాలతో చివరికంటా - 47 సం॥లు కొనసాగింది. 1977 సం॥లో ప్రారంభమైన విప్లవ ధృక్పథంతో రచనా వ్యాసంగం, జీవితాంతం కొనసాగింది. 1977 నుండి 1980 వరకు ' విమోచన ' పత్రికలో బాధ్యతలు యితరులతో కలిసి నిర్వహించాడు. తర్వాత కాలంలో పిడిఎస్‌యు పత్రిక ' విజృంభణ ' బాధ్యతలు చూశాడు. నిజామాబాద్‌లో న్యాయవాద వృత్తి ప్రారంభించినప్పటి నుండి జిల్లా విప్లవోద్యమంలో భాగంగానూ, పెద్ద దిక్కుగానూ వ్యవహరించాడు. జిల్లాలోని వివిధ రంగాలలో సాగిన విప్లవోద్యమాలలో మాధవరావు పాత్ర లేనిది లేదంటే, అతిశయోక్తి

కాదు. విప్లవోద్యమంలోకి కార్యకర్తలుగా ప్రోత్సహించటంలోనూ, క్లిష్ట సమయాలలో వారిని నిలబెట్టడంలోనూ అత్యంత ముఖ్యమైన పాత్ర నిర్వహించాడు. వివిధ రంగాలకు చెందిన ఉద్యమ కార్యకర్తలకు క్లాసులు బోధించటంలో ఆయన వివరించే పద్ధతి, సాధారణ పరిభాష విలక్షణమైనది. ఒక దశలో తప్పుడు ఆరోపణలతో వేధింపులకూ, కక్ష్య సాధింపు చర్యగా తీవ్రమైన క్రమశిక్షణా చర్యకు గురైనా, చెక్కు చెదరకుండా, ఓపికతోనూ, ధైర్యంగానూ ఎదుర్కొన్నాడు. 1980 నుండి 2024 వరకు ప్రతినిధిగా రాష్ట్ర సభలకు 1992 నుండి 2024 (2004 మినహా) వరకు జాతీయ మహాసభలకు హాజరై అనువాద బాధ్యతలు అత్యంత సమర్ధవంతంగా నిర్వహించాడు. అనేక వ్యాసాలు పత్రికలకు రాశాడు. అతను రాసిన చివరి వ్యాసం డిశంబర్ 2024 ' వాయిస్ ఆఫ్ న్యూడెమోక్రసీ' పత్రికలో ప్రచురించటం జరిగింది.

కాలేజీలో చదివే తొలి నాళ్ళలో మాధవరావు అరుణోదయలో కూడా చురుగ్గా పనిచేశాడు. అప్పుడే, అరుణోదయ పితామహుడుగా వున్న కామ్రేడ్ కానూరి వెంకటేశ్వరరావు గారితో ఏర్పడ్డ ఆత్మీయ అనుబంధం, వారు మరణించే వరకూ కొనసాగింది. కానూరి గారి జీవిత చరిత్ర – వివిధ జానపద కళారుపాలు – " జన జీవన గానం " పేరిట డాక్యుమెంటరీ డా॥ ముత్యం తీయటంలో మాధవరావు పాత్ర ముఖ్యమైనది.

## విప్లవ మేధావి – నిరంతర అధ్యయనశీలి – ప్రజా రచయిత

శాస్త్రీయ ధృకప్పధంతో సామాజిక వ్యవస్థ మార్పుకై సరియైన ప్రగతిశీల ప్రజాస్వామిక మార్గంలో ఆలోచించి, కాలం చెల్లిన, అభివృద్ధి నిరోధక విధానాలు, విషయాలను వ్యతిరేకించి, పురోగామి ప్రగతిశీల వ్యవస్థకై వివిధ రూపాలలో రచనలు చేసేవారు, విప్లవ మేధావులుగా వుంటారు. దోపిడీ వర్గాలకూ, సామ్రాజ్యవాదానికీ వ్యతిరేకంగా నిలబడి కృషి చేసేవారూ, అందుకు జరిగే ప్రజల ఉద్యమాల వైపు నిలబడి అండ దండలిచ్చే, నిలబడే రచనా వ్యాసంగం చేసేవారూ విప్లవ మేధావులే. మాధవరావు జీవితం ఇందుకు నిలువెత్తు నిదర్శనం. ఇందుకు మాధవరావు రాసిన ఏ వ్యాసం చూచినా దాని ప్రత్యేకతను అది ప్రతిబింబిస్తుంది. ఇతని రచనలలో భాష సాధారణ పరిభాషగా వుండి, సామాన్యులకు కూడా సులభంగా అర్ధవంతమయ్యే ప్రత్యేకమైన శైలి. అవసరమైన చోట సూటిగా, వాడిగా, బలంగా గుండెలోకి చొచ్చుకుపోయే విధంగా వుంటుంది. అనువాదాలకు ప్రత్యేకంగా అందెవేసిన చేయి. ఇతని అనువాద పుస్తకాలు " చైనా ఆధునిక చరిత్ర " కానీ, " జాతీయత లేని జాతీయ కాంగ్రెసు " కానీ, " విశ్వ మానవ హక్కుల ప్రకటన " తదితరాలు అనువాదాలుగా

కాక, తెలుగులో రాసిన మాతృ రచనలుగానే కనిపిస్తాయి. సులభంగా చట్టాలు కూడా సామాన్యులకు కూడా అర్థం అయ్యేవిధంగా రాసిన " కార్మిక చట్టాలు " ప్రత్యేకంగా పేర్కొనాలి.

మాధవరావు నిరంతర అధ్యయన శీలి, విమర్శకుడు. వ్యాసాలు, కథలు, నవలలు నుండి మార్క్సిజం మూల గ్రంథాలను పట్టువిడువకుండా, నిరంతరం అధ్యయనం చేసేవాడు. విజ్ఞానఖని. బహుముఖ ప్రజ్ఞాశాలి. సోషల్ మీడియాలో కూడా వివిధ విషయాలపై వెంటనే స్పందనలు అతని అవగాహనకూ, నిక్కచ్చిగా మొహమాటం లేకుండా చెప్పేదానికీ అద్దం పడతాయి.

**విప్లవోద్యమ శ్రేణుల్లో విలువలకై పోరాటం**

మాధవరావు తన జీవితంలో నీతి, నిజాయితీ, విలువల కోసం నిలబడ్డాడు. ఉద్యమ శ్రేణుల్లో, ముఖ్యంగా నాయకత్వ శ్రేణిలో వాటికోసం పరితపించటం మాత్రమేగాక, పోరాడాడు. విప్లవోద్యమాలలో ముఖ్యంగా నాయకత్వం కార్యాచరణతోపాటు, విలువలు కలిగివుండాలని, బలంగా భావించాడు. ప్రజల కోసం, ఒక విప్లవ ఆశయ సాధన కోసం జీవితాన్ని అంకితం చేసి, నిజాయితీగా, విలువలతో పనిచేయుట వల్లనే వారి ప్రతిష్ట పెరిగింది. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా, ఆశయం కోసం, విలువల కోసం నిలబడుట వల్లనే ఉద్యమ ప్రతిష్ట ప్రజల్లో పెరిగి, విశ్వాసం పెరిగింది. ఇటీవలి కాలంలో ఉద్యమ వెల్లువ తగ్గింది. విలువలు, ప్రమాణాలు తగ్గుతున్నాయి. సమాజంలో పెరుగుతున్న పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద విష సంస్కృతి ప్రభావం వేగంగా పెరుగుతోంది; బలపడుతోంది. స్వార్థం, అవినీతి, విలువల క్షీణత, విశృంఖలంగా పెరిగాయి. వీటి ప్రభావం ఉద్యమాలపై కూడా చెప్పుకోతగినంతగా వుంది. ఉద్యమాలలో క్షీణిస్తున్న విలువలు, నిబద్ధత, క్రమశిక్షణ; పదవుల కాంక్ష, ముఠాతత్వంలను చూచి మాధవ్ కలత చెందాడు. వాటి కొరకు ధృడంగా నిలబడి పోరాడాడు. విప్లవ రాజకీయాలుంటే చాలు, ఆర్థిక అవినీతి, విలువలు అంత పట్టించుకోవలసిన విషయాలు కావనే తప్పుడు ధోరణిని గట్టిగా వ్యతిరేకించి, సత్యం కొరకు విలువలకై నిలబడ్డాడు. ఇందుకు పెద్ద నాయకులను సైతం ఎదురించాడు. వ్యతిరేకించాడు. స్థానికంగా జరిగిన కల్లు, బక్రాన్ మొదలగు అవినీతి కుంభకోణాలను వెలుగులోకి తెచ్చి, నిర్మాణయుతంగా పోరాడటంలో ముందు వరుసలో నిలబడ్డాడు.

తన అభిప్రాయాలను దాచుకోకుండా, మొహమాటం లేకుండా వ్యక్తం చేయటం, భిన్నాభిప్రాయాలను ప్రజాస్వామికంగా గుర్తించి, కలిసి పనిచేయటం, క్రమశిక్షణకు కట్టుబడి పనిచేయటం మాధవరావు విశిష్ట లక్షణం.

## ప్రజాస్వామిక విప్లవోద్యమాలకు తీరని లోటు

మాధవరావు మరణం కేవలం ప్రజల హక్కుల ఉద్యమాలకేగాక, ప్రజాస్వామిక విప్లవోద్యమాలకూ తీరని లోటు. దేశంలో ఫాసిస్టు ఆరెస్సెస్–బిజెపి హిందూత్వ ఫాసిస్టు ప్రమాదం తీవ్రంగా ముందుకొచ్చిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల పౌరహక్కులు, ప్రజాస్వామిక హక్కుల ఐక్య ఉద్యమ ఆవశ్యకత ఎంతైనా వుంది. కార్మికులు, రైతాంగం, దళితులు, ఆదివాసులు, మహిళలు, తదితర తరగతుల ప్రజలు ప్రత్యేకంగా మైనారిటీల హక్కులు, రాష్ట్రాల హక్కులు, లౌకికవాదం, మతసామరస్యం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, వివిధ రాజ్యాంగ వ్యవస్థల రక్షణకై ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ముందుకొచ్చింది. ప్రజలు, ముఖ్యంగా రైతాంగం, కార్మికులు, ఇతర శ్రమజీవులు తమ మనుగడకూ, ఉపాధి కొరకూ పోరాడాల్సిన ఆవశ్యకత పెరుగుతోంది.

ఇటువంటి పరిస్థితులలో పెరుగుతున్న హిందూత్వ ఫాసిస్టు ప్రమాదానికి ప్రత్యేకంగా ప్రజల ఉద్యమం ప్రజా ఉద్యమాలు ప్రజల మధ్య మతం పేరిట విద్వేషాలు రెచ్చగొడుతున్న దానికి వ్యతిరేకంగా మతసామరస్యంలకై కృషి చేయాల్సిన అత్యవసర పరిస్థితుల్లో మాధవరావు లాంటి హక్కుల పోరాట యోధుడ్ని కోల్పోవటం పూడ్చలేని నష్టం. ప్రజల ఉద్యమాలు, పోరాటాలలో మనకు స్ఫూర్తిదాతగానూ, ఆదర్శమూర్తిగానూ నిరంతరం వుంటాడు. మహోన్నత వ్యక్తి మాధవరావు, ఆశయం, లక్ష్యంలను సాధించటానికి ప్రజలు, హక్కులు, ప్రజాస్వామ్యం ..... సమసమాజం లక్ష్యంగా కృషి చేయటమే మనం మాధవరావుకు అర్పించే నిజమైన శ్రద్ధాంజలి.

# బహుముఖ ప్రజ్ఞాశాలి – మా మాధవరావు సార్

**– ఎస్.జీవన్‌కుమార్,**

*మానవ హక్కుల వేదిక*

ప్రపంచ చరిత్రలో చాలా దేశాలలో వలస బానిసత్వానికి వ్యతిరేకంగా, సమాజాన్ని మౌలికంగా మార్చాలి , పెట్టుబడిదారీ విధానం నశించాలి, ఫ్యూడలిజాన్ని కూకటి వేళ్ళతో పెకిలించాలి అనే ఆశయాలతో వచ్చిన ఉద్యమాలు రైతాంగంతో పాటు, మేధావులనూ, యువకులనూ, విద్యార్థులనూ బాగా ప్రభావితం చేశాయి. 1960 దశకంలో ప్రపంచ వ్యాపితంగా దేశాలన్నింటా యువత ప్రతిఘటనాస్వరాలతో ఎలుగెత్తింది. కరడుగట్టిన, ఆధిపత్య, బానిస వ్యవస్థలను పెకిలించడానికి విద్యార్థి లోకం సన్నద్ధమైంది. 1969 లో వియత్నాంపై అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా నిరసన, మార్టిన్ లూథర్ కింగ్ హత్యకు వ్యతిరేకంగా బ్లాక్ పాంథర్స్ ఉద్యమాలు, జర్మనీలో విద్యార్థుల తిరుగుబాటు, పారిస్‌లో ఓ యూనివర్సిటీ విద్యార్థులపై లాఠీఛార్జీకి వ్యతిరేకంగా నిరసనలు, యుగోస్లావియాలో ప్రభుత్వ విధానాలపై తిరుగుబాటు, సోవియట్ యూనియన్ లో రాజకీయ సంక్షోభం– ఈ ఇదమిద్ధంగా ఎన్నో దేశాలలో విద్యార్థులు, యువజనులు నూతన వ్యవస్థ నిర్మాణానికి తమ వంతు పాత్ర పోషించడానికి ముందుకు వచ్చారు.

సరిగ్గా ఇదే సమయంలో భారత దేశంలో నక్సలైట్ ఉద్యమం అంకురించింది. భూమి కోసం, భుక్తి కోసం , ఫ్యూడలిజం నుండీ విముక్తి కోసం, అన్ని రకాల పీడనలకు వ్యతిరేకంగా రైతాంగ పోరాటాలు ప్రారంభమయ్యాయి. ఆంధ్ర రాష్ట్రంలో కూడా సామాజిక మార్పు కోసం ఆందోళనలు ప్రారంభమయ్యాయి.

ఈ ఉద్యమాలకు గొర్రెపాటి మాధవరావు కూడా ఆకర్షితుడయ్యాడు. విద్యార్థిగా, పిడిఎస్‌యు విద్యార్థి సంఘ సభ్యుడిగా మొదలైన ఆయన సామాజిక ప్రయాణం, నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం పని చేస్తున్న సంస్థలకు సన్నిహితం చేసింది.

తదనంతరం న్యాయవాదిగా జీవితం గడిపిన మాధవరావు, మానవ హక్కుల ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించారు.

మాధవరావు సార్, నిజామాబాద్ జిల్లాలో ఇంటర్ వరకూ ముగించుకుని, హైదరాబాద్ సిటీ కాలేజీలో డిగ్రీ చదివి, ఉస్మానియా యూనివర్సిటీ లో 1981 లో న్యాయవాద విద్య పూర్తి చేశారు. 1983 లో నిజామాబాద్ లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. కానూరు వేంకటేశ్వర రావు గారితో కలసి అరుణోదయ లో కళాకారుడిగా కూడా మాధవరావు సార్ ప్రయాణం మర్చిపోలేనిది. కానూరు రాసిన కళా రూపంలో గొంతెత్తి పద్యాలు పాడిన మాధవరావు గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

1931 లో నిజాం సాగర్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యాక, గుంటూర్, కృష్ణా, గోదావరి జిల్లాల నుండీ అనేక రైతు కుటుంబాలు, నిజామాబాద్ జిల్లాకు వలస వచ్చి, వ్యవసాయంలో స్థిరపడ్డారు. గుంటూర్ జిల్లా నుండీ అలా వలస వచ్చిన కుటుంబానికి చెందినవాడు మాధవ రావు. విద్యార్థిగా చాలా చురుకుగా ఉండే ఆయన, తెలంగాణలో పరిస్థితులనూ, తలెత్తుతున్న ఉద్యమాలను, ఉద్యమాలు లేవనెత్తుతున్న సమస్యలనూ ఆకళింపు చేసుకుని, సామాజిక మార్పు కోసం జరుగుతున్న ప్రయత్నంలో తన పాత్ర ఏమిటో నిర్ణయించుకున్నాడు. ఉస్మానియాలో మతవాదుల చేతుల్లో జార్జి రెడ్డి హత్య, ఎమర్జన్సీ కాలంలో నీలం రామ చంద్రయ్య గారితో పాటు, ఆయనకు సన్నిహితంగా ఉండే జంపాల చంద్ర శేఖర ప్రసాద్ కాల్చివేత, ఇతర విద్యార్థి నాయకుల హత్యలు , మాధవరావు భవిష్యత్ కార్యాచరణకు ఉత్ప్రేరకంగా పని చేశాయి.

నిజామాబాద్ లో న్యాయవాద వృత్తిని కొనసాగిస్తూనే, సిపిఐ (ఎం-ఎల్ ) న్యూ డెమోక్రసీ పార్టీకి సంబంధించిన అన్ని ప్రజా సంఘాలతో, సన్నిహిత సంబంధాలు కలిగి ఉండేవాడు. ఆ జిల్లాలో కార్మిక సంఘాలు లేవనెత్తిన కార్మిక వివాదాలను , కార్మిక శాఖ దగ్గరా, కోర్టులోనూ కూడా, కార్మికుల పక్షం విజయం సాధించేలా మాధవరావు న్యాయపరంగా అండగా నిల బడేవాడు. బీడీ కార్మికులు , షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, ఆర్టీసీ కార్మికులు, ఇతర అసంఘటిత రంగ కార్మికులు అలా న్యాయవాదిగా ఆయన సేవలను ఉపయోగించుకున్నారు.

నిజామాబాద్ జిల్లా వాసి అయిన PDSU నిర్మాత జంపాల చంద్ర శేఖర ప్రసాద్ పేరుతో, ట్రస్ట్ ను ఏర్పాటు చేసి, ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రంథాలయం నిర్వహించి, ప్రతి సంవత్సరం జంపాల ప్రసాద్ స్మారక ఉపన్యాసాలు ఏర్పాటు చేసి, -రెండు

దశాబ్ధాలకు  పైగా సాగిన కృషిలో, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీగా మాధవరావు కృషి కీలకమైనది.

మాధవరావు గారు, న్యాయవాదిగా కోర్టు లో వేసే వ్యాజ్యాలలో తనదైన ముద్ర వేసేవారు. నేను రెండు, మూడు సార్లు కోర్టులో మాధవరావు వాదన  చేస్తుండగా చూశాను. ఆయన చాలా నింపాదిగా, పూర్తి వివరాలతో కేసు సమర్పించి, దానికి సంబంధించిన సెక్షన్‌లను, ఆ సమస్యపై గతంలో వచ్చిన తీర్పులను ఉటంకించేవారు.

మరో మానవ హక్కుల న్యాయవాది బాలగోపాల్ కూడా ఆవేశంగా, ఆగ్రహంగా కోర్టులో ఎప్పుడూ వాదించేవాడు కాదు. "చాలా అన్యాయం మిలార్డ్ అని ఊరికే చెబితే న్యాయమూర్తికే అర్ధం కాదు, ఆ అంశాన్ని చట్టాల ఫ్రేమ్ వర్క్ లో ఇమిడ్చి చెబితే, జడ్జి అర్థం చేసుకుంటాడు. చాలా మంది జడ్జి లు సరిగా హెూమ్ వర్క్ చేయరు. అందువల్ల, జడ్జీ లు సులభ తరంగా విషయాలను అర్థం చేసుకునే పద్ధతిలో ,మన వాదనలు ఉంటే, జడ్జీ లు సరిగ్గా  తీర్పు చెప్పే అవకాశం ఉంది" అని బాలగోపాల్ అనేవాడు. మాధవరావు కూడా అదే ధోరణితో కేసులు వాదించేవాడు. కన్నాభిరాన్ గారు మాత్రం తన కున్న  న్యాయ పరిజ్ఞానాన్ని, సాహిత్య అంశాలనూ, రచయితలను ఉటంకించి, జడ్జీలను ఒక్క కుదుపు కుదిపేవాడు . కొందరు చాలా నిరాసక్తంగా వాదనలు వింటూ, కోర్టులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారు. అటువంటి వారిని మన జ్ఞానంతో ఒక్క కుదుపు కుదిపితే ఒళ్లు ధగ్గర పెట్టుకుని తీర్పులు రాస్తారు. అని కన్నాభిరాన్ అనే వారు. అందుకే సార్ వాదిస్తుంటే, జడ్జీలు జాగ్రత్తగా వినేవాళ్ళు.

కోర్టు కేసుల సందర్భంగా తనకు రావలసిన ఫీజు విషయంలో మాధవరావు అంత ఖచ్చితంగా ఉండేవాడు కాదని, పేదల ధగ్గర ఫీజు తీసుకోని సందర్భాలు చాలా ఉన్నాయనీ, ఆయన ఆఫీసులో జూనియర్ న్యాయవాదులు చెవుతారు.

ఎన్‌కౌంటర్ బాధితుల కుటుంబాలకు నష్ట పరిహారం ఇప్పించే విషయంలో ఆయన కోర్టు లో అసాధారణ ప్రతిభ చూపించాడు. నాకు తెలిసి, దేశంలో జరిగిన, జరుగుతున్న ఎన్కౌంటర్ హత్యల విషయంలో ఎక్కడా, నష్ట పరిహారం ఇప్పించిన సంఘటనలు లేవు అంటే అతిశయోక్తి కాదేమో. 1991లో నిజామాబాద్ దగ్గర భవానీ గుట్టపై జరిగిన ఎన్‌కౌంటర్‌లో హత్యకు గురైన లోలపు సమ్మయ్య, షేక్ మహమ్మద్‌ల విషయంలో, 1994లో నిజామాబాద్ మండలం ఓర్సే గ్రామంలో ఎర్రోళ్ల బుచ్చన్న  అనే అమాయకుడిని, అదే పేరుగల మిలిటెంట్ అనుకుని చంపిన కేసులో,

చాలా తెలివిగా కోర్టులో వాదించి, అవి పోలీసులు ఉద్దేశ్య పూర్వకంగా చేసిన హత్యలని నిరూపించి ఆ కుటుంబాలకు నష్ట పరిహారం ఇప్పించగలిగాడు.

దర్పల్లి మండలం దుబ్బాక గ్రామానికి చెందిన బాణాల కోటయ్య అనే రైతును దొంగగా ముద్ర వేసి పోలీసులు ఎన్ కౌంటర్ పేరిట చేసిన హత్య విషయంలో కూడా ఆయన చాలా విజ్ఞతతో వాదించి, నష్ట పరిహారం ఇప్పించగలిగారు. ఆక్సిలరీ ప్రమోషన్ కోసం యాంటీ నక్సలైట్ స్క్వాడ్‌లో పనిచేసే మధుకర్ అనే పోలీస్ ఇన్స్పెక్టర్, ఒక అమాయక బాలుడిని చంపి, గుర్తు తెలియని నక్సలైట్ అని ప్రమోషన్ కోసం దరఖాస్తు పెట్టుకున్నాడు. ఆ కేసులో కూడా అది బూటకాపు ఎన్ కౌంటర్ అని మాధవరావు సార్ వాదన చేశాడు. ఈ కేసులో ఆ పోలీసు అధికారికి 8 సంవత్సరాల శిక్ష పడింది. తప్పుడు అఫిడవిట్ సమర్పించినందుకు న్యాయవాదిలా డిగ్రీని రద్దు చేశారు.

మాధవరావు సార్, తన ఆఫీసులో జూనియర్ న్యాయవాదులకు అన్ని విషయాలు బోధిస్తూ, సరైన శిక్షణ ఇచ్చేవారని చెబుతారు. మాధవరావు మంచి చదువరి. నవలలు, కథలు, అభ్యుదయ సాహిత్యం బాగా చదివారు. ప్రసిద్ధి గాంచిన చాలా ఆంగ్ల నవలలు కూడా చదివారు. ఆయన వ్యాసం రాసినా, ఉపన్యాసం ఇచ్చినా, రాజకీయ శిక్షణా తరగతులలో క్లాసులు చెప్పినా , విషయాలను చాలా సరళంగా, ఒక పద్ధతిలో ముందు పెడతారు. చాలా సంక్లిష్టమైన విషయాలను కూడా ,సులువుగా అర్థం అయ్యేలా  చెబుతాడు. డి. డి. కోశాంబి ఎక్జాస్పరేటింగ్ ఎస్సేస్  పేరుతో వెలువడ్డ ఇంగ్లీషు వ్యాసాలను ఆచరణలో గతి తర్కం పేరుతో తెలుగులోకి అనువదించాడు. మంచి అనువాదకుడు. క్రిమినల్ చట్టాలకు సంబంధించిన కొన్ని అంశాలను తెలుగులోకి అనువదించాడు. మానవ హక్కుల వేదిక బులెటిన్ లో ప్రచురించిన ఐదు వ్యాసాలలో హక్కుల అంశాలపై వివరణ ఇచ్చాడు. విమోచన, విజృంభణ పత్రికలకు ముఖ్యుడిగా, తన నైపుణ్యాలను ప్రదర్శించాడు. రెండేళ్ల క్రితం విశ్వ మానవ హక్కుల ప్రకటనను ఒక కథ రూపంలో రాశి కరపత్రాలుగా ప్రచురించాడు. 1992 లో ఖాయిలా పడ్డ పరిశ్రమలు – కార్మిక బతుకులు అనే శీర్షికతో మాధవరావు రచనను  APCLC చిన్న పుస్తకంగా వేసింది. జంపాల మెమోరియల్ ట్రస్ట్ తరపున నిర్వహిస్తున్న గ్రంధాలయం చూసినా, అక్కడ ఏర్పాటు చేసిన స్మారక ఉపన్యాసాలు చూసినా ఆయన కున్న అపార జ్ఞాన సంపద, సాహిత్యం పట్ల ఆయనకు ఉన్న మక్కువ మనకు అర్థమవుతుంది.

ఆయన 1985 లో ఆంధ్ర ప్రదేశ్  పౌర హక్కుల సంఘంలో చేరినట్లు నాకు గుర్తు. గతంలో కన్నెగంటి నరసింహారావు, సి. హెచ్. మధు జిల్లా పౌర హక్కుల సంఘంలో బాధ్యులుగా ఉన్న కాలంలో మాధవరావును చూసినట్లు నాకు జ్ఞాపకం

లేదు. బాలగోపాల్ తో కలసి ఎన్ కౌంటర్లు, కస్టడీ మరణాలు, హక్కుల ఉల్లంఘనలు, విషయాలపై విస్తృతంగా తిరిగి నివేదికలు తయారు చేయడంలో మాధవరావు భాగస్వామి.

నిజామాబాద్ పట్టణంలో మంత్రాలు చేస్తున్నారనే నెపంతో ఒక కుటుంబాన్ని గడ్డివాములో వేసి దహనం చేసిన కేసులో నేను, వసంత లక్ష్మీ విషయ సేకరణ చేస్తే, సార్, మంచి నివేదిక రాశారు. కొన్ని ఎన్ కౌంటర్ సంఘటనల నిజ నిర్ధారణలకు , నేను కూడా సార్ తో కలసి వెళ్ళిన జ్ఞాపకాలున్నాయి.

1998 లో మానవ హక్కుల వేదిక ఏర్పడినప్పుడు, హైదరాబాద్ లో జరిగిన చర్చ సందర్భంగా, వచ్చిన 32 మందిలో మాధవరావు సార్ కూడా ఉన్నారు. అప్పుడే మేము కొన్ని విశాలమైన హక్కుల అంశాలతో ఎజెండా ఏర్పాటు చేసుకుని కార్యక్రమాలు ప్రారంభించాం. కానీ మాధవరావు సార్, ఏవో కారణాల వల్ల నిజామాబాద్ లో కార్యక్రమాలు చేపట్టలేదు. పౌర హక్కుల సంఘంలో దాదాపు రెండు సంవత్సరాలు హక్కుల దృక్పథంపై జరిగిన చర్చలలో, చురుకుగా పాల్గొనలేదు. చర్చకు సంబంధించిన అవగాహన పత్రాల సంకలనానికి కూడా వ్యాసం రాయలేదు. మానవ హక్కుల వేదిక ఏర్పడ్డ తరువాత నేను, బాలగోపాల్ ఒకసారి నిజామాబాద్ వెళ్ళినప్పుడు సార్ ను కలిశాం కూడా. అప్పుడు, ఆలోచిస్తాను, కొంచెం సమయం కావాలి అని అన్నారు. బాలగోపాల్ మరణం తరువాత తానే వచ్చి, సంస్థలో సభ్యుడిగా పని చేస్తానని, ప్రకటించి, అప్పటి నుండీ అత్యంత క్రియాశీలం గా పని చేశాడు.

మా బులెటిన్‌కు వ్యాసాలు రాశాడు. కేసుల విషయంలో సంస్థలో ఉన్న న్యాయవాదులకు సూచనలు,సలహాలు ఇస్తుండేవాడు. అవగాహన తరగతుల్లో హక్కుల అంశాలపై క్లాసులు బోధించే వారు. సంస్థ నిర్వహించిన ఆన్ లైన్ తరగతుల్లో ఓపికగా ఉపన్యాసాలిచ్చాడు. నిజామాబాద్ లో కళాశాలల్లో, స్కూల్స్ లో ఎక్కడ వీలైతే అక్కడికి వెళ్ళి మానవ హక్కుల అవగాహన పై ఉపవన్యాసాలిచ్చేవాడు.

మాధవరావు చాలా మృదు స్వభావి. మా కార్యవర్గ సమావేశాల్లో ఎప్పుడూ ఆవేశంగా మాట్లాడడం నేను ఎరగను. మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు బాధ్యతలలో ఉండి, అప్పుడప్పుడూ ఆరోగ్యం సహకరించకపోయినా, సంస్థ కార్యక్రమాలకు అంతరాయం కలగకుండా చూసేవాడు.

2022లో మానవ హక్కుల వేదిక రాష్ట్ర మహాసభలు నిజామాబాద్‌లో నిర్వహిస్తామని ప్రతిపాదన పెట్టినప్పుడు, దిగజారుతున్న తన ఆరోగ్య పరిస్థితిలో సభలు నిర్వహించడం వత్తిడితో కూడుకున్న పని అని మేము అన్నాం. ఆయన

మాత్రం, మాకు చాలా మంది కార్యకర్తల బృందం ఉంది, నాకేం కష్టం కాదు అని, పట్టుదలతో సభలను సమర్ధవంతంగా నిర్వహించాడు. అంతకు ముందు నుండే ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి, మీనా గారు ఎప్పటికప్పుడు తెలియ చేస్తూనే ఉన్నారు. సంస్థలో బాధ్యులుగా ఉన్న మేము ఆయన ఆరోగ్య పరిస్థితిని గమనిస్తున్నాం కనుక, సార్ కు కొంత విశ్రాంతి కల్పించడానికి, కొత్త నాయకత్వాన్ని ఎన్నుకున్నాం.

ఆయన స్వభావ రీత్యా, ఎప్పుడూ ఏ వివాదాలలో ఇరుక్కు పోలేదు. ఆయనది చాలా పెద్ద వైవిధ్యమైన మిత్ర బృందం. ఆ సమూహంలో న్యాయవాదులు,న్యాయమూర్తులే కాకుండా డాక్టర్లు, కవులు, రచయితలు, కళాకారులు ఉన్నారు. వాళ్ళందరితో ఆయన ఎప్పుడూ సజీవ సంబంధాల్లో ఉండేవాడు.

ఎంత విమర్శకయినా ఆయన సహజ మందహాసంతో సమాధానం చెప్పేవాడు. చాలామంది అభ్యుదయ వాదులు అని చెప్పుకున్న వాళ్ళు, తమ కుటుంబ వ్యవహారాలు, జీవిత భాగస్వామితో బేధాభిప్రాయలు వచ్చినప్పుడు వాటిని పరిష్కరించుకునే విషయంలో చాలా విమర్శలు ఎదుర్కోవడం మనం చూశాం. మాధవరావు కూడా తన వ్యక్తిగత జీవితంలో సమస్య ఎదురైనప్పుడు, చాలా హుందాగా, న్యాయపరంగా ఆ సమస్యను పరిష్కరించుకున్నారు. ఎవరూ కూడా ఆ విషయంలో ఆయన వైపు వేలెత్తి చూపలేదు. నేను సంస్థ పనిమీద లేదా, మా ఆవిడ తో వాళ్ళ బంధువుల ఇంటికి వెళ్ళినా, నిజామాబాద్ వెళ్ళిన ప్రతిసారీ తప్పక సార్ ఇంటికి వెళ్ళే వాళ్ళం. వాళ్ళ ఇంట్లో ఆతిథ్యం మరువలేనిది. మీనా గారైతే ఏదో ఒకటి తప్పకుండా తినిపించి పంపేది.

పౌర సమాజంలో క్రియాశీల భాగస్వామ్యం తీసుకోవాలన్న స్పృహ, సంకల్పం రోజు రోజుకూ తగ్గిపోతున్న తరుణంలో మాధవరావు సార్ భౌతికంగా దూరం కావడం విషాదమే. ఆర్థిక వనరులు, హోదాలు, అంతస్తులు సృష్టించుకోవడం అంతా కష్టమైన పని ఏమీ కాదు. నైతిక విలువలను సృష్టించడం, ఆ విలువలను కాపాడుకుంటూ జీవించడం చాలా కష్టమైన పని. అలాంటి విలువలతో జీవించిన వ్యక్తి కనుమరుగు కావడం సార్ జీవిత భాగస్వామి మీనా సహాని, బిడ్డలు మానస, ఆదిత్య (స్మైలీ) సహా మా అందరికీ అత్యంత విషాద కరమే. మాధవరావు సార్ భౌతికంగా లేకపోయినా, మనం చేపట్టే అన్ని హక్కుల కార్యక్రమాలలో ఆయన తలపులతో ముందుకు పోదాం.

మాధవరావు సార్‌కు మానవ హక్కుల శాల్యూట్.

# అమరత్వం ఆదేశిస్తుంది...

**– పి.సూర్యం**
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
*సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ, తెలంగాణ*

రెండు విప్లవ సంస్థల ఐక్యతా సభ నిర్వహణలో నిమగ్నమై ఉన్నాం. ఆ సభలో పంజాబ్‌కు చెందిన పార్టీ ప్రముఖ సీనియర్ కేంద్ర నాయకులు కామ్రేడ్ దర్శన్ సింగ్ ఖట్కర్ ప్రధానవక్త. దీనికి సరళంగా, సరిగ్గా ఎవరు అనువాదకులు? ఇంకెవరూ? మన మాధవరావే.

ఈ సంబరంలో మరొక దుర్వార్త. సభ ముందు రోజే గుండె నొప్పితో కామ్రేడ్ మాధవరావుని హాస్పిటల్‌లో చేర్పించారని. ఎప్పటికప్పుడు తన ఆరోగ్య పరిస్థితిని వాకబు చేస్తున్నాం. సభ వార్తలనైనా పరికిస్తాడనుకున్నాం. ఆయన విమర్శనాత్మక విశ్లేషణలు మాకు బలాన్నిస్తాయనుకున్నాం. అవేమీ లేవని తేలిపోయింది. సభకు రాలేదని నిజామాబాద్ కామ్రేడ్స్ నిర్ధారించారు. కోలుకోవడానికి సమయం పడుతుందని చెప్పారు. కానీ మన ఆకాంక్షలన్నీ పటా పంచలైపోయినాయి. 28న ఐక్యతా సభ రోజు ఉదయం 7.30గంటలకు మన మాధవరావు మనకు శాశ్వతంగా దూరమైనట్లు వినకూడని వార్త చేరుకున్నది. కొద్దిసేపట్లో సభ ప్రారంభం కావాలి. కలచివేస్తున్న సహచరుని మరణ వార్త. విచార వదనంతో సభా ప్రాంగణం. కంటిలో తడి ఒత్తుకున్నాం, కర్తవ్యాన్ని స్మరించుకున్నాం. అమర్ రహే మాధవరావు, మాధవరావు ఆశయాలను సాధిస్తాం. ఆ విధంగా ఆయనకు ఐక్యతా సభ విప్లవ శ్రద్ధాంజలి ఘటించింది.

సుదీర్ఘకాలం పౌరుల హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడిన యోధుడు మాధవ్. మెజారిటీ ప్రజల హక్కులు హరించడానికి వివక్ష, అణచివేత, పీడన సమాజమే కారణంగా శాస్త్రీయ బోధన చేశాడు. అసమానపు సమాజంలో పోరాటాలు సహజమని విశ్వసించాడు. అసమానపు చైతన్య స్థాయి ఫలితమే అసమానపు పోరాటాలు. ఈ పోరాటాలు విప్లవీకరించినప్పుడు వ్యవస్థ పునాదులు కదిలిపోతాయని వర్గ పోరాటాల ఆవశ్యకతను బోధించాడు. దానికోసం మార్క్సిస్టు సాహిత్యాన్ని అధ్యయనం చేశాడు.

దాన్ని ఎంతో సరళీకరణ చేసి అనువదించాడు.వివరించాడు. ఆ విధంగా ఆయన అధ్యయనం ఆయన కోసమే కాకుండా, ఎంతో మంది చైతన్యానికి తోడ్పడింది.

ఆయన నిబద్ధత, నిమగ్నత కలిగిన మార్క్సిస్టు–లెనినిస్టు. దానిని తనకు తాను అన్వయించుకుని సంఘటిత పరుచుకున్న విప్లవకారుడు. విప్లవోద్యమ నిర్మాణంలో అపసవ్యపు భాగాలను ఎత్తిచూపడంలో వెనకాడని వ్యక్తి. వివిధ వేదికల్లో ఆయన విశ్వసిస్తున్న వాటిపై నిర్మొహమాటంగా వ్యక్తపరిచేవాడు. ఆచరణపై కూడా అదే తీరు వ్యాఖ్యానాలు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో అవి సూటిగా, కఠినంగా కూడా ఉంటాయి. అవి కొంతమందిని బాధ పెట్టినట్లు భావిస్తారు. ఏ స్థాయి వారైనా ఆయన అనుకున్నది కుండ బద్దలు కొట్టినట్లు చెప్పాల్సిందే.కానీ అవి వ్యక్తిగత విమర్శలు ఎంత మాత్రం కాదు. ఏ వ్యక్తీ ఎప్పుడూ తనకు లక్ష్యంగా ఉండదు. ఆ వ్యక్తుల్లో వ్యక్తమవుతున్న ధోరణులపైనే ఆయన విమర్శ. వాటితో అందరికీ అంగీకారం ఉండకపోవచ్చు. ఆయన దృఢంగా భావించే వాటిని అద్భుతంగా వ్యక్తీకరించడానికి వెనకాడని శక్తిమంతుడు. అదే సమయంలో స్నేహితులు, కామ్రేడ్స్ ఎడల ఆత్మీయత, ఆప్యాయత ఆలింగనం చేస్తుంటాయి. పీడిత ప్రజల ఎడల, వివక్షకు గురయ్యే వారి ఎడల నిండు హృదయంతో అంతే దయా దక్షిణ్యాలు మెండుగా నింపుకొని ఉంటాయి.

ఈ సంవత్సరంలోనే రెండు సందర్భాల్లో పది రోజులు తనతో కలిసి ఉండే అవకాశం లభించింది. ఆ సందర్భంలో ఆయన అలసట ఎరగని శ్రమించిన తీరు మర్చిపోలేం. ఎవరికి ఎలాంటి లోటు లేకుండా అందరికీ అన్ని రకాల సౌకర్యాల ఏర్పాటు గురించి తీసుకున్న జాగ్రత్తలు అందరినీ అబ్బురపరచాయి. ఆ సందర్భంగా మాధవరావు కురిపించిన పలకరింపులు, ప్రేమాచిత్రం, విరబూసిన నవ్వు మా ముందు కదలాడుతుంది. అప్పటికే తన ఆరోగ్యం బాగాలేదని అవకాశం ఉన్న సౌకర్యాన్ని వినియోగించుకోమన్నాం. తన అనారోగ్యాన్ని మరిచి అందరితో జీవించడంలోనే తన ఆనందాన్ని పొందుతున్నానన్నాడు.

కామ్రేడ్ మాధవరావుని ఇంత త్వరగా కోల్పోవడం మనందరినీ తీవ్ర వ్యధకు గురిచేసింది. ఆ బాధ తీరేది కాదు. అదే సమయంలో ఆయన అమరత్వం మనల్ని ఆదేశిస్తుంది. ఆయన గొప్ప లక్షణాలు మనల్ని అనునిత్యం వెంటాడుతూనే ఉంటాయి. వాటిని అలవర్చుకుందాం. అక్కున చేర్చుకుందాం. సదా స్మరించుకుందాం.

# విప్లవోద్యమ ప్రక్షాళనకు అమరజీవి మాధవరావు జీవితం ఓ కర్తవ్యోపదేశం

**– పి. ప్రసాదు**

*ఐఎఫ్‌టియు జాతీయ నాయకులు*

తెలుగు సీమలో 2024 లో కేవలం నాలుగు నెలల స్వల్ప వ్యవధిలో ఇద్దరు విప్లవ మిత్రులు అమరత్వం పొందారు. ఆ ఇద్దరి మధ్య ఈ క్రింది అనేక పోలికలున్నాయి.

1) ఆ ఇద్దరూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన వారే !

2) ఆ ఇద్దరు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (PDSU) రాజకీయ నేపథ్యం గలవారే

3) ఆ ఇద్దరు ఉస్మానియా క్యాంపస్ ఓయూలో విప్లవ విద్యార్థి వుద్యమ నేతలుగా ఎదిగిన వారే !

4) ఆ ఇద్దరు ఇరుగు పొరుగు కళాశాలైన ఆర్ట్స్ అండ్ లా కళాశాలల్లో చదువుతూ ఇరుగుపొరుగునున్న A AND E హాస్టళ్లలోని తమ రూముల్ని PDSU కార్యకలాపాల కేంద్రాలుగా మార్చిన వాళ్లే !

5) ఆ ఇద్దరు విద్యార్థి జీవితంలో ఒకవైపు ఉద్యమకారులుగా వర్ధిల్లుతూనే, మరోవైపు ఒకరు గోడ పత్రికల ప్రచురణ బాధ్యతనూ, మరొకరు విప్లవ పక్ష పత్రిక ప్రచురణ బాధ్యతనూ చేపట్టి విజయవంతంగా నిర్వహించిన వారే !

6) ఆ ఇద్దరు విద్యార్థి దశ ముగిసిన తర్వాత కూడా విప్లవ పథంలో తమ వంతు బాధ్యత నిర్వహించాలని నిర్ణయించుకున్న వారే !

7) వారిలో ఒకరు వృత్తి పరంగా అధ్యాపక వృత్తి ద్వారా, మరొకరు న్యాయవాద వృత్తి ద్వారా, సామాజిక స్పృహతో కృషి చేసిన వారే !

8) ప్రవృత్తి పరంగా వారిలో ఒకరు సాహితీరంగాన్నీ మరొకరు హక్కుల రంగాన్నీ ఎంచుకొని తుది శ్వాస వరకు కృషి చేశారు.

9) వారు వృత్తిపరంగా ఒక్కొక్క ప్రాంతానికే పరిమితమైన, ప్రవృత్తి పరంగా ఒకరు ఉత్తర తెలంగాణ నుంచి శ్రీకాకుళం (ఉత్తరాంధ్ర) వరకూ విప్లవ సాహిత్యాయానం సాగించడం ద్వారా, మరొకరు రెండు తెలుగు రాష్ట్రాల మానవ హక్కుల పోరు పథంలో ప్రయాణం సాగించడం ద్వారా సమస్త తెలుగు సీమలో విప్లవ బుద్ధి జీవులుగా ఆదరణ పొందారు.

10) ఆ ఇద్దరి మధ్య వ్యక్తిగత ప్రేమ బంధం, కామ్రేడ్లీ రాజకీయ బంధం ఐదు దశాబ్దాల జీవన యానానికే పరిమితం కాకుండా, మరణాంతర దశలో కూడా అమర బంధంగా ఆవిష్కృతమైనది. ఆ ఇద్దరే డా. కే. ముత్యం,గౌరైపాటి మాధవరావు. కామ్రేడ్ ముత్యం 20-8-2024న ,కామ్రేడ్ మాధవ్ 28 -12-2024 న అమరత్వం పొందారు. ఈ విప్లవ బుద్ధి జీవుల ద్వయం అటు ఐదు దశాబ్దాల జీవన యానంలో ఇటు అమరత్వం పొందడంలో తమమధ్య వీడని అపురూప అమర ప్రేమ బంధాన్ని ప్రదర్శించడం విశేషం ! ఆ ఇద్దరు అమర్ రహే ...

పై ఇద్దరు నాకు నాలుగున్నర దశాబ్దాలకు పైగా అనుబంధం వుంది. ఈ సుదీర్ఘకాలంలో అనేక దశలున్నాయి

ఉపదశలు కూడా ఉన్నాయి, ఒక్కొక్క దశలో అనేకానేక ఘటనలున్నాయి. ఉదంతాలున్నాయి. కామారెడ్డి, నిజామాబాద్, ఉస్మానియాల అనుబంధం, నెల్లిమర్లలో పునరావిష్కరణ జరిగి శ్రీకాకుళం వరకూ వర్ధిల్లిన నేపథ్యం వుంది. ఈ సుదీర్ఘ అపురూప విప్లవ జ్ఞాన బంధం మరపురానిది. ఈ ఇద్దరి అమర స్మృతుల గూర్చి రాస్తే ఒక్కొక్క చిన్న పుస్తకం అవుతుంది. ప్చ్! వాటికీ అక్షర రూపం యివ్వలేని నిస్సహాయ స్థితిలో వున్నాను.

1978 నుంచి నేటి వరకు కామ్రేడ్ మాధవ్‌తో అనుబంధాన్నీ, అనుభవాలను అనుభూతులనూ జ్ఞాపకాలనూ గుర్తు చేసుకొని వ్యాసం రాసే అవకాశం యిప్పుడు లేదు. బయటపడలేని మరో ముఖ్యమైన పనిలో మునిగివున్నాను.

కామ్రేడ్ మాధవ్ స్మారక సావనీర్ ను కామ్రేడ్ మాధవ్ సంతాప సభ (11.01.2025) నాటికి ప్రచురించి ఆవిష్కరించాల్సిన బాధ్యత దాని ప్రచురణ కర్తలది. ఈలోపు సంతృప్తికరంగా రాసి అందించ లేని స్థితి నాది .

సరిగ్గా యిలాంటి స్థితిలోనే కామ్రేడ్ ముత్యం గూర్చి ప్రచురించిన సావనీర్ కు నా వ్యాసాన్ని యివ్వలేకపోయా, అదో లోపం, ఇప్పుడు పునరావృతమతోంది. గుడ్డి కంటే మెల్ల మేలు అనే భావంతో ప్రచురణకర్తల కోరికపై ఆధారపడి కామ్రేడ్ మాధవ్‌తో నా జ్ఞాపకాలలోకి వెళ్ళకుండా క్లుప్తంగా స్పందిస్తున్నాను.

అత్యున్నత సమాజ స్థాపన కోసం ఆవిర్భవించిన అత్యుత్తమ సిద్ధాంతమే మార్క్సిజం ! అదే కమ్యూనిజం!

ఒక మాటలో చెప్పాలంటే సామ్యవాద సిద్ధాంతమంటేనే అత్యున్నత మానవీయ సిద్ధాంతం!

yes, the communism is nothing but highest humanism.

అది దోపిడీ, పీడన ,ఆకలి, దారిద్ర్యం ,కన్నీళ్లు లేని అత్యున్నతమైన మానవీయ సామాజిక వ్యవస్థ నిర్మాణానికి దారి చూపించే అత్యుత్తమ సిద్ధాంతం! దాని ఆధారంగా నిర్మాణమయ్యే సమాజం భ్రమాజనితమైన మధుర స్వప్నం కాదు. భ్రాంతి పూర్వక వసుధైక కుటుంబం వంటిది కాదు. అది పీడిత ప్రజలను విప్లవ కార్యచరణలో భాగస్వామ్యం చేయడం ద్వారా సుసాధ్యమై సహకార రూపం ధరించే నిప్పు లాంటి నిజమే.

ఇలా ప్రజలను భాగస్వామ్యం చేయకపోతే కమ్యూనిజం ఒక తియ్యటి కలగానే మిగిలిపోతుంది. అందుకే కమ్యూనిస్టు సిద్ధాంతంతో పాటు కమ్యూనిస్టు కార్యచరణ అనివార్యమైన ఆవశ్యకత వుంది. ఈ కారణంగానే కమ్యూనిస్టు పార్టీల నిఘంటువు (డిక్షనరీ) లో “విప్లవ సిద్దాంతం – విప్లవాచరణ” అనే జంట పదాలు కరదీపికగా మారాయి. ఈ రెండింటి సమన్వయంతోనే విప్లవోద్యమం పురోగమిస్తోంది. కమ్యూనిస్టుల మొఖాల్ని ప్రతిబింబింపజేసే అద్దం(దర్పణం)గా రూపొందుతుంది. అది వుద్యమకారుల నుండి విప్లవకారుల వరకూ

వర్తిస్తుంది. అమరజీవి కామ్రేడ్ మధవ్ సాధారణ వుద్యమకారుడే కాదు. కమ్యూనిస్టు సిద్ధాంతం వెలుగులో విప్లవ దార్శకునిగా మారిన ఉద్యమకారుడు కూడా! అట్టి మన మాధవ్ రూపాన్ని పైన పేర్కొన్న అద్దంలో దర్శించి విశ్లేషించాల్సివుంది. ఇటీవల కమ్యూనిస్టు వుద్యమాలు బలహీనపడడంతో పాటు కమ్యూనిస్టు నిర్మాణలు కూడా తమ సహజ రాజకీయ, నైతిక ప్రతిష్టల్ని సామాన్య ప్రజల దృష్టిలో మసక బార్చుకుంటున్నాయి.

ఈ నేపథ్యంలో ఒక వ్యాఖ్య (కామెంట్) ఉనికిలోకి వస్తుంది. అదే కమ్యూనిస్టు నిర్మాణాలలో కంటే వాటి నిర్మాణ చట్రాలకు బయట ఎక్కువమంది కమ్యూనిస్టు సిద్ధాంత నిబద్దులు వున్నారని వ్యాఖ్య!

ఇది సత్యం అవునో కాదో తూకం వేసి చెప్పలేము. అదే సమయంలో అది పచ్చి అబద్ధమని కూడా చెప్పలేము. అది పూర్ణ సత్యం కాకపోయినా పాక్షిక సత్యమో

లేదా అర్థ సత్యమో కాకుండా పోదు. ఇదో భౌతిక సత్యంగా గుర్తించిన తర్వాత ఆ వ్యాఖ్యకి  కొనసాగింపు కూడా వుంటుంది.

అదే కమ్యూనిస్టు నిర్మాణాలలోని కొందరి వ్యక్తిత్వాల కంటే, బయటి సమాజంలోని కొందరు పౌరుల వ్యక్తిత్వాలు కమ్యూనిస్టు వ్యక్తిత్వానికి సమీపంగా లేదా అతి సమీపంగా వున్నాయనే మాట! ఈ కొందరు పదంలో కమ్యూనిస్టు క్యాడర్ మాత్రమే కాకుండా " లీడర్స్" కూడా వుంటారని మరో నిజం అవుతుంది. ఇది పార్లమెంటరీ వామపక్షాల్ని ఉద్దేశించి చెబుతున్న మాట మాత్రమే కాదు. పార్లమెంటేతర విప్లవ కమ్యూనిస్టు నిర్మాణాల్ని ఉద్దేశించి చెప్పే మాట కూడా! పైగా నేను ఆ కోవకు చెందిన ఒక నిర్మాణంలో ఒక స్థాయి ఉన్నత నాయకత్వ స్థానంలో వుంటూ స్వానుభవంతో చెబుతున్న మాట కూడా !

ఏకకాల విప్లవంతో ఏర్పడే ఏకాదశ సామాజిక వ్యవస్థ కాదు. అది కొన్ని మధ్యంతర దశల ద్వారా సాధ్యమయ్యేది. నేటి విప్లవ దశ సమస్త సొంత ఆస్తుల్ని రద్దు చేసేది కాదు. ఇది భారీ ఉత్పత్తి సాధనాల రద్దుకి పరిమితం. ప్రజలకు జీవనోపాధిని కల్పించే సొంత ఆస్తుల జోలికి వెళ్ళబోదు. ప్రజలతోపాటు కమ్యూనిస్టులు కూడా ఈ విప్లవ దశలో జీవనోపాధినిచ్చే సొంత ఆస్తిని కలిగి ఉండొచ్చు. అదే సమయంలో సాధారణ పీడిత ప్రజలకూ, కమ్యూనిస్టులకూ మధ్య నేటి సామాజిక వ్యవస్థలో స్పష్టమైన గీత ఉంటుంది. భవిష్యత్తులో నిర్మాణం కానున్న కమ్యూనిస్టు సమాజానికి నేటి కమ్యూనిస్టులు బీజరూపంలో ప్రాతినిధ్యం వహిస్తారు. అందులో కొందరు నేటి నుంచే నిరాస్తిపరులుగా మారి ఆదర్శ కమ్యూనిస్టులుగా మారవచ్చు. అది ఇక్కడ ప్రస్తావన అంశం కాదు. సాధారణ ప్రజల సగటు జీవన ప్రమాణాలతో జీవించడానికి అవసరమైన సొంత ఆస్తుల్ని కమ్యూనిస్టులు కలిగి ఉంటారు. అది కూడా ఇక్కడ చర్చనీయాంశం కాదు. కానీ కమ్యూనిస్టులు సొంత ఆస్తి యావను కలిగి ఉండరాదు. అంటే సొంత ఆస్తిపట్ల మమకారం ఉండరాదని అర్థం. ముఖ్యంగా తమకు కుటుంబ పరంగా సాంప్రదాయంగా సిద్ధించిన ఆస్తులు మరియు తమ శ్రమతో పొందిన ఆస్తుల వరకు అభ్యంతరం లేదు. కానీ కమ్యూనిస్టు నిర్మాణాల్లో నాయకత్వ స్థానాల్లో ఉంటూ, అంతకంటే అదనపు ఆస్తుల్ని పొందడం అభ్యంతరకరం. మరీ ముఖ్యంగా కమ్యూనిస్టు నిర్మాణాల్లో నాయకత్వ స్థానాల్లోకి వచ్చిన తర్వాత అంతకుముందు లేని సొంత ఆస్తులు చేకూరడం అభ్యంతరమైనది, పైగా శ్రామిక వర్గ విప్లవ సంస్థలకు సారథ్యం వహిస్తూ ,శ్రామిక వర్గం కార్చిన చెమట చుక్కలకు పొందాల్సిన ప్రతిఫలంలో వారిని చీకట్లో ఉంచి వాటా పొందే ఆలోచనలు విప్లవ వ్యతిరేకమైనవి కూడా. అలాంటి

విప్లవ వ్యతిరేకమైన అన్యవర్గ ధోరణులపై అంతర్గత పోరాటంలో కామ్రేడ్ మాధవ్ స్థానం ఆవిష్కృతం అవుతుంది. విషాదకర ధ్వంసరచన వికటించి వికృత దుష్ఫలితాలను ఇచ్చే క్రమం ఒక సానుకూల పునర్నిర్మాణ ప్రక్రియకు దారితీస్తుంది. అలాంటి ఓ సందర్భంలో కామ్రేడ్ మాధవ్ భౌతికంగా మరణించాడు. ఔనుమరి ఒక జననంలో ఒక మరణం అన్నట్లు రెండు సిపిఐ(యం-యల్) న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభ రోజే కామ్రేడ్ మాధవ్ మరణించడం ఓ విషాదమే. అది ఓ యాదృచ్ఛిక సంఘటనయే. అదే సమయంలో అది కామ్రేడ్ మాధవ్ ఆశించి కలలుకన్న విప్లవ విలీన స్వప్నం ఫలించే వేళ సంభవించడం వల్ల అదొక సందర్భోచిత సంఘటనగా కూడా మారింది. దానిని కూడా అవలోకించుదాం.

28-12-2024 వ తేదీన హైదరాబాద్‌లో విలీన సభకు ఉత్సాహంతో హాజరై నూతనోత్తేజం పొందాల్సిన కామ్రేడ్ మాధవ్‌కు అట్టి సావకాశం దక్కలేదు. పైగా ఆనాటి సభకు తెలుగు సీమలో నలుమూలల నుంచి హాజరైన విప్లవోద్యమ ప్రతినిధులైన సభికుల చేత కామ్రేడ్ మాధవ్ విప్లవ నివాళులు అందుకోవాల్సిరావడం విషాదకరమైనదే. ఆయన ఆశించిన విలీనం ఆరోజు జయప్రదంగా జరిగింది. కానీ, ఆ అపురూపదృశ్యాన్ని తిలకించే అవకాశం ఆయన కళ్ళకు లేకుండా పోయింది. అవి మెడికల్ కాలేజీకి చేరడం విశేషం.

విప్లవోద్యంలో సంభవిస్తున్న అలీనాలు, విలీనాలు ఎందరెందరినో ప్రభావితం చేస్తున్నట్లే కామ్రేడ్ మాధవ్‌ని కూడా ప్రభావితం చేసేవే. పైగా అవి ఆయన విప్లవ రాజకీయ జీవితంలో ముడిపడ్డ ప్రక్రియలు కూడా! అందుకే వాటిని పర్యావలోకనం చేస్తూ కామ్రేడ్ మాధవ్‌పై నా వ్యాసాన్ని ముగిస్తున్నాను.

వర్ధమాన విలీనం వెనక గత అలీనం దాగి ఉంది. గత అవాంఛనీయ అలీనాల చేదు అనుభవాల వెలుగులో నేటి వీలీన ప్రక్రియ సుసాధ్యమైనది. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ గతంలోకి వెళ్లడం లేదు. ఒక దశాబ్ద అలీనాల నేపద్యాం వరకే పరిమితం అవుదాము. తెలుగు సీమ విప్లవోద్యమ శ్రేణుల్ని ప్రత్యక్షంగా ప్రభావితం చేసిన రెండు అలీనాల గురించి ప్రస్తావించుకుందాం. ప్రజల వాడుక భాషలో చెప్పే చీలికలను ఇక్కడ అలీనాలుగా చెబుతున్నాం. సిపిఐ (యం-యల్)న్యూ డెమోక్రసీ పార్టీలో పదేండ్ల క్రితం జరిగిన మొన్నటి అలీనానికి కారణం వటవృక్ష రూపం ధరించిన ఆర్థిక నేర వ్యవస్థే. పార్టీ కండ్లు కప్పి అతివాద విప్లవ వాగడంబర వేషధారణలో దానికి ప్రాతినిధ్యం వహించిన అధినాయకత్వం పార్టీలో ఒక వటవృక్ష స్థాయికి ఎదిగింది. అందుకు తరతమ స్థాయిలో సంబంధిత కమిటీలన్నింటి బాధ్యత ఉంది. అది విప్లవోద్యమ

సమగ్ర ప్రక్షాళన ఆవశ్యకతను సూచించే పరిణామమే. తన వాస్తవ రూపం ఆలస్యంగానైనా బహిర్గతమయ్యే క్రమంలో పార్టీ కమిటీల శ్రేణుల కండ్లు కప్పడానికి అది మరింత అతివాద వాగాడంబర విప్లవ పతాకాన్ని ఎగురవేసింది. అది వాస్తవిక విప్లవ పతాకంగా భావించిన లేదా భ్రమించిన విప్లవ శక్తులు ఆ దారిలో మరో విప్లవాత్మక ముందడుగు వేయగలమని చిత్తశుద్ధితో ప్రయత్నం చేశాయి. ఆచరణ బెడిసి కొట్టింది. వాటిని ముందడుగు వేయనివ్వకపోగా వెనుక నుంచి వెన్నుపోటు పోడవడమైనది. వాస్తవాన్ని గుర్తించే క్రమంలో అవి పున:సంఘటితపడి పునర్విలీనబాట పట్టాయి. అది తెలుగుసీమలోనే కాకుండా యావత్ భారత విప్లవశ్రేణులకు ప్రేరణ నిచ్చింది. ఇది మొన్నటి అలీనం నుంచి విలీనానికి పడ్డ ముందడుగు మాత్రమే. మూడేళ్ల క్రితం మరో అలీనం జరిగింది. చరిత్ర పునరావతం అవుతుందని ఆశిద్దాం. నిన్నటి అలీనం వెనుక వాస్తవాలు గుర్తించే క్రమంలో అది కూడా సాధ్యపడవచ్చు. నిజానికి కామ్రేడ్ మాధవ్ మొన్నటి విలీనంలో ప్రేక్షకుడు మాత్రమే. కానీ నిన్నటి అలీనానికి ముందు సాగిన అంతర్గత పోరాటంలో తన వంతు పాత్ర పోషించాడు. నేటి విలీనం స్ఫూర్తితో ఎప్పటికైనా మరో విలీనం జరిగితే కామ్రేడ్ మాధవ్ ఆశించిన స్వప్నం ఫలిస్తుంది. ఆయన భౌతికంగా ఉన్నా లేకపోయినా, ఆయన సంస్మరణకు ఒక సమూచిత సందర్భంగా నిలుస్తుంది. ఏమైనా జంట విప్లవ మేధో మిత్రులైన కామ్రేడ్ ముత్యం, కామ్రేడ్ మాధవ్ వంటి విప్లవ బుద్ధి జీవుల్ని విప్లవోద్యమం మరింత సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోవాల్సి ఉంది. వారి మరణాల సందర్భంలో అందుకోసం విప్లవ ప్రజాతంత్ర ఉద్యమ శక్తులు తగు నిర్మాణాత్మక కర్తవ్యాలను చేపట్టవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా ఫాసిస్టు ప్రమాదం పెరిగే గడ్డు కాలంలో ఈ ఆవశ్యకత మరింత పెరిగింది. కామ్రేడ్ మాధవ్ అమర్ రహే.

# విప్లవ స్వాప్నికుడు
# కామ్రేడ్ మాధవరావుకి జోహార్లు...!

**- సాదినేని వెంకటేశ్వరరావు,**

*సిపిఐ(ఎం-ఎల్)న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు*

నాకు చిరకాల ప్రియ మిత్రుడు, అత్యంత ఆప్తుడు, మంచి కామ్రేడ్ అయిన కామ్రేడ్ గొర్రెపాటి మాధవరావు డిసెంబర్ 28,2024న ఆకస్మికంగా మరణించాడన్న వార్తను జీర్ణించుకోలేకపోతున్నాను. కామ్రేడ్ మాధవరావుకి విప్లవ జోహార్లు అర్పిస్తున్నాను.

నేను 1978లో డిగ్రీ పూర్తి చేసిన తరువాత న్యాయశాస్త్రం (లా), ఎం.ఎస్‌సి ప్రవేశ పరీక్షలు వ్రాయడానికి హైదరాబాద్‌కు వచ్చాను. అంతకు ముందే ఖమ్మంలో నిర్వహించిన ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ఏర్పాట్లలో మేమున్నాము. ఆ సందర్భంగా లా కోర్స్ చదవడం వలన ఉ ద్యమానికి ఉపయోగకరంగా వుంటుందని కామ్రేడ్ మాధవ్ సలహా యిచ్చాడు. ఆ సలహా ప్రకారం నేను ఎం.ఎస్‌సి కోసం కాకుండా కేవలం లా ఎంట్రన్స్ మాత్రమే వ్రాసాను. నన్ను లా కోర్సులో చేరమని అడ్మిషన్ కార్డు పోస్ట్‌లో ఆలస్యంగా వచ్చింది. అప్పటికి నేను అందుబాటులో లేను. అడ్మిషన్ల చివరి రోజు రైలెక్కి ఎలాగోలా హైదరాబాద్ చేరుకునేటప్పటికి ఆలస్యమయ్యింది,అప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ పూర్తిచేసి, ముగించారు.

అప్పటి ఆర్ట్స్ కాలేజీ అధ్యక్షుడైన మల్లారెడ్డి నన్ను నాటి వైస్ ఛాన్సలర్ అయిన ప్రొఫెసర్ రామిరెడ్డి గారి దగ్గరకు తీసుకెళ్లి, జరిగినదంతా వివరించాడు. నా పరిస్థితి పట్ల సానుభూతి చూపడం తప్ప తిరిగి అడ్మిషన్ యివ్వలేనని తన నిస్సహాయతను వ్యక్తం చేసారు విసి గారు. అప్పుడు నన్ను ఓదార్చి, ధైర్యం నింపిన వారిలో కామ్రేడ్ మాధవ్ కూడా ఒకరు.

నేను ఖమ్మం జిల్లా ఇల్లందు ప్రాంతం నుండి కామ్రేడ్స్ చంద్ర పుల్లారెడ్డి, రాధక్కల నుండి నాటి సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర పార్టీ పత్రిక అయిన “విమోచన”కు వ్యాసాలు, రిపోర్టులు తీసుకొచ్చేవాడిని. అక్కడ కామ్రేడ్స్ నమ్ము, రత్నమాల, మాధవ్,

...తదితరులు కలిసేవారు. వీరితో పాటు కామ్రేడ్స్ మధుసూదన్‌రాజ్ యాదవ్ (మధు మామ), ప్రదీప్, రమేశన్న @నల్లన్న, స్వర్ణ, అంబిక, ఆశాజ్యోతి,...అందరూ పరిచయమే. కానీ అందిరిలోనూ మాధవ్‌తో మరింత ఎక్కువ చనువుగా వుండేవాడిని.

ఆ తరువాత నేను విప్లవోద్యమంలో పూర్తికాలం కార్యకర్తగా పనిచేయడానికి పాల్వంచ ప్రాంతానికి వెళ్లిన తరువాత అప్పుడప్పుడు మాత్రమే కలుసుకునే వారిమి. అప్పుడు కూడా స్థానిక విషయాల నుండి అంతర్జాతీయ అంశాల వరకు సుదీర్ఘంగా చర్చించుకునే వారిమి. అలా మొదలైన మా పరిచయం స్నేహంగా, రాజకీయ బంధంగా మారింది. చివరి వరకూ కొనసాగింది.

ఉద్యమవాసరాల రీత్యా నేను 1981లో వరంగల్ జిల్లాలో వున్నపుడు అడపాదడపా నిజామాబాద్ వెళుతుండేవాడిని. ఆ తరువాత 1984-87 మధ్య కాలంలో హైదరాబాద్‌లో వున్నపుడు కూడా తరచుగా నిజామాబాద్, బోధన్‌లకు వెళుతుండేవాడిని. ఎప్పుడు కలిసినా అనేక విషయాలపై చర్చించుకునేవారిమి. ఎల్లపుడూ చిరునవ్వుతోనే మాట్లాడేవాడు. చివరికి, విమర్శలు చేసేటప్పుడు సైతం చిరునవ్వుతోనే... అదే మాధవ్‌లోని గొప్ప ఆకర్షణ.

1981లో న్యాయశాస్త్ర విద్యార్థిగా అడ్మిషన్ పొందినప్పటికీ 1989లో అదీ చివరి అవకాశం యిచ్చిన తరువాతనే పూర్తి చేసాను. తన ప్రాక్టీస్‌తో తీరిక లేకపోయినప్పటికీ నేను పరీక్షలు వ్రాయడానికి అవసరమైన సలహాలు,సూచనలు, పరీక్ష వ్రాసే విధానం, ముఖ్యమైన ప్రశ్నలు... యిలా ఎంతగానో సహాయ సహకారాలందించాడు. ఒకవైపు పరీక్షలకు హాజరవుతూనే, నిజామాబాద్ నుండి హైదరాబాద్ వరకు మాధవ్ చెప్పిన ప్రశ్నలను పునశ్చరణ చేసుకుంటూ, పరీక్షలలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాను. నాతోటి విద్యార్థులకిది ఒకంత ఆశ్చర్యంగా వుండేది. ఇదంతా మాధవ్ మార్గనిర్దేశనమే. మా లా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విష్ణుమూర్తి గారి సలహాలు కూడా వెల కట్టలేనివి.

నిజామాబాద్ జిల్లా ఉద్యమం ఎదుర్కొంటున్నసవాళ్లు, వాటి పరిష్కార మార్గాలు, జిల్లాలో విప్లవోద్యమాన్ని బలోపేతం చేయడానికి తీసుకోవలసిన తక్షణ, దీర్ఘకాలిక చర్యలు గురించి విపులంగా చర్చించేవాడు. అంతేకాదు, ఖమ్మం డివిజన్ పరిణామాలు, రాష్ట్రంలో విప్లవోద్యమం ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ ముందుకొచ్చిన తాజా పరిణామాలపై తనదైన సునిశితమైన విశ్లేషణతో వివరించేవాడు. ప్రజలు కేంద్రంగా, వారి హక్కులకు భరోసా కల్పించవలసిన బాధ్యత విప్లవోద్యమం పై వున్నదని దృఢంగా విశ్వసించాడు. అందువలనే హక్కులకు

ఎక్కడ భంగం కలిగినా అక్కడ ప్రత్యక్షమయ్యేవాడు. పోలీసు రాజ్యమేలిన నిజామాబాద్‌తో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాలలో మాధవ్ తిరగని ప్రాంతం లేదు. బూటకపు ఎన్‌కౌంటర్‌ని న్యాయస్థానంలో సవాలు చేసి, బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లింపజేయడంలో మాధవ్ ఎంత మేథో శ్రమ చేసాడు కదా... క్రూర నిర్బంధ చట్టమైన టాడా కేసులో బెయిలు పొందడానికి మాధవ్ చేసిన శ్రమ వృధా కాలేదు. టాడా కేసులో బెయిల్ పొందిన మొట్టమొదటి న్యాయవాది మన మాధవ్.

సిపిఐ(ఎం-ఎల్)కి ప్రామాణిక సిద్ధాంత, రాజకీయ పత్రాలైన 1980 అఖిల భారత మహాసభ మౌలిక డాక్యుమెంట్లను అనువదించడం, అనేక పుస్తకాలు వ్రాయడం, పరిచయం చేయడం, అందరికీ అర్ధమయ్యే రీతిలో సులభగ్రాహ్యమైన పద్దతి కొనసాగించాడు. నేను హైదరాబాద్ నగర బాధ్యతలు నిర్వర్తించిన 1984-87 కాలంలో తన సోదరుడు రామకృష్ణతో కలిసి పనిచేసాను. తానే కాదు, వారి కుటుంబ సభ్యులందరూ పరిచయమే. సుమారు రెండు సంవత్సరాల క్రితం మాధవ్ వాళ్ళ నాన్న గారి సంతాప సభలో కలిసినపుడు కూడా అనేక విషయాలు మాట్లాడాడు.

నిజామాబాద్ జిల్లా వాస్తవ్యులు, సహచరుడు, పరిశోధకుడు, శాతవాహన విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధిపతి డాక్టర్ కొట్టూరు ముత్యం (మాధవ్ భాషలో ముత్యం భాయ్) యిదే సంవత్సరం ఆగస్టు 20న మరణించినపుడు, “నా కంటే రెండేళ్ళు చిన్నవాడివి, ఎందుకురా అంత తొందరగా వెళ్లిపోయావ్” అంటూ మానవీయ సంబంధాన్ని ఎంతో హృద్యంగా ఆవిష్కరించి, ఎల్లలు లేని తమ స్నేహాన్ని వెల్లడించాడు. డిసెంబర్ మొదటి తారీఖున ఖమ్మం జిల్లాకి చెందిన న్యాయవాది ఘనా శంకర్(అందరూ పొట్టి శంకర్ అని పిలుస్తారు) మరణించినప్పుడు కూడా “మనకి తెలిసిన అందరూ వెళ్లిపోతున్నారు ఒక్కొక్కరుగా...”అని ఎంతగానో విలవిల్లాడాడు. అలా అన్న కొద్దీ రోజులకే మాధవ్ కూడా శాశ్వతంగా దూరమై పోవడం నన్ను కలచివేసింది, బాధకు, దుఃఖానికి గురిచేసింది. నేనెపుడు ఫోన్ చేసినా “హలో గౌర్రె” అనీ లేదా “మాధవా”...అనగానే, అదే చిరునవ్వుతో వచ్చే ఆప్యాయపు పలకరింపు... “చెప్పరా బాబూ”! కామ్రేడ్ మాధవ్‌తో నా అనుభవాలన్నీ ఒక్కొక్కటిగా గుర్తుకొస్తూనే వున్నాయి!

ఇదే సంవత్సరం అక్టోబర్ 24న ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన50 సంవత్సరాల పిడిఎస్‌యు అర్ధ శతాబ్దోత్సవాలకు కామ్రేడ్ మాధవ్ హాజరయ్యాడు. ఆ సందర్భంగా కలిసినపుడు,యీ స్ఫూర్తిని అభినందించాడు, ఇంకనూ చేపట్టవలసిన కర్తవ్యాలు, చేయవలసిన పనులు, అందులో

దొర్లిన చిన్నచిన్న లోటుపాట్లను ఎత్తిచూపుతూ, చిరునవ్వుతోనే వ్యంగ్యాస్త్రాలు సంధించాడు.

పిడిఎస్‌యు విద్యార్థిగా, కార్యకర్తగా మొదలైన కామ్రేడ్ మాధవ్ తన చివరి శ్వాస వరకూ విప్లవ రాజకీయాలను దృఢంగా విశ్వసించి, బలపరిచాడు, ఆచరించాడు. 2012 జనవరిలో జరిగిన జిల్లా పార్టీ మహాసభకు ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యుల డాక్యుమెంట్‌ని వివరించడానికి నేను స్వయంగా హాజరైనప్పుడు కామ్రేడ్ మాధవ్ రాజకీయ నిబద్ధతని మరోమారు ప్రత్యక్షంగా చూసాను. తన వృత్తి ధర్మంలో అనేక యిబ్బందులు, ఆటుపోట్లు ఎదుర్కొంటూ కూడా ధైర్యంగా ముందుకే సాగాడు. పీడిత ప్రజల పక్షపాతి కె.జి.కన్నబిరాన్, డాక్టర్ కె.బాలగోపాల్, గొర్రెపాటి మాధవరావు– యీ ముగ్గురి త్రయం–లేని హక్కుల ఉద్యమాన్ని ఊహించలేము.

కొత్తగూడెంలో డాక్టర్ కె.బాలగోపాల్‌ని గూండాల సహాయంతో హత్యగావించేందుకు పోలీసులు ప్రయత్నించినపుడు, ఆ ప్రయత్నాన్ని ఛేదిస్తూ పురుషోత్తంతో కలిసి పనిచేసినప్పుడు మమ్మల్ని అభినందిస్తూ మాట్లాడాడు. ఎపిసిఎల్‌సిలో రాష్ట్ర స్థాయిలో అనేక బాధ్యతలు నిర్వర్తించాడు. కామ్రేడ్ మాధవ్ ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం (ఎపిసిఎల్‌సి) నుండి మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్ఎఫ్)కు మారినప్పుడు, అనేకమంది తనని వ్యతిరేకించారు. అయినప్పటికీ, అందరినీ–నన్ను కూడా ఒప్పించేందుకు ఓపికగా ప్రయత్నించాడు. హెచ్‌ఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా ప్రధాన బాధ్యతలు చేపట్టాడు. అన్ని స్థాయిల సభలు విజయవంతం చేయడంలోనూ, చివరికి యిటీవల అనంతపురంలో జరిగిన హెచ్‌ఆర్ఎఫ్ రాష్ట్ర మహాసభలు విజయవంతం గావించడంలో కామ్రేడ్ మాధవ్ శ్రమ వెల కట్టలేనిది.

వక్తగా, కవిగా, రచయితగా, అనువాదకుడిగా, రాజకీయ శిక్షకుడుగా, రాజకీయ పరిశీలకుడుగా, రాజకీయ వ్యాఖ్యాతగా, అన్నింటికీ మించి ఒకవైపు వృత్తిధర్మాన్ని కొనసాగిస్తూనే తాను విశ్వసించిన రాజకీయాల కోసం చివరి వరకు దృఢంగా నిలబడిన హక్కుల యోధుడు, మంచి కామ్రేడ్ అయిన కామ్రేడ్ మాధవరావుకి మరోసారి విప్లవ జోహార్లర్పిస్తున్నాను.

*31–12–2024*

# నా బతికిన క్షణాల్లో మరొకటి ఇప్పుడు ఒక ఆకాశ తార!

**– హెచ్ఆర్‌కె**

నా బతికిన క్షణాలలోంచి మరొక క్షణం మెరిసే నక్షత్రమై గగనాని కెగసింది.

అల్లంత ఎత్తున ఏమున్నది అని రాత్రి ఆకాశంలోనికి సాలోచనగా చూసినప్పుడంతా, ఎందరో ఉద్యమ సహచరులతో పాటు కామ్రేడ్ గొర్రెపాటి మాధవరావు నాకు కనిపిస్తాడు.

మరణమంటే భయం, మోహం రెండూ ఉండక్కర్లేదు. మరణం జీవితంలో ఒక భాగం. ఏనాడూ మరణానికి భయపడకుండా ప్రజల కోసం పని చేసిన వారిలో ఒకడు మా మాధవ. అలాగని అతడు మరణాన్ని పూజించనూ లేదు. దానికి లేని గొప్పదనాన్ని ఆపాదించలేదు. ఎక్కడ అన్యాయమైన మరణం సంభవించినా, ఎక్కడ అన్యాయమైన నిర్బంధం కనిపించినా దాన్ని పట్టించుకున్నాడు. పౌరుల హక్కులను ఖాతరు చేయని పాలకులను నిలదీసి ప్రశ్నించాడు. ఆ మరణాలు, ఆ నిర్బంధాలు ఎలా అన్యాయమైనవో సమాజం ముందు, సమాజంలో భాగమైన కోర్టుల ముందు వుంచి, ప్రజల పక్షాన నిలబడిన గొంతు మాధవరావు.

'వాటిఫ్ ఐ డై నౌ ఆర్ ఆఫ్టర్ ఫిఫ్టీ ఇయర్స్?' ('నేను ఇప్పుడు చనిపోతేనేం, మరి యాభయ్యేళ్లకు చనిపోతేనేం, ఏమిటి తేడా?') అని అడుగుతాడు ఆల్బర్ట్ కామూ 'ఔట్ సైడర్' నవలలో మ్యూర్సాల్ట్ అనే యువకుడు, మరునాడు మరణశిక్ష అనుభవించనున్న వాడు. ఈ మాటలో లోతైన నిరాశావాదం (నిహిలిజం) వుంది. మాధవ అలా ఎన్నడూ అనుకోలేదు. అర్థాంతరంగా, నిశ్శబ్దంగా లోకానికి సెలవంటూ వెళిపోయాడు గాని, బతికినంత కాలం నిజంగా జీవించాడు. తన తెలివి తేటల్ని, తన చదువును, చివరికి తనకు బువ్వ పెట్టే న్యాయవాద వృత్తిని కూడా ప్రజల కోసం వినియోగించాడు. బతికినంకాలం అర్థవంతంగా, అసత్యంతో రాజీ లేకుండా జీవించాడు. తన సన్నిహితులతో కూడా రాజీ పడకుండా తాను సత్యమనుకున్న దాని పక్షాన నిలబడ్డాడు. అందుకు చాల అభినందన పూర్వకంగా గొర్రెపాటి మాధవరావును లోకం గుర్తుంచుకుంటుంది.

నా కళ్ల ముందొక దృశ్యం కదలాడుతోంది. ఎమర్జెన్సీ తరువాత ఒక రోజు. నా హైదరాబాదు జీవితం తొలిరోజుల్లో ఒక రోజు. ఒక భారీ ఊరేగింపు. ఒక 'అబ్బాయి' సైకిల్ తో నా పక్కకు వచ్చాడు. సైకిల్ హ్యాండిల్ సుతారంగా పట్టుకుని, దాన్ని నడిపించుకుంటూ వచ్చి. అన్నా అంటూ నాతో మాట్లాడాడు. మాట్లాడుతున్నప్పుడు కొంచెం సిగ్గు పడుతూ వొంచిన తల, తన కళ్లలో ఒక సహచరుడిగా నా మీద అనంతమైన ప్రేమ మనస్సు మీద  వేసిన ముద్ర ఎప్పటికీ చెరగదు.

కట్ చేస్తే, హైదరాబాదు నల్లకుంట, ఫీవర్ హాస్పిటల్ వద్ద మా పార్టీ పత్రిక 'విమోచన' ఆఫీసు. అప్పుడు మేము (నేనూ జయ) ఆ పక్క సందులోనే ఒక గదిలో కాపురం పెట్టి, పగలంతా 'విమోచన' ఆఫీసు తదితర పనుల్లో ఉండే వాళ్లం. మాధవరావు, సుదర్శన్ అనే మరో అదిలాబాదు కామ్రేడు ఆఫీసులోనే ఉండే వారు. అప్పటికి ఇద్దరూ బ్రహ్మచారులు. వాళ్లిద్దరు ఆఫీసులోనే ఉండే వారు తమ వంట తాము చేసుకుంటూ.

ఒకరోజు పొద్దున 'ఏం ఇంకా టిఫిన్ ఏమీ చేసుకున్నట్టు లేదు' అని అడిగాన్నేను. వాళ్ల బ్రేక్ ఫాస్ట్ అయిపోయిందని చెబుతూ మాధవ ఇచ్చిన వివరం, ఒక హాయి జ్ఞాపకం. 'బ్రెడ్డూ గ్రుడ్డూ ఐరన్ ఫుడ్డు' అయిపోయిందంట. ఎప్పుడూ అంతే. చెరగని చిరునవ్వు. సరదా మాట. అటు లాయర్ చదువూ ఇటు పార్టీ (విమోచన) పని.

'నువ్వు మొత్తం ఆఫీసులోనే ఉంటివి, లా కాలేజీ, పరీక్షలు ఎట్లా?' అని అడిగితే భలే నవ్వేశాడు. 'అంతోటి లా పరీక్షలకు కాలేజీకి వెళ్లి ఆ లెక్చర్లు ఏం వింటాం అన్నా! పుస్తకాలు చదువుకోవాలి, చదువుకుంటున్నా, మన పనుల్లో ఖాళీ దొరికినప్పుడల్లా' అనేసిన మాధవరావు నెమ్మది, ప్రజల పట్ల ప్రేమ, పని పట్ల నిబద్ధత నాకెప్పుడూ ఉత్తేజమిచ్చేవి. ఇకముందూ ఉత్తేజమిస్తాయి.

ఒకే ఒకసారి మినహా న్యాయవాదిగా తనను కలిసిన సందర్భాలు లేవు నాకు. ఫేస్ బుక్‌లో చూసినప్పుడల్లా, తన ముఖంలో చెక్కు చెదరని పసిమిని, నిజాయితీ నీడను కాసేపు చూస్తూ ఉండిపోవాలనిపించేది. కొంచెం పేచీ పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆ సందర్భాలు: నా కొత్త ఆలోచనలు మాత్రమే. అలనాటి మమకారాలు మాత్రం పదిలం. ఇప్పటికీ, ఎప్పటికీ.

మాధవరావు సన్నిహితులతో విభేదిస్తూ కూడా ఎప్పటికప్పుడు తాను సత్యం అనుకున్న దాని పక్షాన నిలబడ్డాడు అన్నాను ఇంతకుముందు. అనుకుంటాం గాని, అదేమంత సులభమైన పని కాదు. మనల్ని మనం సో కాల్డ్ మెయిన్ స్ట్రీం నుంచి వేరు

చేసుకుని మనలాంటి వాళ్లతో మాత్రమే కలిసుంటూ, కలిసి పనిచేస్తూ ఉండడం... అది వేరు. ఉద్యమేతరులతో చర్యా ప్రతిచర్యలకు లోనవుతూ ప్రజా సాంస్కృతిక విలువలతో జీవించడం కష్టం. అదీ గాక, మనం ప్రేమించే మనుషులతో చిరు విభేదాలను అలాగే ఉంచుకుని... మళ్లీ ఆ మనుషుల మధ్య పొడసూపే విభేదాల గురించి విని బాధ పడుతూ, వారిలో కుదురుతున్న కలయికలకు (పునరేకీకరణలకు) సంతోషపడుతూ... జీవించడంలో ఒక నొప్పి ఉంటుంది. ఇలాంటి నొప్పి మాధవరావులో ఉండిందని నాకు తెలుసు. మా సంభాషణల్లో ఆ కబుర్లు తరచు దొర్లేవి. నా అనుభవంలోనూ ఉన్న నొప్పి కావడం వల్ల, అది నాకు మరింత బాగా తెలుసు. ఇలాంటి నేపథ్యంలో ప్రజా ఉద్యమాలతో సాన్నిహిత్యం కోల్పోకుండా, ప్రజా కార్యకర్తలకు న్యాయవాద సహాయం అందించిన మంచి మనిషి, మంచి కామ్రేడ్ గొర్రెపాటి మాధవ రావు. ఈ రూపంలో మాధవ చాల మందికి ఆదర్శంగా నిలిచిపోతాడు. ఉన్నట్టుండి కనుమరుగయినా, నా వంటి ఎందరి మనస్సులలోనో చిరంజీవి అవుతున్నాడు. నలుగురు కూర్చుని ఉద్యమ సంబంధ దిగుళ్లు, సంతోషాలు పంచుకున్నప్పుడంతా మాధవ రావు గుర్తుకు వొస్తుంటాడు. విప్లవకారులు, ప్రజా ఉద్యమకారులు ఐక్యమైన ప్రతి సంఘటననూ సంతోష నయనాలతో గమనిస్తూనే ఉంటాడు.

*జనవరి 8, 2025*

# ప్రజా హక్కుల ఉద్యమ పతాక మాధవరావు చిరస్మరణీయుడు

- కె.గోవర్ధన్

*సిపిఐ(ఎం-ఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు*

"గోపి... రెండు పార్టీలు ఐక్యం అయిన తర్వాత రైజింగ్ న్యూడెమోక్రసీనే ఉమ్మడి పత్రికగా ఉంటుందా..." అని వాట్సప్‌లో అడిగాడు.

అవునన్నా... దీన్నే కొనసాగించాలనుకున్నాం... అయితే ఇతర విషయాలు ఇంకా అనుకోవాల్సి ఉన్నది....

ఈ సంభాషణ మా మధ్య 2024 డిసెంబర్ 25 రాత్రి జరిగింది. 24 గంటలు గడిచాయో లేదో పిడుగులాంటి వార్త... కాళ్ళ కింద భూమి కదిలి నట్లు అనిపించింది. మనసు మనసులో లేదు... పొరలు పొరలుగా దుఃఖం... జ్ఞాపకాల చిత్తడి లోచిక్కుకు పోయా....

1981లో మొట్టమొదటిసారి విద్యానగర్ ఇరాని కేఫ్‌లో చందు, ముత్యం నన్ను మాధవరావు అన్నకు పరిచయం చేశారు. నా భుజం మీద చేయు వేసి.... ఏంటి సిటీ కాలేజీ లో చదువుతున్నావా.... నాదీ అదే కాలేజీ... బలెగుంటది... మన పిడిఎస్‌యు వాళ్ళు ఉన్నారు, అని చెప్పి భద్రయ్య మిగతా వాళ్ళ పేర్లు చెప్పాడు.నాకు ఆయన చిరునవ్వుతో ఆప్యాయంగా మాట్లాడిన తీరుతో నాకు నోట మాట రాలేదు. నేను మన పిడిఎస్‌యులో చేరిన తర్వాత ఓయూ క్యాంపస్‌కు కె.వి.మధుసూదన్ రెడ్డి నన్ను అక్కడికి తీసుకెళ్లుతుండే వాడు. పూర్తిగా గ్రామీణ ప్రాంతం నుండి వచ్చిన నాకు ఓయూ క్యాంపస్, పిడిఎస్‌యు నాయకులు కొత్త ప్రపంచాన్ని చుసినట్లుగా అనిపించేది. E- హాస్టల్‌కు చందుతో వెళ్ళినపుడు మొట్టమొదటిసారి మాధవరావు అన్నను చూసాను. మనిషి చలాకీగా, చిరునవ్వుతో ఏవేవో సిద్ధాంత విషయాల మీద అలవోకగా మాట్లాడుతున్నాడు.ఇంత పెద్ద నాయకుడు నాతో మాట్లాడితే ఎంత బాగుండు అని మనసులో అనుకున్నా... అదే విషయాన్ని చందుతో చెప్పా... అరేయ్... అదేమంత పెద్ద విషయం కాదు. రేపు విద్యానగర్ కేఫ్‌లో కలుద్దాం అన్నాడు. అప్పుడు మొదటిసారి

మాధవన్నతో మాట్లాడింది మొదలు 2024 అక్టోబర్ 24న ఓయూ క్యాంపస్‌లో పిడిఎస్‌యు అర్ధశతాబ్ది ఉత్సవాల దాకా నిరంతరం మాట్లాడుకుంటూనే వస్తున్నాం.

విమోచన ఆఫీస్‌లో అన్నను కలిసే వాడిని. అపుడు నేను విజృంభణ ఆఫీస్‌లో ఉండేవాడిని. విమోచన ప్యాకింగ్ కోసం అక్కడికి తరుచుగా వెళుతుండే వాడిని. లెనిన్ రాసిన రాజ్యం – విప్లవం పుస్తకాన్ని ఇచ్చి చదవమన్నాడు. చదివిన తర్వాత చాలా అనుమానాలు వస్తే అన్నను అడిగితే, వివరంగా విప్పి చెప్పేవాడు. మరిన్ని పుస్తకాలను చదవమని సూచించే వాడు. మిగతా నాయకులు చెప్పే దానికి మాధవన్న చెప్పే దానికి నాకు తేడా అనిపించేది. మనం మాములుగా మాట్లాడే పదాల్లో, సింపుల్‌గా అనిపించేది. గొట్టుగా ఉండేది కాదు. అప్పటినుండి నేను గుంటూరులో ప్రజాపందా పత్రిక బాధ్యతలు చూసేప్పుడు కూడా పత్రిక రాతకోతలపై, కంటెంట్‌పై, భాషా దోషాలపై తరచుగా మాట్లాడుకునే వాళ్ళం. నన్ను గైడ్ చేసేవాడు.

నాకు తెలిసినంతలో మాధవరావు అన్న పిడిఎస్‌యు పుష్పించిన అద్భుతమైన మేధావి, మార్క్సిజం మలిచిన ఉద్యమ గొంతుక. బయటి ప్రపంచానికి ఆయన పౌర హక్కుల ఉద్యమ నాయకుడే కాదు, బహుముఖ ప్రజ్ఞాశాలి కూడా... మంచి రచయిత, వక్త, అనువాదకుడు, విశ్లేషకుడు, కళాకారుడు, స్నేహశీలి, ఉత్తమ బోధకులు ...

హెూకాంచి రాసిన ఆధునిక చైనా చరిత్రను ఇంగ్లీష్ నుండి తెలుగులోకి సరళమైన భాషలో అనువదించారు. సామాన్య ట్రేడ్ యూనియన్ కార్యకర్తలకు అర్ధం అయ్యేలా "కార్మిక చట్టాలు" పుస్తకాన్ని రాస్తే ఈనాటికి అది ప్రామాణికంగా ఉన్నది. ఆయన రాసిన వివిధ సందర్భాల్లో రాసిన కరపత్రాలు సామాన్య ప్రజలను బాగా ఆకర్శించేవి.... విషయాన్ని బాగా అర్థం చేయించేవి.

న్యాయ వ్యవస్థపై, అది నడుస్తున్న తీరుపై ఆయన రాసిన వ్యాసాలు, చేసిన ప్రసంగాలు సృజనాత్మకంగా ఉండేవి, లోతుగా విషయాన్ని ఆలోచింపచేసేవి.

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యలో రాష్ట్ర కమిటీ సభ్యుడుగా ఆయన తొలి నాళ్ళలో చేసిన కృషి మెచ్చదగ్గది.

నాడు ఎపిసిఎల్‌సిలో, నేడు హెచ్ఆర్ఎఫ్‌లో పని చేస్తున్నపుడు ఆయన పని విధానం రొటీన్‌కు భిన్నంగా ఉండేది. సరికొత్తగా అనిపించేది. పార్టీ ముఖ్యమైన వేదికల్లో ఆయన చేసే అనువాదాలు ప్రత్యేకతను సంతరించుకునేవి.

1986లో ఇండియాకి జర్మనీ MLPD డెలిగేషన్ ఇలెందు ప్రాంతానికి వచ్చినపుడు మాధవన్న దుబాసిగా వ్యవహరించిన తీరు నేనిప్పటికి మరచిపోలేను.

మేధోపరమైన ఆలోచనలు, విశ్లేషణలు చేయడంతో పాటు సామాన్య కార్యకర్తల వరకు ఇతొదిక, అసంఖ్యాక సంబంధాలు కలిగిఉన్నారు. వాటిని సజీవంగా మాధవన్న చివరి వరకు కొనసాగించారు.

మాధవన్న లాంటి లాయర్, హక్కుల ఉద్యమ నాయకులు, రచయిత, మేధావి నిజామాబాదు లాంటి జిల్లా కేంద్రంలో గాకుండా హైదరాబాద్ లాంటి రాష్ట్ర కేంద్రం లో ఉండి ఉంటే ఉద్యమానికి, ఆయన ప్రతిభా పాటవాలకు మరింత వన్నె తెచ్చేదనే నా అభిప్రాయానికి సమాధానం ఇవ్వకుండానే మాధవన్న వెళ్ళిపోయాడు... ఆయన మన కళ్ళముందు కనపడక పోయినా ఆయన బహుముఖంగా చేసిన విస్తారమైన కృషి, పని మనకు నిరంతరం స్ఫూర్తిని, ప్రేరణ ను కలిపిస్తాయి. అందుకే మాధవన్న చిరస్మరణీయుడు.

– మాధవరావు అన్నకు విప్లవ జోహార్లు!

# నిజామాబాదులో నిండుగా నవ్విన గోదావరి మాధవరావు అన్న

– శక్తి

మాధవరావు అన్నను తలుచుకుంటే తన నిండైన నవ్వు గుర్తొస్తుంది. బాధల్లో ఉన్నప్పుడు భుజం తట్టి నిలిచిన అతని చేతి స్పర్శ గుర్తొస్తుంది. నిస్పృహలో ఉన్నప్పుడు తను నమ్మిన వాళ్లు దారి తప్పుతుంటే ఎదురు తిరిగిన అన్న ఉక్కు సంకల్పం గుర్తొస్తుంది.

"జాతస్య హి ధ్రువో మృత్యుః
ధ్రువం జన్మ మృతస్య చ"
పుట్టినవానికి మరణం తప్పదు;
మరణించినవానికి పుట్టుక తప్పదు.

గీతలోని ఈ రెండో వాక్యం కూడా నిజమైతే ఎంత బాగుండు అనిపిస్తుంది ఒక్కోసారి.

పౌర హక్కుల ఉద్యమ నేత బాలగోపాల్ సార్ చనిపోయినప్పుడు మొదటిసారి అనిపించింది. ఇప్పుడు నిజామాబాద్ న్యాయవాది, రాష్ట్ర పౌర హక్కుల ఉద్యమ నేత మాధవరావు అన్న చనిపోయినప్పుడు మరోసారి అనిపిస్తూ ఉంది.

గత ఏడాది కాలం నుంచి హైదరాబాద్ వచ్చినప్పుడు తప్పకుండా కలుస్తానని అన్నాడు మాధవరావు అన్న. ముత్యమన్న చనిపోయాక మనం కలుద్దాం శక్తీ అన్నాడు బెంగగా. పిడిఎస్‌యు యాభై సంవత్సరాల సదస్సు తర్వాత తప్పకుండా కలుస్తానని ప్రేమగా చెప్పాడు మాధవరావు అన్న. మనకు వాయిదాలు తీసుకోడం అలవాటే కదన్నా.. అంటే మనసారా నవ్వాడు. ఇంతలో ఇంత పని చేస్తాడనుకోలేదు.

1984 ప్రాంతంలో అనుకుంటా హైదరాబాద్ విద్యార్థి ఉద్యమ నాయకుడు రామకృష్ణను పరిచయం చేశాడు ఆనాటి పిడిఎస్‌యు నాయుకుడు గోవర్ధన్. రామకృష్ణ వాళ్ళ అన్నయ్య నిజామాబాదులో ఉద్యమ న్యాయవాది మాధవరావు అన్న అని చెప్పారు. తర్వాత ఖమ్మంలో జరిగిన పౌరహక్కుల సభలో పరిచయం అయ్యారు. మాధవరావు

అన్న దృక్పథం వ్యక్తిత్వం నాకు బాగా నచ్చింది. భావాలే కదా మనల్ని నడిపేది కలిపేది.

1989లో లా ప్రాక్టీసుకు వచ్చిన కొత్తలో ఖమ్మం లోని ఒక ఉద్యమ లాయర్ దగ్గరికి వెళ్లి డిస్పోజైన కేసు రికార్డులు ఏమైనా ఉంటే ఇమ్మని అడిగాను. నాలుగు రోజులు ఇంటి చుట్టూ తిప్పించుకుని చివరకు లేవు అన్నాడు. మరో లాయర్ వేణు గారి దగ్గరికి వెళ్తే డిస్పోజైన 20 కేసు రికార్డులు తీసి నాకు రిఫరెన్స్‌గా ఇచ్చేసారు. అదే మాధవరావు అన్న ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో ఒక కేసు కోసం తన రన్నింగ్ కేసు రికార్డు జెరాక్స్ తీసి నాకోసం పోస్టులో పంపించాడు.

1990 నుంచి 96 వరకూ పౌర హక్కుల ఉద్యమంలో చురుకుగా పని చేసిన కాలంలో బాగా దగ్గరయ్యారు మాధవరావు అన్న. పౌర హక్కుల సంఘం రాష్ట్ర కమిటీలో బాల్ గోపాల్ సార్ గురించి నేను మాట్లాడినప్పుడు ఎంతో పరిణీతితో మాట్లాడావని భుజం తట్టి మెచ్చుకున్నాడు మాధవరావు అన్న.

తర్వాత పౌర హక్కుల సంఘం రాష్ట్ర కమిటీ మీటింగ్ మా ఇంట్లో జరిగినప్పుడు చాలా విషయాలు చర్చకు వచ్చాయి. గుంటూరు అరుణోదయ మహాసభలో కార్యదర్శి నివేదికలో గొల్లసుద్దుల రూపానికి వ్యంగ్యంగా “గొంగడి బాచ్” అనే ట్యాగ్ తగిలించడంపై వచ్చిన బహిరంగ విభేదాల గురించి చెప్పాను. మాధవరావు అన్న కొన్ని జాగ్రత్తలు చెప్పాడు. ఒక నాయుకుడ్ని గుడ్డిగా నమ్ముతున్నావేమో అని నన్ను పరోక్షంగా హెచ్చరించినట్టు అనిపించింది. అప్పటికే భ్రమల పొరలు వీడుతున్న నాకు అన్న పరోక్ష సూచన బాగా పని చేసింది. కానీ మనసు విప్పి మాట్లాడుకోడానికి లోపల ఓ భయం. ఓ నిజామాబాద్ నాయుకుడి ప్రభావంలో మాధవరావు అన్న ఉన్నాడేమోనని అనుమానం. ముత్యం అన్న మీద కూడా చాలా కాలం అదే అభిప్రాయం ఉండేది. తర్వాతి కాలంలో ఆ నాయుకుడి పైనే మాధవరావు అన్న చేసిన అంతర్గత పోరాటం గురించి తెలిసినప్పుడు తన పట్ల నా గౌరవం మరింత పెరిగింది.

1996లో ఉద్యమం నుంచి బైటికి వచ్చాక కానూరి తాత గారి మీద తీస్తున్న డాక్యుమెంటరీ కోసం ముత్యం అన్న నన్ను వెతికి మరీ పట్టుకుని కెమెరా ముందు నిలబెట్టాడు. అప్పుడే అరుణోదయ కోసం మాధవరావు అన్న చేసిన కృషి ఎంత గొప్పదో కానూరి తాత గారు చెప్పారు నాకు. షూటింగ్ చివర్లో వచ్చిన మాధవరావు అన్నను మనసారా కౌగిలించుకున్నాను. నేను చేయలేని కొన్ని పోరాటాలను వదిలేసిన పోరాటాలను మాధవరావు అన్న చేసి పూర్తి చేసి విజయం సాధించాడు అదే అన్న గొప్పతనం.

పౌర హక్కుల సంఘంలో బాలగోపాల్ సార్ చేస్తున్న అంతర్గత పోరాటం విషయంలో ఇద్దరం మనస్ఫూర్తిగా ఆయన వైపు నిలుచున్నాం. ఆ తర్వాత నేను వేరే మార్గం ఎంచుకున్నాను. అన్న పౌరహక్కుల ఉద్యమంలోనే కొనసాగి తను అనుకున్నది సాధించాడు.

చంద్రశేఖర్ అన్న ఆత్మహత్య నేపథ్యంలో నేను ఫేస్బుక్‌లో రాసిన రైట్‌అప్ పైన కొందరు మిత్రులు కత్తులు దూస్తూ ఉంటే నాకు కవచంలా నిలబడ్డాడు. ఈ మధ్య తూర్పు గోదావరి పౌర హక్కుల నాయకుడు నామాడి శ్రీధర్ గురించి రాసినప్పుడు అన్న కదిలిపోయాడు. ఉద్యమ జ్ఞాపకాలు రాయమని పదే పదే అడిగాడు. మంటో కథల గురించి చర్చించాడు. రాధక్క పైన అన్న రాసిన వ్యాసం గురించి మాట్లాడినప్పుడు ఉద్వేగంగా స్పందించాడు. నన్ను ఉద్యమం లోకి ఏదో రకంగా తిరిగి తీసుకు రావాలని చాలా ప్రయత్నాలు చేసాడు. మంచం మీద నుంచి కదలలేని నా అనారోగ్యం.. గురించి చాలా బాధ పడ్డాడు. ఇంతలోనే మాధవరావు అన్న ఆకస్మిక మరణం. వ్యక్తిగతంగా నాకు.. ఉద్యమాలకు ఎంతో అవసరం అయిన అన్న ఇంత తొందరగా దూరం అవడం చాలా బాధాకరం.

నిజామాబాదులో నిండుగా నవ్వింది అంటూ గోదావరిలోయ పోరాటాల పైన పాట రాసినప్పుడు మాధవరావు అన్న నిండైన నవ్వు నా మనసులో ఉంది. సొంత అన్నను కోల్పోయినట్టు ఉంది. అన్న మళ్ళీ తిరిగి వస్తే బాగుండు అనిపిస్తుంది.

*07-01-2025*

# భారత రాజకీయ యవనికపై చెరగని విప్లవ సంతకం కామ్రేడ్ గొర్రెపాటి మధవరావు

– ఆవునూరి మధు

*సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు*

కామ్రేడ్ గొర్రెపాటి మాధవరావు

నీ జ్ఞాపకాలు విడవని జాడలు,

మరువని మమతలు,

నిత్య నూతన కాంతులు వెదజల్లే సమయానికి మా నుండి దూరమయ్యావు. ఐనా నువ్వు విడనాడిన జగత్ అలాగే ఉంది. సూర్యరశ్మిలో, చంద్రకాంతిలో, చుక్కల మెరుపులో, చిరుగాలి మోసుకొచ్చిన నేలతల్లి పిలుపులో చమట చుక్కల విలువ శ్రమజీవులకే దక్కాలని ఎక్కుపెట్టిన కలం మీది. నిర్బంధాలను ఎదిరించి రాజ్య హింసపై నిత్యం గొంతెత్తి గర్జించిన గళం నేడు మూగబోయింది. మానవ హక్కుల చిరునామా కామ్రేడ్ గొర్రెపాటి చే గొనుమా రెడ్ సెల్యూట్. మూగబోయిన ఓ విప్లవ స్వరమా, నక్సల్బరీ ప్రియ నేస్తమా,

పీడత వర్గాల ప్రియతమ నాయకుడా,

కామ్రేడ్ గొర్రెపాటి నీకు ఇవే మా లాల్ సలాం.

ఎమర్జెన్సీ చీకటి రోజులలో వెలుగుల కొరకు ఆరాటపడి నూతన రాజ్యం ఆవిష్కరణ కోసం పోరాడినవాడు. హక్కుల ఉద్యమాలను దిక్కులు పిక్కటిల్లేలా నినాదాల నిప్పులై కురిసిన వాడు. అణచివేయబడుతూ హరించి వేయబడుతున్న ఆదివాసీల హక్కుల పరిరక్షణకై నిర్వాసిత ఉద్యమ మేఘ గర్జన. సామ్రాజ్యవాదులకు గులాములుగా మారిన గుండెల్లో అక్షర తూటాలు పేల్చి మాటల ఈటెలను విసిరిన వాడు కామ్రేడ్ మాధవన్న. ప్రజా ఉద్యమాలకు జనస్వరం ఆయన. రాజ్యం కంట్లో రాయి అయినవాడు. బతుకు మీద ఆశ వీడి తెగించి నడిచినవాడు. కష్టజీవికి ఇరువైపులా నిలబడి పెన్నుబట్టి జీవితాంతం విప్లవ అక్షర సాహిత్య సేద్యం చేసి దోపిడీ వ్యవస్థను వణికించినవాడు.

కామ్రేడ్ మాధవన్నతో నా పరిచయం 1996 పార్టీ రాష్ట్ర మహాసభల నుండి ప్రారంభమైంది. ఆనాటి నుండి తను జీవించినంత వరకు మా రాజకీయ సంబంధాలు కొనసాగుతునేఉన్నాయి. భద్రాచలం, ఇల్లందు ప్రాంతాలలో రాజ్యం ఆదివాసీలు, విప్లవకారుల పైన దాడులు దౌర్జన్యాలు, బూటకపు ఎన్కౌంటర్లు జరిపిన సమయంలో సమాచారం కోసం నాతో ఫోన్లో సంభాషించేవాడు. నిజ నిర్ధారణలకు వచ్చినప్పుడు, అవకాశం ఉన్నప్పుడల్లా కలిసి వివరాలు తెలుసుకునేవాడు. ఇలా పరిచయాలు పెరుగుతూ రాజకీయ సంబంధాలతో పాటు నిజామాబాద్ లో జరిగిన అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా జరిగిన ఆంతరంగిక పోరాటంలో తను పోషించిన సరైన పాత్ర గురించి పలు సందర్భాలలో తనతో మాట్లాడేవాణ్ణి. అలాగే అనేక సైద్ధాంతిక రాజకీయ విషయాలను ఫోన్ సంభాషణ ద్వారా చర్చించి తెలుసుకునేవాడిని. కామ్రేడ్ మాధవరావు గారు నిజామాబాద్ విప్లవోద్యమ నిర్మాణంలో ఎనలేని కృషి చేశాడు. కార్యకర్తల రాజకీయ సైద్ధాంతిక అవగాహన పెంచడానికి తిరుగులేని పాత్ర పోషించాడు. ఇట్లాంటి కామ్రేడ్ మరణ వార్త వినగానే తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. ఎంతో ఆవేదన చెందాను.

ప్రపంచంలో అత్యంత మేధోవంతమైన మెదడు పనిచేయడం మూగపోయిందని కామ్రేడ్ మార్క్స్ చనిపోయినప్పుడు నివాళులర్పిస్తూ కామ్రేడ్ ఎంగిల్స్ అన్నాడు. ఆ విధంగా కామ్రేడ్ మాధవరావు గారు నీ మరణం తర్వాత నీ మేదస్సు గురించి వక్తలు మాట్లాడిన తీరు, నీకోసం నీవు బ్రతకలేదని సమాజ మార్పు కోసం బ్రతికిన వాడివని ప్రకటించిన తీరు చూస్తే ప్రజల కోసం పనిచేసే మేధస్సును కోల్పోయామని అర్థమవుతుంది.

ప్రజా ఉద్యమాలకు వెన్నుదన్నుగా ఉంటూ రాజ్య హింసను ప్రశ్నిస్తూ ప్రజల హక్కుల కొరకు తపిస్తూ అవిరామ కృషి సలిపినవాడు మన మాధవరావు. నిజాయితీ, నిబద్ధత, నిమగ్నత, నిర్భయత, అధ్యయనం చేస్తూ ఆచరణలో పెట్టడానికి కృషి సలిపాడు.

విప్లవ సిద్ధాంతాన్ని మార్క్సిజాన్ని లోతుగా అధ్యయనం చేసిన వర్తమాన విప్లవ నేతలలో గొర్రెపాటి ఒకరు. ఇంతటి గొప్ప సిద్ధాంత వ్యక్తిని, ఆచరణ వాదిని గుండెపోటుతో కోల్పోవడం విప్లవ ఉద్యమానికి తీరని లోటు. కామ్రేడ్ మాధవరావు జీవితమంతా నిరంతర అధ్యయనంతో కూడుకున్నది. అది లేకుండా అతను ఎటువంటి చర్యలు తీసుకోలేదు అన్ని సమయాలలో అధ్యయనం చేయడం ఆచరణకు తాను ఇచ్చే నిరాపేక్ష ప్రాధాన్యత కారణంగా వాస్తవికత నుండి ఎల్లవేళలా నేర్చుకోవడానికి

సిద్ధపడడం లెనిన్ లక్షణం. కామ్రేడ్ గొర్రెపాటి తన రాజకీయ జీవితమంతా లెనిన్ రాజకీయ జీవిత పద్ధతిని అనుసరించాడు.

విప్లవ సిద్ధాంతం లేకుండా ఏ విప్లవోద్యమం ముందుకు పోలేదనేది లెనిన్ సూక్తి. విప్లవ సిద్ధాంతాన్ని అధ్యయనం చేయడానికి తీవ్రంగా ప్రయత్నించకుండా ఆ సూక్తులు వల్లించడం అంటే, మహోపాధ్యాయులకు నష్టం చేయడమే అంటాడు కామ్రేడ్ మాధవన్న. ప్రస్తుతం విప్లవోద్యమం స్థబ్దతకు లోనై ఉంది. ఈ స్తబ్దత వాతావరణాన్ని అధిగమించి ఉద్యమంలో ఉత్సాహాన్ని నింపాలంటే సరైన పద్ధతుల్లో ప్రజా ఉద్యమాలలో చురుకుగా పాల్గొనడంతో పాటు సైద్ధాంతిక, రాజకీయ గ్రంథాల అధ్యయనం కొనసాగించి తమ అవగాహనను పెంపొందించుకోవాలనేది కామ్రేడ్ గొర్రెపాటి అవగాహన. ఈ విధంగా మాత్రమే తమ సిద్ధాంత, పంథా, కార్యక్రమాలపై, తమ కార్యాచరణపై, విప్లవ భవిష్యత్తుపై గట్టి నమ్మకం ఏర్పడుతుందని అంటాడు. అయితే ఏ సైద్ధాంతిక, రాజకీయ అధ్యయనం చెప్పాడంటే సమకాలీన ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులను అర్థం చేసుకోవడానికి  దినపత్రికలను, రాజకీయ పత్రికలను ప్రతిరోజు అధ్యయనం చేయాలి. ఆ విధంగా సమకాలీన సమస్యలను అర్థం చేసుకొని ప్రజలను సమీకరించడం సాధ్యం అవుతుంది. అయితే మన అధ్యయనం దీనికే పరిమితం కాకూడదనేది తన అవగాహన. సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు మహోపాధ్యాయులైన మార్క్స్, ఎంగిల్స్, లెనిన్, స్టాలిన్, మావో రచనలను తప్పనిసరిగా అనేక పర్యాయాలు చదవాలి. ఎల్లప్పుడూ చదువుతూ ఉండాలి. వారి బోధనల సారమైన మార్క్సిస్టు తత్వశాస్త్రం, రాజకీయ అర్థశాస్త్రం, శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతాలను వివరించే ఇతర గ్రంథాలను కూడా జాగ్రత్తగా అధ్యయనం చేయాలని చెప్పడమే కాదు తను అధ్యయనం చేశాడు. వారి బోధనలలోనే విశ్వజనీన సత్యాలను ఆకళింపు చేసుకున్నాడు. వారి కార్యాచరణ పద్ధతిని గ్రహించాడు. రష్యా, చైనా, వియాత్నం మొదలైన దేశాల విప్లవాల చరిత్రను అంటే వారి విప్లవ ఆచరణను అధ్యయనం చేసి వారి విలువైన అనుభవాలను ఆకళింపు చేసుకున్నాడు. మన దేశ నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా వాటిని వర్తింప చేయడానికి పూనుకున్నాడు. మార్క్స్, ఎంగిల్స్ ల నిరంతర అధ్యయనం, వారి సైద్ధాంతిక కృషిని గురించి కామ్రేడ్ మాధవరావు అధ్యాయనం చేస్తూ ఆచరణలో కృషి సలిపాడు. అధ్యయనానికి అవసరమైన కాలాన్ని కేటాయించుకోగలగాలనేది, క్రమశిక్షణతో రోజువారి కార్యక్రమాలకు పథకం వేసుకోవాలనేది, ప్రతి పనికి అవసరమైన కాలాన్ని ముందుగా నిర్ణయించుకోవాలనేది కామ్రేడ్ మాధవరావు గారి ఆలోచన. కాబట్టే అనేక సిద్ధాంత గ్రంథాలను మాధవరావు గారు చదివారు. వాటిపై లోతైన అవగాహనను ఏర్పరచుకున్నాడు.

విప్లవ ఆచరణతో సంబంధం లేని సిద్ధాంతం నిరుపయోగం. అట్లాగే విప్లవ సిద్ధాంతం లేని కార్యచరణ చీకట్లో తడుములాడుకుంటున్నట్లుంటుంది. విప్లవ ఆచరణతో సిద్ధాంతం విడదీయలేని విధంగా సమన్వయం అయితే కార్మిక వర్గ ఉద్యమంలో సిద్ధాంతం బ్రహ్మాండమైన శక్తి కాగలదు. కార్మిక వర్గ ఉద్యమానికి దృఢమైన నమ్మకం దృక్కోణం చుట్టూ ఉండే ఘటనలతో గల అంతర్ సంబంధాలపై ఆ అవగాహనను సిద్ధాంతం మాత్రమే ఇవ్వగలదు. ప్రస్తుత సమయంలో వర్గాలు ఏ దిశలో ఏ విధంగా ప్రయాణిస్తున్నాయో అర్థం చేసుకోవడానికి సిద్ధాంతం మాత్రమే సహాయపడుతుందని కామ్రేడ్ మాధవరావు గారి ఆలోచన. వర్తమాన,గత తరాల మానవ కార్యాచరణ నుండి సిద్ధాంతం అభివృద్ధి చెందింది. అయితే సిద్ధాంతం లేకుండా కార్యాచరణ లక్ష్యాన్ని సాధించలేదు. అలాంటి కార్యాచరణ తో సన్నిహితంగా సమన్వయం కావాలి. సిద్ధాంతం కార్యాచరణ చెట్లు విత్తనం లాంటివి. విడదీయలేని పరస్పరం సంబంధం గల జంటలవి. ఇట్లాంటి సిద్ధాంతాలన్నీ మాధవరావు గారు నిరంతరం అధ్యయనం చేస్తూ, ఆచరిస్తూ వర్గ పోరాటాల్లో భాగమయ్యాడు. అధ్యయనాన్ని ఎలా చేయాలి జ్ఞానాన్ని ఎలా సంపాదించుకోవాలి జ్ఞానం జ్ఞానం కోసమేనా సమాజ మార్పు కోసం అనే విషయాన్ని ఉమ్మడి రాష్ట్రమంతా విప్లవ కార్యకర్తలకు విద్యార్థులకు రాజకీయ క్లాసులు బోధించాడు. వర్గ పోరాటాలు, ప్రజా ఉద్యమాలు, ఆందోళనలు, సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాల్లో విప్లవ శ్రేణులు పాల్గొనే విధంగా తమ సిద్ధాంత పరిజ్ఞానాన్ని అందించాడు. సమాజంలో జరుగుతున్న అనేక విషయాలపై సిద్ధాంత వ్యాసాలు రాశాడు. అనేక సిద్ధాంత గ్రంథాలను తెలుగులోకి అనువాదం చేశాడు. తానే స్వయంగా కొన్ని గ్రంథాలను రచించాడు. పార్టీ మహాసభల్లో తెలుగు నుండి ఇంగ్లీష్, ఇంగ్లీష్ నుండి తెలుగులోకి నాయకులు కార్యకర్తలు మాట్లాడిన విషయాన్ని విసుగు విరామం లేకుండా రోజుల తరబడి తర్జుమా చేసేవాడు.

విద్యార్థి దశలోని PDSU రాజకీయ భావాలను అర్థం చేసుకొని, ప్రజాస్వామిక శక్తులన్నిటిని ఏకం చేయడానికి కృషి చేసి న కామ్రేడ్ గొర్రెపాటి మాధవరావు గారు మానవ హక్కుల నేతగా కొనసాగుతూ, ప్రజల పైన రాజ్యం దాడులు కొనసాగించినప్పుడు ముఖ్యంగా ఆదివాసీల పక్షాన నిలబడి బూటకపు ఎన్కౌంటర్లపై నిజనిర్ధాలను చేసి, రాజ్య నిజస్వరూపాన్ని బట్టబయలు చేశాడు. ఆదివాసీల తరపున నిలబడి వారి హక్కుల కోసం కలబడ్డాడు. ఈ దేశంలో అణగారిన ప్రజల కోసం ఆయన చేసిన పోరాటాల గురించి, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఆయన చేసిన కృషి, ఆయన సునిశిత మేధస్సు గురించి ఆయన చనిపోయిన తర్వాత అర్థమవుతున్నది. నిర్దిష్ట పరిస్థితిని నిర్దిష్టంగా విశ్లేషించడమే గతితార్కిక జీవన సారము అని కామ్రేడ్

లెనిన్ అంటారు. ఈ సూత్రీకరణను కామ్రేడ్ మాధవరావు గారు తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎన్నడూ మరువలేదు.

కామ్రేడ్ గొర్రెపాటి మాధవరావు గారు ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో రోజురోజుకు పెచ్చురెళుతున్న ఫాసిస్టు ధోరణులు ప్రబలుతున్న దశలో భౌతికంగా మన నుండి దూరం కావడం తీవ్ర నష్టకరం. కానీ ఆయన ఆశయం, ఆయన చేసిన కృషి మన మధ్య ఉంది. ఒక మహోద్యమ హక్కుల నేతగా అందరి మధ్యలో స్థిరపడటం ఆషామాషి వ్యవహారం కాదు. అది కేవలం మాధవరావు గారికి సాధ్యమైంది. అందుకే భారత రాజకీయ యవనికపై ఆయనది చెరగని సంతకం. అలాంటి మహోన్నతుడు మన ముందుంచిన ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లడమే మన ముందున్న ప్రస్తుత కర్తవ్యం.

# మేధో పిపాసి, శ్రామిక పక్షపాతి, ఉద్యమ వకీలు కా॥ గొర్రెపాటి మాధవరావు

– పోటు రంగారావు,
*కార్యదర్శి, సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్, తెలంగాణ.*

నవ్వులు, పువ్వులు, కొంత కోపం, తాపం, వీటితో పాటు మంచి మేధోతనం, అంతకు మించి రాజకీయ జిజ్ఞాస, సైద్ధాంతిక పిపాసి కామ్రేడ్ గొర్రెపాటి మాధవరావు. 67 సం॥ల వయస్సులోనే ఆయన ఆకస్మికంగా గుండె పోటుతో మరణించడం బాధాకరమైనది. విషాధకరమైనది.

నేను పీడీయస్‌యులో చురుకుగా పనిచేస్తున్న దగ్గర నుంచి నాకు పరిచయం. లా కళాశాల విద్యార్థులుగా మాధవరావు, విజయ్‌కుమార్, పురుషోత్తం, పోట్ల వేణు, తదితరులంతా ఒక బృందం. యాక్టివ్ టీమ్. పీడీఎస్‌యులో చురుకైన పాత్ర పోషించారు. ఉస్మానియాలో లా హాస్టల్ వారికొక విప్లవ రాజకీయాల అడ్డా. పీడీఎస్‌యుకు పెద్ద ఎస్టేట్.

ఆ తరువాత ఆనాటికి నడుస్తున్న 'విమోచన' రాజకీయ పక్షపత్రికలో హెచ్‌ఆర్‌కే, తదితరులతో కలసి బాధ్యతలు చూశారు. చాలా కాలంపాటు పత్రికను నడపడంలో, అనువాదాలు చేయడంలో చురుకుగా వ్యవహరించారు. క్లాసులను కూడా తనదైన శైలిలో బోధించారు.

కా॥ డి.వి.కె. గారి సూచన మేరకైనా, పార్టీ నిర్ణయం మేరకైనా నిజామాబాద్ వెళ్ళి లాయర్‌గా ప్రాక్టీస్ ఆరంభించి, ప్రాక్టీస్ చేస్తున్న తన ఇంటిని రాజకీయ కేంద్రంగా మలుచుకున్నారు. బీడీ వర్కర్స్ యూనియన్ కార్యకలాపాలనూ, కేసులనూ కా॥ బొజ్జా తారకంతో సహా కలసి చూసేవారు. ఇతర పార్టీ వ్యవహారాలలో, పార్టీ నిర్మాణంలో కూడా ముఖ్య పాత్ర పోషించారు.

తొలుత పౌరహక్కుల సంఘ కార్యకలాపాలలో చురుకుగా వున్నారు. రాష్ట్ర బాధ్యతలు నిర్వహించారు. పౌరహక్కుల సంఘంలో అతివాద అవగాహనకూ, పౌరహక్కుల ఉద్యమ పర్‌స్పెక్టివ్‌కూ వ్యతిరేకంగా నిలకడైన అవగాహనను

వివరించడానికి బాధ్యత తీసుకున్నారు. అటు తరువాత తన అనుచర కామ్రేడ్స్ పౌరహక్కుల సంఘంలో వుండగా, తాను బాలగోపాల్ గారిని అనుసరించి మానవ హక్కుల సంఘంలో బాధ్యతలను తీసుకొని పనిచేశారు.

కా॥ మాదవరావు మేధో మదనానికి వ్యంగ్యం ఎక్కువ. అలానే స్వాతిశయం కూడా ఎక్కువే. ఇది ఆయనకూ, పార్టీకీ మధ్య కొంత వైరుధ్యాన్ని సృష్టించింది. పార్టీ మొత్తాన్ని తనే నడిపించాలనే అతి దృక్పథానికి గురయ్యాడనే విమర్శలు ఎదుర్కొన్నారు. అది పార్టీలో తగవులను సృష్టించింది.

ఏది ఏమైనా కా॥ మాధవరావు కమ్యూనిస్టు సిద్ధాంత కమిట్‌మెంట్ వున్న మేధో శ్రామికుడు. అది ఆయన కృషికి వన్నె తెచ్చింది. ఎన్నో ఎన్‌కౌంటర్లపై నిజనిర్ధారణలో పాల్గొనడమేగాక, భిన్నమైన రీతిలో మృతులకూ, లాకప్ డెత్ బాధిత కుటుంబాలకూ కోర్టు ద్వారా నష్టపరిహారం ఇప్పించడం మంచి పరిణామం.

నిజామాబాద్ ఉద్యమమంతా గౌరవించే కా॥ మాధవరావు కొంత వ్యక్తివాదం వలన కొందరి మనిషిగా మారడం బాధాకరం. చివరలో 10-15 సం॥లపాటు నిజామాబాద్ ఉద్యమాలలో కలతలకు అతను ఒక కేంద్రం కావడం విషాదకరం. అతను ఒక పెద్ద దిక్కుగా, సమన్వయకర్తగా వుంటే ఇంకా ఎంతో విలువ వచ్చేది. తలఎత్తిన గ్రూపు వైరుధ్యంలో ఆయన భాగస్వామ్యం నుంచి ఆయన మేధావితనాన్ని చిన్న బుచ్చే దగ్గర దాకా చర్చించుకోవాల్సి రావడం అందరం సమీక్షించుకోవాల్సిందే.

రచయితగా, అనువాదకుడిగా, హక్కుల ఉద్యమంలో నేతగా, లాయర్‌గా, ప్రజా ఉద్యమ పక్షపాతిగా, రాజకీయ, సైద్ధాంతిక దృష్టి, చివర దాకా విడనాడకుండా వుండటం ఆయన జీవితానికి వన్నె తెచ్చింది. ఆయన దీక్షా దక్షతలు వున్నవారు. కళాకారుడూ కూడా. అలానే సుదీర్ఘకాలం సైద్ధాంతిక చర్చలలో కా॥ డి.వి.కె., వి.వి, రవన్నలను అనుసరించడం ఆ రాజకీయాలకు కూడా వకీలుగా వుండడం ఘనమైన విషయం.

ఆయన మరణానికి చింతిస్తూ, ఆయనకు మరోసారి విప్లవ జోహార్లు.

అలాంటి అరుదైన వ్యక్తులు ఒక్కొక్కరు రాలి పోతున్నారు. తరం మారుతున్నది. స్వరాలు ఆగుతున్నాయి. రేపటితరం అలాంటి బలమైన స్వరాలుగా, తరాలుగా మారడమే ఆయనకు నిజమైన నివాళి.

# మాధవన్నయ్యా అప్పుడే వెళ్ళి పోయావా...?

- గొర్రెపాటి రామకృష్ణ
*(మాధవరావు గారి సోదరుడు)*

అన్నయ్యా, మాధవన్నయ్యా అప్పుడే వెళ్ళి పోయావా, జగమంత కుటుంబాన్నీ, నిన్ను నమ్ముకున్న జనాన్నీ వదిలి ఎవరికీ అందనంత దూరం వెళ్లిపోయావన్నయ్యా నీవు. ప్రజలకోసం, ప్రజాహక్కుల కోసం నిరంతర పోరాటంలో ఎన్నో సాధించి, ఇంకా ఎంతో సాధించాల్సిన మీరు మధ్యలోనే వెళ్ళిపోయి, మమ్ములనందరిని దుఃఖ సాగరంలో వదిలేసి వెళ్ళి పోయారెందుకన్నయ్యా.

నా చదువు కోసం 1978లో జగమన్నయ్య నన్ను హైదరాబాద్ తీసుకొచ్చినప్పుడు అన్ని స్కూల్లలో అడ్మిషన్స్ పూర్తయిన వేళ మీరు నిఖిలేశ్వర్ గారి ద్వారా నారాయణగూడలోని కేశవ మెమోరియల్ హైస్కూల్‌లో జాయిన్ చేసినప్పటి జ్ఞాపకాలు నాకు బాగా గుర్తున్నాయి. 10 వ తరగతి పాస్ అయిన అనంతరం నన్ను నాంపల్లి జూనియర్ కాలేజీలో జాయిన్ చేసి,ఎన్నికల్లో పోటీ చేయించిన సంగతి నాకు ఇంకా జ్ఞాపకమే. ఇంటర్ బదులు పాలిటెక్నిక్ అయితే బాగుంటుందని విద్యానగర్‌లో మన ఇంటికి దగ్గర్లో ఉండే ఈశ్వర రావు సార్ ఇంటికి వెళ్ళి పాలిటెక్నిక్‌లో మావాడిని జాయిన్ చేయాలని అడిగితే, ఆయన నా మార్కులు చూసి ఏదయినా కంపెనీ నుండి స్పాన్సర్ చేస్తే సీటు వస్తుందని చెప్పగానే మీరు అన్నయ్యకి చెప్పడం, అన్నయ్య స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్ తెప్పించడంతో నన్ను మీరు రామంతపూర్ పాలిటెక్నిక్ కాలేజిలో జాయిన్ చేసిన జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి. పోలిటెక్నిక్ కాలేజీ లో అప్పటికే మీ ద్వారా పరిచయం వున్న పిడిఎస్‌యు అక్కడ పనిచేస్తుండంతో నేను అందులో జాయిన్ కావడం, నాయకత్వం వహించడం జరిగింది.

మన ఇంట్లో ఏ సమస్య వచ్చినా మీరు, జగమన్నయ్యతో కలిసి పరిష్కరించేవారు. మాకు ఏ సమస్య ఎదురైనా మీకు ఫోన్ చేయగానే అయ్యా రామకృష్ణా, చెప్పయ్యా అనే మీ గొంతు ఇక వినపడదనే విషయం అసలే మింగుడు పడటం లేదు.

నాన్నతో పాటు పోటీపడుతూ మీరు పాడే పద్యాలు, సంక్రాంతికి మన కుటుంబసభ్యులు అందరం కలిసినప్పుడు మీరు చేసే సందడి ఎన్నటికీ మరవలేనిది. ఈ సంవత్సరం కూడా సంక్రాంతికి ఐదు రోజులు అందరం ఊర్లో కలుసుకుందామని మాట ఇచ్చిన నీవు ఇలా అంతలోనే వెళ్ళిపోయావెందుకన్నయ్యా.

హైదరాబాద్‌లో లా పూర్తికావడం, అప్పటికే పార్టీలో అంతర్గతంగా బేదాభిప్రాయాలు పొడచూపడంతో విమోచన పత్రికలో ఉన్న అన్నయ్యను దానినుండి నుండి తప్పించడం జరిగింది. అదే సమయం లో అన్నయ్య కి అత్యంత సన్నిహితులైన ముత్యం, చందు (చంద్రశేఖర్ రెడ్డి) లతో చర్చించి,వాళ్ళ సూచన సలహా మేరకు నిజామాబాద్ చేరడం జరిగింది. అప్పటికే అక్కడ DVK, పాపన్న లాంటి వాళ్ళ కోరిక మేరకు అక్కడే లా ప్రాక్టీస్ ప్రారంభించారు. ప్రాక్టీసు తో పాటు పౌరహక్కుల కోసం పనిచేస్తూ APCLCలో నాయకుడిగా ఎదగడంజరిగింది. ఆ క్రమంలో ప్రధానంగా ఆ రోజుల్లో నిజామాబాదులో ఎక్కువగా బూటకపు ఎన్కౌంటర్లు జరిగేవి వాటికి వ్యతిరేకంగా ఉద్యమిస్తూ చట్టప్రకారం దోషలను శిక్షించాలని కోర్టులలో కేసులు వేసారు. ఆఖరికి బూటకపు ఎన్కౌంటరులో చనిపోయిన అతనికి (పేరు గుర్తు లేదు) ప్రభుత్వం నుండి నష్ట పరిహారం చెల్లించే విధంగా కోర్టు తీర్పు వచ్చేవిధంగా కోర్టులో న్యాయ పోరాటం చేసి విజయం సాధించారు. అట్లాగే ఒక దొంగతనం కేసులో పోలీస్ లాకప్ డెత్ కేసులో కూడా పోలీస్‌ల చేత నష్ట పరిహారం కోసం న్యాయ స్థానంలో కొట్లాడి నష్టపరిహారం సాధించారు.

ఒత్తుకుందాం కంటతడిని, ఎత్తుకుందాం ఎర్రజెండా, అనే నినాదాన్ని మొదటగా రూపొందించి దానిని ఇచ్చింది కూడా మాధవన్నయ్యే అని ఒక మీటింగ్‌లో ఆయనే స్వయంగా చెప్పారు. 1978 వ సంవత్సరంలో శ్రీకాకుళం జిల్లాలో ఎన్నికల ప్రచార సంధర్భంగా ఓయూ నుండి తమ బృందం వెళ్లినప్పుడు ఆ ప్రజల త్యాగాలకు పులకించి పోయి అలాంటి నినాదాలు పుట్టుకొచ్చాయని ఆయన చెప్పారు.

ప్రధానంగా నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో అమాయక సామాన్య ప్రజలు కల్తీ కల్లు తాగడం వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయో ఎప్పటికప్పుడు చైతన్యపర్చడంలో ముందుండి నిలబడ్డావు.

ఎప్పుడూ బంధువులు,మిత్రులతో ఆప్యాయంగా వుండే వాడివి, అందరూ నీ వాళ్ళు అని భావించి పలకరించే స్వభావం నీ స్వంతం. నీ జీవితం అంతా మనుషుల మధ్యలో వుండాలని తపించిన వాడివి.

మేము, ప్రధానంగా అరుణ నడుపుతున్న "డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ" కూడా మాధవన్నయ్య సూచనతో సంస్థగా రిజిస్ట్రేషన్ చేయించాము. తన సలహాలు, సంప్రదింపులతో నిర్వహిస్తున్నాము.

పౌరహక్కుల కోసం, రాజ్యహింసకు వ్యతిరేకంగా నీ కృషి వెలకట్టలేనిది.

నీ ఆరోగ్యం బాగా లేదని తెలిసికూడా కనీసం రెస్ట్ కూడా తీసుకోకుండా, పని భారాన్ని పెంచుకోవడం వలన నీ శరీరానికి శ్రమ ఎక్కువైనా లెక్క చేయకుండా, సరైన నిద్రకూడా పోకుండా నిత్యం అర్ధరాత్రులూ, అపరాత్రులు చదువుని మాత్రం మానలేదు. ప్రయాణాలు తగ్గించుకోలేదు, పైగా ఈ మధ్య కాలంలో ప్రయాణాలు మరింత ఎక్కువ చేసావు.

ఏ ఉద్యమాలు చేసినా సమిష్టిగా, ఒక సంస్థ ద్వారా చేయాలని, ఒంటరి పోరాటం వల్ల జనం లోకి ఎక్కువ తీసుకెళ్ల లేమనేవాడివి. ఒంటరి పోరాటాలతో చేపట్టే ఉద్యమాలు ఒంటరిగానే మిగిలిపోతాయానీ కనుక సంస్థల ద్వారా సంఘటితంగా ఉద్యమాలు చేయాలనీ అప్పుడే వాటికి మంచి గుర్తింపు వస్తాయనీ, అవి చరిత్రలో నిలిచిపోతాయనీ అని చెప్పే మా మాధవన్నయ్య మాకు దూరం కావడం మా కుటుంబంలో ఎనలేని బాధను మిగిల్చింది. ఆయనను నమ్ముకున్న వారందరిలోన ఇదేరకమైన బాధను మిగిల్చింది. వారు లేని లోటు ప్రత్యక్షంగా కనిపిస్తుంది. గుండె దిటవు చేసుకుని ఆయన బాటలో పయనించి ఆయన వదిలి వెళ్లిన ఆశయాల సాధనకోసం అందరం కృషి చేయడమే మనం ఆయనకు అర్పించే నివాళి అవుతుంది. బాధాతప్త హృదయంతో ...

# నిరంతర జ్ఞానాన్వేషి, న్యాయ క్షేత్ర కృషీవలుడు గొర్రెపాటి మాధవరావు

– డా.సరిత పిట్ల

*అసిస్టెంట్ ప్రొఫెసర్*

మనిషి ఊహ తెలిసినప్పటి నుంచి మరణించే వరకు జ్ఞానం నేర్చుకోవడం, పరులకు అందించటం సహజమే కానీ, మరణానంతరం కూడా జ్ఞానం అందించే కృషి కొనసాగించడం చాలా అరుదైనది. అది గొర్రెపాటి మాధవరావు గారికి సాధ్యమైంది. తన కళ్ళను మరొకరికి చూపుకై ఇవ్వడం కావచ్చు, తన దేహాన్ని మెడికల్ విద్యార్థుల జ్ఞానం కోసం అందించడం కావచ్చు. ఆ జ్ఞానపిపాసి మరణంలో కూడా తన కోరికను తీర్చుకున్నాడు. నిజామాబాద్ జిల్లాలో తనకంటే ముందు మరణించిన ప్రజాసంఘాల నాయకుల కుటుంబ సభ్యులు 15 మంది భౌతిక కాయాలను విద్యార్థుల జ్ఞానం కోసం అందించటంలో మాధవరావు గారి కృషి చాలా ఉంది. ఆయా కుటుంబాలను ఒప్పించడంలో తను ముందున్నారు. చివరికి తను కూడా ఆ పదిహేను మంది సరసన చేరి 16వ వ్యక్తి అయ్యాడు. అలా చేరే రోజు ఇంత తొందరగా వస్తుందని ఎవరూ ఊహించలేదు.

జ్ఞానం ఎక్కడున్నా అక్కడికి ఆయన చూపు వెళ్ళేది. తనకు తెలియని విషయాలను తనకంటే చిన్నవాళ్ల నుంచి కూడా నేర్చుకోవడానికి వెనకాడే వారు కాదు. నూతన సాంకేతికతను ఒడిసిపట్టడంలో నేర్పరి. ఎప్పటికప్పుడు నూతన సాంకేతికతను నేర్చుకొని అనుసరించేవాడు. నిరంతరం జ్ఞానం కోసం పరితపించే తపస్వి మాధవరావు గారు. నిరంతర పఠనం ఆయనను గొప్ప మేధావిగా తీర్చిదిద్దింది. ఇంట్లోనూ, ఆఫీసులోనూ, ప్రయాణంలోనైనా అలుపెరుగక అధ్యయనం చేసేవారు. అలా తాను సంపాదించిన జ్ఞానాన్ని తన ఎదుగుదలకే కాక, సమాజ మార్పు కోసం అందరూ సమానంగా బ్రతికే సమాజం కోసం ఉపయోగించేవారు. తన జ్ఞానాన్ని ఎంతోమంది ప్రజా ఉద్యమకారులకు నాయకులకు నిరంతరం పంచేవారు. యూనివర్సిటీ విద్యార్థులకు పాఠాలు కూడా బోధించారు.

ఉద్యమాలు సరైన మార్గంలో ప్రయాణించాలంటే సరైన మార్గ నిర్దేశం జరగాలి. అది సరైన సిద్ధాంతాలతోనే సాధ్యం అలాంటి సిద్ధాంత గ్రంథాలను ఔపోసన పట్టిన వారు మాధవ రావు గారు. అనేక సిద్ధాంత గ్రంథాలను ఆకలింపు చేసుకుని ప్రజా ఉ ద్యమకారులకు విడమర్చి చెప్పడంలో తనకి ఎవరూ సాటిరారు. అందుకే చరిత్ర గతిని మార్చే కార్ల్ మార్క్స్ గతి తర్కాన్ని ఆకలింపు చేసుకొని "ఆచరణలో గతి తర్కం" అనే డి.డి. కోశాంబి రాసిన పుస్తకం అనువాదం చేశారు. అధ్యయనంలో వెనుకబడుతున్న ఉద్యమకారుల పట్ల కాస్త అసహనాన్ని వ్యక్తం చేసేవారు. ఎందుకంటే, సమాజాన్ని మార్చాలి అనుకున్నప్పుడు ఆ సమాజాన్ని సంపూర్ణంగా అధ్యయం చేయాల్సిన బాధ్యత ఉందనేవారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా సమాజ గతిని తిరోగమనం వైపు నడిపిస్తుందని ఆవేదన చెందేవారు. అందుకే, అధ్యయనం విషయంలో కఠినంగానే వ్యవహరించేవారు. గత కొంతకాలంగా తన ఆరోగ్యం క్షీణిస్తున్న పరిస్థితుల్లో కూడా ఇప్పటి భారత ప్రభుత్వం భారత రాజ్యాంగానికి ముప్పు తెస్తుందని అర్థం చేసుకొని రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అందుకోసం భారత రాజ్యాంగాన్నీ దాని స్ఫూర్తినీ ప్రజల కోసం చేయబడిన చట్టాలను సులభ పద్ధతిలో వివరించేవారు. భారత ప్రభుత్వం తెచ్చిన నూతన రైతు చట్టాలను, కార్మిక చట్టాలను తెలుగులోకి అనువదించి,అర్థం చేయించి ఉద్యమాలకు వెన్ను దన్నైనారు. అంతేకాదు, భారత రాజ్యాంగ రచనలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మనకు తెలిసిన దానికంటే ఎక్కువగా కృషి చేశారని అర్థం చేసుకొని ఆయన కృషి పై ఒక పరిశోధన మొదలు పెట్టారు. అందులో భాగంగా ఆనాడు పార్లమెంట్లో జరిగిన చర్చల పూర్తి సారంతో ఉన్న 13 గ్రంథాలను అధ్యయనం చేయడం మొదలుపెట్టారు. ఆ సందర్భంలోనే రాజ్యాంగ రచనలో 13 మంది మహిళల కృషి కూడా ఉందని తెలుసుకున్నారు. వారి గురించి కూడా బయటపెట్టాలని అనుకున్నారు. కానీ అది పూర్తికాకుండానే కన్నుమూశారు.

మాధవరావు గారు తాను అధ్యయనం చేసిన అంశాలను రచనలుగా మలుస్తూ, వేరువేరు భాషల్లో సమాజానికి ఉపయోగపడే రచనలు ఉంటే, వాటిని తెలుగులోకి అనువదించేవారు. తనకు వివిధ భాషల మీద పట్టు ఉండడం ఆయన మేధో శక్తికి నిదర్శనం. తక్కువ పదాలతో ఎక్కువ అర్థాన్నిచ్చే రచనలు చేయడం ఆయన ప్రత్యేకత. అలాగని ఆయన అధ్యయనం సామాజిక అంశాలకే పరిమితం కాలేదు. రామాయణం, మహాభారతం, భాగవతం, ఖురాన్ బైబిల్ లాంటి గ్రంథాలను చదివారు. అందులోని అంశాలనూ, డొల్లతనాన్ని కూడా అవలీలగా చెప్పగలిగే వారు. మహాభారతంలోని భాగవతంలోని గ్రాంథిక పద్యాలను తన తండ్రితో పోటీ పడుతూ పాడేవారని వారి సోదరులు అంటారు. సహచరులతో ప్రయాణాలు చేస్తున్నప్పుడు ఆయన నోటి నుంచి

శ్రావ్యమైన పద్యాలు వినిపించేవారు. ఆయన విద్యార్థిగా ఉన్నప్పుడు నాటికలలో వివిధ వేషాలు కట్టేవారు. అలా సాంస్కృతిక రంగంలో కూడా తను ప్రతిభ కలిగి ఉన్నారు. తెలుగు నాట విప్లవ సాంస్కృతిక రంగాన్ని మొదలుపెట్టిన కానూరి గారితో ఆయనకు చక్కని అనుబంధం ఉంది. ఆ రంగం ఏర్పాటులో తన పాత్ర కూడా ఉంది.

తాను చదవడం మాత్రమే కాదు, తన సహచరులతో చదివించడం కోసం కూడా చాలా ప్రయత్నాలు చేసేవారు. వివిధ సంస్థలు ప్రచురిస్తున్న రచనలను పరిశీలించి అవసరమైన పుస్తకాలు తెచ్చి సహచరులకు అందించి, చదివించడాన్ని తన కర్తవ్యం గా భావించేవారు. తన చుట్టూ ఉన్న వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం చేసేవారు. అది రచనలోనైనా పాటలోనైనా, మాటలోనైనా బోధనలోనైనా, ఎందులో ప్రతిభ ఉన్నా దాన్ని బయటకు తీసే వైపు ప్రయత్నాలు చేసేవారు. అందుకే మాధవ రావు గారు నిరంతర జ్ఞానాన్వేషి అయ్యారు. నిత్య చైతన్య శీలిగా మారారు.

మరొకవైపు తన వృత్తి అయిన న్యాయ క్షేత్రంలో న్యాయాన్ని గెలిపించే కృషీవలుడి పాత్ర పోషించారు. అందుకోసం న్యాయ శాస్త్ర గ్రంథాలను కంఠస్థం చేశారు. తన ఆఫీసు మొత్తం న్యాయ శాస్త్ర గ్రంధాలయం.నిరంతరం న్యాయం వైపే వాదించేవారు.

తన కేసు వాదన మొదలు పెడితే ఎదుటి పక్షం వారికి ముచ్చెమటలు పట్టేవి,జడ్జిలే గౌరవించేంతస్థాయి న్యాయ శాస్త్ర విజ్ఞానం ఆయన సొంతం. ప్రభుత్వ ప్లీడర్ గా అవకాశం వచ్చినా వదిలేసుకున్నారు. అంతటి ఆదర్శవంతంగా బ్రతికిన వ్యక్తి.వృత్తి గత బాధ్యతతో పాటు, సామాజిక బాధ్యత కోసం కూడా కేసులు వాదించారు. ఎన్నో ఉద్యమకేసులను ఉచితంగా వాదించారు. ఎంతోమంది ఉద్యమ నాయకులకు అండదండల అందించారు. రాజ్యం పెట్టిన కుట్ర కేసులనూ, ఉపా కేసులనూ ఎదురుకోవడం కోసం ప్రజా నాయకులకు అండగా నిలిచారు. ఆ కేసులు వాదించి న్యాయాన్ని గెలిపించారు. ఆదిలాబాద్ ఆదివాసులపై రాజ్యం ప్రయోగిస్తున్న కేసులను వ్యతిరేకిస్తూ, వారికి అండగా నిలబడ్డారు. నిరంతరం వారికి సలహాలు, సూచనలు ఇచ్చారు.

భారతదేశ చరిత్రలో నిలిచిపోయేలా పోలీసులపై ఎన్కౌంటర్ కేసులు గెలిచారు. మూడు కేసులలో బాధితులను గెలిపించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇప్పించడం ఆయన ఒక్కడివల్లనే సాధ్యమైంది. ఇల్లు లేని నిరుపేదలు ప్రభుత్వ భూములు గుడిసెలు వేసుకుంటే బడా బాబులకు గిట్టక వాటిని కూలదొయ్యి చూస్తే ఆ నిరుపేదలకు అండగా నిలిచి, గెలిపించి నిరుపేదల లాయర్ గా మారారు. బూటకపు ఎన్కౌంటర్లు, కుల బహిష్కరణలు జరిగిన ప్రతి చోటకి వెళ్లి నిజాలను నిర్భయంగా బయటపెట్టిన

ధీశాలి మాధవరావు గారు. ఎన్ని చేసినా మిగతా హక్కుల నాయకులపై కేసులు పెట్టినట్టు రాజ్యం మాధవరావు పై కేసులు పెట్టడానికి జంకింది. ఎందుకంటే, అంతటి మేధోశక్తిపై కేసులు పెట్టడం వల్ల తమ డొల్లతనం బయటపడుతుందని భయపడి రాజ్యం తనను వదిలేసింది.

విద్యార్థి దశలో ప్రగతిశీల ఉద్యమాలతో మమేకమైన మాధవరావు గారు వృత్తిలో చేరినాక, పౌర హక్కుల ఉద్యమంలో భాగస్వామ్యమై మానవ హక్కుల దివిటీగా వెలిగారు. మానవ హక్కుల ఉల్లంఘన జరిగిన ప్రతిసారి తన గొంతు నినదించేది.

సునిశిత పరిశీలన, పదునైన విమర్శ ఆయన సొంతం. ముక్కుసూటి మనిషి. శత్రువునైన మంచి చేసినప్పుడు అభినందించే గొప్ప గుణం, పిల్లల పట్ల,కుటుంబం పట్ల, సహచరుల పట్ల అమితమైన వాత్సల్యం కలిగిన మంచి వ్యక్తి.

అలాంటి మాధవరావు గారి మరణం సమాజాకీ, హక్కుల ఉద్యమానికీ, సహచరులకూ, ఆయనను అభిమానించే అందరికీ పూడ్చలేని లోటు. ఒకవైపు ఫాసిస్టు వ్యవస్థ తీవ్రతరమైతున్న పరిస్థితుల్లో ప్రజా ఉద్యమాలు, హక్కుల ఉద్యమాల ఆవశ్యకత పెరుగుతున్న పరిస్థితుల్లో ఇలాంటి గొప్ప మేధావిని కోల్పోవడం భారత సమాజానికి తీవ్ర నష్టం.

ఆయనతో పరిచయమే గొప్ప అనుకున్న పరిస్థితుల్లో తనతో కలిసి పని చేయటం, కొంతమేరకైనా నేర్చుకునే అవకాశం రావడం గర్వంగా ఉంది. గత 15 సంవత్సరాలుగా మాధవ గారితో కలిసి అనేక చర్చల్లో పాల్గొనడం, పుస్తకాలు చదవడం, అనువాదాలలో సహకరించటం విలువైన జ్ఞాపకాలు. ఇంకా ఎన్నో నేర్చుకోవాల్సిన తరుణంలో తను దూరం కావడం చాలా బాధాకరం. అయినా తను నేర్పిన చైతన్యం, తనిచ్చిన స్ఫూర్తి నిత్యం నాలో రగులుతూనే ఉంటుంది. ఒక మహోన్నత వ్యక్తిని తయారు చేసుకోవడానికి సమాజానికి 50 ఏళ్లు పట్టింది. మరల అలాంటి వ్యక్తి తయారు కావడానికి ఎన్నో ఏళ్లు పట్టొచ్చు. అందుకే ప్రతి ఒక్కరూ మాధవరావు గారి లో ఉన్న బహుముఖ ప్రతిభను ఆదర్శంగా తీసుకొని, ఆయన ఆశయాలకూ, లక్ష్యాలకూ అనుగుణంగా పనిచేయడమే తనకు అందించే ఘనమైన నివాళి.అందరూ సమానంగా ఉండే, హక్కులన్నీ అందరికీ అందే సమాజం ఆయన లక్ష్యం. అది సాధించటం మన కర్తవ్యం.

# An Exceptional Legal Practitioner Sri. Madhav Rao Gaaru

**- N. Ramkumar**
*Registrar (FAC)*
*Telangana State Consumer Disputes*
*Redressal Commission (TSCDRC).*

Sri, Gorrepati Madhav Rao Gaaru is an extraordinary individual who left an indelible mark on our lives and the lives of countless others. Our beloved GMR was not only an exceptional legal practitioner but also a compassionate human being who dedicated his life to serving others. No matter how much is said about GMR will not suffice.

As a lawyer, he was a force to be reckoned with. His exceptional skills, razor-sharp mind and unwavering dedication earned him the respect and admiration of his peers, clients and even opponents. He had a unique ability to dissect complex cases, identify key issues and develop innovative solutions. His success in the courtroom was a testament to his hard work, perseverance and passion for justice.

However, GMR's impact extended far beyond the courtroom. He was a true champion of the underprivileged, the marginalized and the oppressed. He believed that access to justice was a fundamental right and he worked tirelessly to ensure that everyone, regardless of their background or means, had access to quality legal representation.

In this context, I want to remind you that the fight he put-in for getting justice against fake encounter cases was reported in national news in the year 1995-1996. It was salvage for the

poor and innocent victims. Lest, he made the NHRC to hold its sitting at Nizamabad to inquire into the fake encounters.

His generosity, empathy and kindness inspired countless people and his legacy will continue to inspire future generations. He was a shining example of what it means to live a life of purpose, compassion and service.

The skill and knowledge possessed by him is immeasurable. I started my journey with GMR long back in December 1993. At the first instance, Sri V.Sangam introduced me to Sri Gorrepati Madhava Rao garu. From day one, I was influenced by his way of greeting. His power to inspire, motivate and persuade have swayed me from a common man to a logical thinker. He has the power to impact on the persons around him. He possessed excellent communication skills, confidence, passion, empathy and preparation.

He used to prepare the arguments thoroughly and organize his thoughts in a logical and coherent manner. Not only he is a good orator but he is an excellent listener, particularly, in matrimonial cases while taking brief from the clients. The medical cases dealt by him at Consumer Forum are matters of break for the younger lawyers.

As we remember GMR today, we honour not only his remarkable achievements but also his extraordinary spirit. We remember his infectious smile, his warm laughter and his unwavering optimism. We remember the countless lives he touched, the families he helped and the communities he served.

As we say goodbye to this remarkable individual, we take comfort in the knowledge that his legacy will live on through us. We will continue to draw inspiration from his example and we will strike to make a positive impact in our own communities. His memory will be a blessing to us all.

# నింగికెగసిన నేల తారక మాధవన్న

**– వేములపల్లి విజయ**

మాధవన్న – నేను గౌరవించే వ్యక్తుల్లో మొదటివరుసలోని వాడు. చాలా అరుదైన వాళ్లలో ఒకడు. గొప్ప మేధావి న్యాయ శాస్త్రాన్ని ఔపోసన పట్టిన ఉన్నత విద్యావంతుడు – చదివిన ప్రతీ విషయాన్నీ సమకాలీన పరిస్థితులకు అన్వయించి, ఆచరించినవాడు. ఆయన నిత్య విద్యార్థి –పరిశోధకుడు; నాకిష్టమైన మంచి ఉపన్యాసకుడు – గొప్ప రచయిత. అనేక భాషల్లో సాటి లేనంత పరిజ్ఞానమున్నప్పటికీ, తన అంతరంగాన్ని అతి సున్నితంగానూ, సరళంగానూ వ్యక్తీకరించగలిగిన మంచి నేర్పరి. సాంస్కృతిక –సాహిత్య పిపాసి, రాజకీయ జిజ్ఞాసకుడు. మంచి అనువాదకుడు, అనేక మార్క్సిస్ట్ –లెనినిస్ట్ గ్రంథాల్ని మేధోమథనం చేసినవాడు. అన్నింటికీ మించి హక్కుల ఉద్యమంలో అలుపెరగని మహా నాయకుడు. ఆయన ముందు ఎదిగిన నాలాంటి వాళ్ళెంతో మందికి ఆయన స్ఫూర్తి ప్రధాత, మార్గదర్శకుడు. అందుకే కాబోలు – ఆయన శరీరం ఎంతో కాలంగా సహకరించకపోయినప్పటికీ, తన కాళ్లతో మమ్మల్నందరినీ నడిపిస్తాడని ఆశపడ్డాం. కళ్ళతో నైనా మాకు దిశానిర్దేశం చేయగలడని కలలుకన్నాం. బేజారెత్తిన మా గుండెలకు ఆయనే దిటవు కాగలడని నిబ్బరంగా వున్నాం.

ఆయనేమో – ఎంతకూ తననందుకోలేని మా మట్టి బుర్రల్ని ఎగతాళి చేస్తూ, ఒక శూన్యాన్ని మిగిల్చి వెళ్ళిపోయాడు. ఆయన కిష్టమైన మేధోప్రపంచానికి ఇప్పటికింక ఆయన మాత్రమే రారాజు అని చాటింపేసి మరీ వెళ్ళిపోయాడు. ఇప్పుడింక – ఎవరు మాత్రం పూడ్చగలరు ఆ శూన్యాన్ని? ఎవ్వరు మాత్రం సాటి రాగలరు ఆ మేధోసంపన్నం ముందు ??

కనీసం –

ఆయనలా నిండారా ఆప్యాయతల్ని అందరికీ పంచగలమా !

ఆయనలా చిరునవ్వుతో సమస్యల్ని అధిగమించగలమా !!

ఏమో,

ఇది ఈ సంధికాలపు వైచిత్రి కావచ్చునేమో !!!

తూర్పు దిక్కున పురుడు పోసుకున్న ఎర్రెర్రని ఉషోదయానికి పులకించి , పరవళ్లు తొక్కిన గోదావరి నదీ ప్రవాహం కొండాకోనల్ని దాటివచ్చి, పచ్చని మా చేలల్లో ఎందరో నేల తారకల్ని నాటి వెళ్ళింది. ఆ నేల తారకల్ని పొదవి పట్టుకున్న "ఇందూరు" మాతల్లి తన బంగారు బిడ్డల్ని విప్లవోద్యమానికి అంకితమిచ్చింది– జెసిఎస్ ప్రసాద్ మొదలుకొని మా మాధవన్న వరకూ ఎందరెందరో విప్లవోద్యమాన్ని తమ భుజాలకెత్తుకున్నారు. ఒక్కొక్కరుగా నింగికేగిన తన నేలతారకల్ని చూసి ఇప్పుడా తల్లి కడుపు తరుక్కు పోతోంది.

గౌరవనీయులు శకుంతల, వెంకటేశ్వర్రావు గార్ల మూడవ సంతానం మాధవన్న. ఆరుగురు అన్నదమ్ముల తరువాత చిన్నది –ఒక్కగానొక్క చెల్లెలు వసంత. చెల్లెలంటే అన్నలందరికీ చెప్పలేనంత అనురాగం –అన్నలన్నా చెల్లెలికి అంతకు మించిన అభిమానం .అమ్మా నాన్నలంటే అందరికీ ప్రాణం. కుటుంబమంతా కలిశారంటే అదొక అనురాగాల పూదోటే.

"మీనా" తో సాంగత్యం మిత్రులతో ఆయనకు మరింత సాన్నిహిత్యాన్నీ, కోరుకున్న విప్లవకర జీవితాన్నీ తెచ్చిపెట్టింది. అందుకే కాబోలు ఆయన మనందరిలో తన కుటుంబాన్ని చూసుకున్నాడు. మనం నవ్వితే మనసారా నవ్వాడు , బాధ పడితే గుండె పగిలేలా ఏడ్చాడు . మంచానపడ్డ ప్రతిసారీ మా అరుణ చేసిపెట్టిన వంటకాలు తిన్నాక , మా అమ్మ చేసినట్లుందమ్మా అంటూ – ఇంక నేను రికవరీ అయిపోతానంటూ చిన్నపిల్లాడిలా ఆనందపడి పోయేవాడు. ఆసుపత్రికి మోసుకెళ్ళటం దగ్గరి నుండి ఇంటికి తిరిగి వచ్చేవరకూ అన్నిపనులూ శ్రీధర్ బాధ్యతగా చూసేవాడు. తన తండ్రి మరణం తరువాత శ్రీధర్ మాధవన్నకు మరింత దగ్గరయ్యాడు . మాధవన్న కూడా "అరేయ్ సిరీ" అంటూ ఆప్యాయంగా పిలుచుకునేవాడు. కొంతకాలంగా – జిల్లా పార్టీ సన్నిహితులందరిలోనూ ఆయన్ని ఎలాగైనా కాపాడుకోవాలనే ఆలోచన ఒక సహజమైన బాధ్యతగా అయిపోయింది.

మాధవన్న సున్నిత మనస్కుడుగా మనందరికీ కనిపిస్తాడు. ముత్యం గారి మరణం తర్వాత ఆయన స్మారకార్థం రాసిన వ్యాసంలో "ఓరి ముత్యమూ" తో మొదలుపెట్టి– ''అల్విదా భాయీ'' అంటూ గుండెల్ని పిండేసే అక్షరాలని ఆవిష్కరించగలిగాడు.

అంతరంగంలో ఎన్ని బడబాగ్నులున్నా పైకి మాత్రం నిశ్చలంగా, నిర్మలంగా, ప్రశాంతంగా కనిపిస్తాడు. అస్తిత్వాన్ని దెబ్బ తీయాలని చూస్తే మాత్రం నిద్రాణంగా ఉంచిన అహాన్ని ఒక్క వుదుటున తట్టి లేపి, నిట్టనిటారుగా నిలబెట్టగలడు. ఆయన కాలంలో జిల్లాలో జరిగిన అన్ని ఉద్యమాలకూ ఆయనే సూత్రధారి. జిల్లా పార్టీతో దగ్గరి సంబంధం కలిగిన వ్యక్తులందరి కుటుంబాల్లో పుట్టుక నుండి చావు వరకూ జరిగే అన్ని కార్యక్రమాలకూ మాధవన్నదే నిర్ణయాధికారం.

ఈ విశిష్టతలే ఆయన్ని చివరికంటా విప్లవకమ్యూనిస్టుగానూ, అరుదైన ప్రతిభా పాటవాలున్న వ్యక్తి గానూ నిలబెట్టాయి. అందుకే ఎన్ని కాలాలకైనా ఆయన మనందరికీ చిరస్మరణీయుడు.

# Joharlu to Com. Madhava Rao

***- Narsa Goud***

*We are shocked to know that com. Madhav Rao is no more. He was active and no known health issues. He was two years junior to me in Banswada Junior college(at that time I did not know him). I came to know him when He was studying in Law college and I was in Ph. D program at Science Colleges, OU. Later, We worked for Vimochana. I attended his first marriage. Later we worked together in APCLC also . We have been in touch since then. I am in disbelief that my meeting with him in August 2021 turned out to be the last one. Joharlu to com. Madhava Rao and condolences to his family.*

# గొర్రెపాటి మాధవరావు గారు!
# అలా ఎలా వెళ్లిపోయారు మాధవరావు గారు?

**- బి. రమాసుందరి**

'ఎందుకురా అంత తొందరగా వెళ్లిపోయావ్ ముత్యం' అంటూ ముత్యంగారి మీద మీరు రాసిన ఎలిజీ చదివి కొద్ది నెలలు కూడా కాలేదు. ఎందుకు అంత తొందరగా వెళ్లిపోయారు మాధవరావుగారు?'

ఇప్పుడు నేనిలా మీరు నాతో జరిపిన సంభాషణలను పక్కన పెట్టుకుని పొద్దుటి నుండి అచేతనంగా, నిస్సహాయంగా, పంటిబిగువున దుఃఖాన్ని మోస్తూ కూర్చొని ఉన్నాను. పంచుకోవటానికి ఎవరు అందుబాటులో కూడా లేరు. అందరూ విలీన సభలో ఉన్నారు. అన్నట్లు విలీనం కోసం మీరు ఎంత ఎదురు చూసారో కదా. ఎంత సంతోషపడ్డారో కదా. 'నా పాలిటిక్స్ అటు వైపేనమ్మా. కానీ నువ్వు, సంధ్య, పద్మనే నాకు క్లోస్. విచిత్రం కదా' అని అన్నారు కదా.

విలీనం రోజే మీరు చనిపోవటం ఏమిటి? మనం కలిసి చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి కదా. మీరు ఎన్ని కథలు, వ్యాసాలు మాకు అందించాలి? మీ జీవితానుభవాలతో, చదివిన పుస్తకాల సారాలతో మాతృకను పరిపుష్టం చేయవద్దా? మాతృకను అలా వదిలేసి వెళ్లిపోతారా? మీరు కట్టించిన 20 చందాల వాళ్లతో gorrepaati madhavarao subscriptions whats app గ్రూప్ తయారు చేసాను కానీ, వాళ్లతో ఇంకా నాకు పరిచయం కూడా సరిగ్గా చేయలేదు మీరు!

రెండు నెలలుగా రెండు ముక్కలు కూడా రాయలేకపోతున్నాను. రెండు వాక్యాలు కూడా చదవలేకపోతున్నాను. ఇప్పుడు మీ కోసం నేను ఏమీ రాయగలను? ఖాళీ గుండెలు, బలహీనమైన చేతులు, మాటలు దొరకని వాక్యాలు. మీరందరూ ఇలా వెళ్లిపోతుంటే నివాళులు రాయడానికే బతికి ఉన్నట్లుగా ఉంది నాకు.

'షామల ఎందుకు అలా తొందరపడి వెళ్ళిపోయింది' అన్న మీ ప్రశ్నకు నేను సమాధానం ఇవ్వటానికి ధైర్యం తెచ్చుకొని లోపునే మీరు అలా వెళ్ళిపోతారా?

నవంబర్ 16నే కదా 'రాజ్యంగ నిర్మాణంలో 15మంది మహిళల కంట్రిబ్యూషన్

వుంది. వాళ్లను మాతృకలో పరిచయం చేద్దామా?' అని అడిగారు. 'తప్పక చేద్దాం. మీరు రాయండి' అని నేను చెప్పాను కదా. డిసెంబర్ 1న ఎందుకు రాయలేదని అడిగితే 'విపరీతమైన పని వత్తిడిలో ఉన్నానమ్మా రమా. ప్రాథమిక స్వేచ్ఛల మీద రాజ్యాంగ పరిషత్తులో చర్చ చదువుతున్నప్పుడే పూర్ణిమ చేసిన అద్భుతమైన దోహదం వెల్లడైంది. అంబేద్కర్ ని ఎదుర్కొని నిలబడి పరిషత్తును మొత్తాన్ని తన వైపు తిప్పుకొన్నది. ఆ erudition, commitment to personal liberty చూస్తే దేశం ఆమెకు ఎంత రుణపడి వుంటుందో కదా అనిపిస్తుంది. ఇలా ఒక్కొక్కరు ఒక్కోసారి తమ contribution ని అందించారు. అంతా ఒక్కసారి చదువుదామంటే పదివేల పేజీల మాట' అని మీరు అన్నారు.

రాధక్క గురించి 'నిర్మల రాధక్కగా మారిన తీరు' అనే టైటిల్ తో మీరు జూలై మాతృకలో రాసిన వ్యాసం భలే క్లిక్ అయిందని, ఎంతోమంది ఆమె గురించి, మీ వ్యాసం గురించి మాట్లాడుకున్నారని ఇద్దరం సంబరం పడి పోయాం కదా. ప్రకాష్ రావు గారు, సజయ అత్తగారు లాంటి పెద్దలు మాతృకలో ఆ వ్యాసం చదివి సంధ్యకు ఫోన్ చేసారని కూడా చెప్పుకుని సంతోషపడి పోయాం. మీరు అనువాదం చేసిన మంటో కథ గురించి వసంత లక్ష్మిగారు 'రావి శాస్త్రిగారు గుర్తుకొచ్చారు. వస్తువు, అనువాదం రెండు బాగున్నాయి' అన్నారని నాతో మీరు చెప్పారు. తరువాత మీరు పంపిన మంటో కథకు మంచి బొమ్మ వేయించానని మీరు రాశారు. తరువాత మీరు పంపిన ఇంకో మంటో కథలో అడల్ట్ కంటెంట్ ఉందని, మాతృకలో వేయటానికి కొద్దిగా ఇబ్బందిగా ఉందని మీతో చెప్పటానికి నేను ఎంత తటపటాయించానో! కానీ మీరు విషయాన్ని చక్కగా అర్థం చేసుకున్నారు.

ఎక్కువ మీరే మాట్లాడుతారు. నేను టైప్ చేసే ఓపిక లేక ఎమోజీలు పెడుతుంటాను. కొన్నిసార్లు 'ఏంటమ్మా నవ్వుతావు, సమాధానం చెప్పకుండా' అంటూ పట్టుబడతారు మీరు. 'రేపు మీకు కాల్ చేస్తానండి' అని తప్పించుకుంటాను. మీకూ, నాకూ తెలుసు 'ఆ రేపులో' మీకూ, నాకూ తీరిక ఉండదని.

సెప్టెంబర్ 1న విజయవాడలో జరిగిన వరదలకు సహాయంగా మేము చేసిన రిలీఫ్ కు మీరూ, మీతో బాటు ఎంతోమంది చేత కంట్రిబ్యూట్ చేయించారు. మా రిక్వెస్ట్ ని దాదాపు 20000 మందికి పంపానని చెప్పారు.

ఆ మధ్య ఎప్పుడో 'ఆరోగ్యం బాగలేదు. నేను, మీనా హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యాము' అని రాసినప్పుడు కూడా ఏమీ బాగలేదు' అని కూడా నేను అడగలేదు. ఇలాంటి దుర్మార్గురాలిని కూడా మీరు ప్రేమించారు.

ఎక్కడో నిజామాబాద్‌లో మీరు. ఒంగోలులో, గుంటూరులో నేనూ. మిమ్మల్ని సజీవంగా, నిర్జీవంగా కూడా చూడలేనంత దూరం మనది. మీరేమి హాయిగా వెళ్లిపోయారు. నవ్వుతున్న ఫోటోను మాకు మిగిల్చి. మేము కదా ఇక్కడ మీరు లేనితనాన్ని మోయాల్సింది.

మీరు లేని లోటు తీరలేనిది. ఈ మాట వందశాతం నిజమైనా వినటానికి పేలవంగా వుంది. అంతకన్నా నాకు మాటలు ఇప్పుడు రావటం లేదు. ఈ అస్తవ్యస్తమైన నివాళికి నన్ను క్షమించండి.

# పరోపకారమే ఆయన ఆఖరి మజిలీ - మాధవరావు గారి జీవితమే ఒక పాఠం...

**- పారుపల్లి జవహర్‌బాబు (రాజా)**

న్యాయవాది, ఖమ్మం

పరోపకారార్ధం ఇదం శరీరం అంటూ నిజామాబాద్ వైద్య కళాశాలకు శరీరదానం చేసిన సంధర్భంగా సాగే సంతాప సమావేశాల్లో వినిపించే ప్రసంగం ఇకముందు వినపడదు. మనిషి మరణించిన అనంతరం కూడా వైద్య విధ్యార్ధుల ప్రయోగాలకోసం ఉపయోగపడవచ్చు నని చెప్పడానికి మాధవరావు గారు అలా ప్రసంగించేవారు. 2017 మొదలుకొని దాదాపు 15 భౌతిక కాయాలు మాధవరావు గారి ఆద్వర్యంలో నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్ధుల ప్రయోగం నిమిత్తం అప్పగించడం ఒక రికార్డ్. అలా 15 శరీరదానాల తర్వాత మాధవరావు గారు నిర్జీవంగా 16 వ మృతదేహంగా పరోపకారి గా తానే మారారు.. ముందు సజీవంగా తర్వాత నిర్జీవంగా. శరీర అవయవ దానాల చట్టం రావడానికి కారణమైన ఒక సాంఘిక సేవకురాలు ఇటీవల ఒక న్యాయమూర్తి ద్వారా నాకు ఫోన్‌లో పరిచయినప్పుడు మాధవరావు గారి ఆద్వర్యంలో నిజామాబాద్ లో జరుగుతున్న ఉద్యమం గురించి చెప్పి ఫేస్బుక్‌లో ఆయన రాసిన పోస్ట్ కూడా ఆమెకు పంపాను. జనవరి 3న సావిత్రిభాయి పూలే జన్మదినం నాడు విజయవాడలో తాము ఒక కార్యక్రమం నిర్వహిస్తున్న సందర్భంగా పుస్తకం ఒకటి వేస్తున్నామనీ రచయిత పేరు తెలిపితే వారి పేరు తోనే ప్రచురిస్తామనీ ఆమె చెప్పారు. దాని కోసం నేను మాధవరావు గారి అనుమతి కోరడం జరిగింది ఫోన్‌లో దానికేమి భాగ్యమయ్యా వేసుకోమను.. మంచి కోసమే కద అన్నారు.. అవే ఆయనతో ఆఖరి మాటలవుతాయని అనుకోలేదు.. ఎందుకంటే 22, 23 తేదీల్లో కాకినాడలో జరిగే మా ఉభయుల బంధువుల పెండ్లిలో కలుస్తాం కదా అనుకున్నా.. వారు నిజామాబాద్ నుండి 21న బయలు దేరగా మేము 22 ఉదయం బయలుదేరవలసి ఉంది. మాకు రిటర్న్ టికెట్ లు 23 ఉదయం ఉండగా మాధవరావు గారు వైజాగ్‌లో జరిగే మరో కార్యక్రమానికి కూడా వెళ్లడంతో 25 రాత్రి తిరిగి నిజామాబాద్ చేరుకున్నారు. అనుకోని కారణాల వలన మా ప్రోగ్రామ్

రద్దయినందున మేము ఆయనతో ఆ రెండు రోజులు గడపలేకపోయాం. గత రెండేళ్ళ క్రితం కాకినాడ వెళ్లినప్పుడు ఆయన మేము యానాం వరకు వెళ్లి వచ్చాం. మరోసారి అవకాశం లభించిందని సంతోషపడినా మేము మా ప్రయాణం రద్దుచేసుకోవడం వలన అది సాధ్యం కాలేదు. తిరిగి వచ్చిన మరుసటి రోజే 27న మధ్యాహ్న సమయంలో ఈ దుర్వార్త మాకు చేరింది. అయితే అరగంట ప్రయత్నం తర్వాత ఆయనలో కదలికలు మొదలయ్యాయని వెంటిలేటర్ పై ఉన్నారని తెలిసి అప్పటికప్పుడే బయలుదేరి హాస్పిటల్ లో ఉన్న ఆయనను చూసి రావడం జరిగింది. ఏదైనా అద్భుతం జరిగితే ఆయన కోలుకోవచ్చునని ఆ రాత్రి వైద్యులు అన్న మాటలు నిజం కాలేదు .. 28 ఉదయం ఆయన మరణ వార్త ను వినవలసి వచ్చింది.

మానవ హక్కుల నిలువెత్తు సంతకం గొర్రెపాటి మాధవరావు గారు. నిజామాబాద్ జిల్లాలోని బోధన్ తాలూకాలోని బస్వాపూర్ లో జన్మించిన మాధవరావు గారు హైదరాబాద్‌లోని సిటీ కాలేజ్ లో చదువుతూ పిడిఎస్‌యులోకి ఆకర్షించబడ్డారు. తర్వాత క్యాంపస్‌లో న్యాయశాస్త్రం అభ్యసించారు. పీడీయస్యూ పత్రిక విజృంభణ భాధ్యతలు ఈ హాస్టల్ రూం నెంబర్ 50 కేంద్రంగా చూసేవారు. రాజమల్లా రెడ్డి గారు, చావా సత్యనారాయణ ప్రసాద్, పోట్ల వేణు, కొండపల్లి విజయ్ కుమార్, కొత్తగూడెం పుల్లయ్య గారు, బాబూరావు గారు, పురుషోత్తం గారు తదితరులు అప్పుడు మాధవరావు గారికి సహచరులుగా క్యాంపస్‌లో అన్ని కార్యక్రమాల్లో పాల్గొనేవారు. మాధవరావు గారు మంచి మేధావి. న్యాయవిద్య పూర్తయిన తర్వాత లేదా చదువుతూనే విమోచన బాధ్యతల్లో కూడా పాలుపంచుకునేవారు. సాంస్కృతిక కళారంగాల్లో కూడా ఆయనకు ప్రవేశం ఉంది. డాక్టర్ ముత్యం గారితో మంచి సాన్నిహిత్యం ఇటీవల ముత్యం గారి మరణం వరకు కొనసాగింది. మాదవరావు గారు మొదట సీయల్సీ తర్వాత హెచ్ఆర్‌యఫ్‌లలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఎన్కౌంటర్ కేసులలో సివిల్ కోర్టులో నష్టపరిహారం కేసు వేసి విజయం సాధించి దేశవ్యాప్తంగా ఆ ఘనత సాధించిన మొట్టమొదట దిట్ట మన మాధవరావు గారు. ఆయన అనేక రంగాల్లో తన ప్రతిభ చూపారు. రచన, అనువాదం, న్యాయవాద వృత్తి, కళా, సాంస్కృతిక రంగాల్లో బహుముఖ కృషి చేశారు.నాకు మాధవరావు గారి కన్నా ముందు ఆయన తమ్ముడు రామకృష్ణతో ఉస్మానియాలో చదువుతున్నప్పుడే పరిచయం. సిఎల్‌సిలో పనిచేసినప్పుడు మాధవరావు గారి డైరెక్షన్‌లోనే నడిచేవాళ్లం. తర్వాత నేను సిఎల్‌సి నుండి పూర్తిగా వైదొలిగిపోయాను. మాధవరావు గారు మానవహక్కుల వేదికను తన భుజాల కెత్తుకుని ముందుకు నడిపించారు. ముక్కుసూటిగా కుండబద్దలు కొట్టినట్లు తీవ్రంగా స్పందించే గుణం వలన ఆయన కొన్ని సార్లు ఇబ్బందులను సైతం ఎదుర్కొన్నారు. సత్యం

సమాధి కావడం ఆయనకు నచ్చేది కాదు. నిత్యం దాని కోసమే తపించే ఆయన ముత్యం గారి మరణం తర్వాత మరుగున పడిన సత్యాన్ని బయటపెట్టి, మరోసారి వార్తల్లో ప్రముఖంగా కనిపించారు. తమ చుట్టూ చుట్టు ముట్టి న మురికిని మలినాన్ని సహించలేని తత్వమే మాధవరావు గారిని కడిగిన ముత్యంలా మెరిసేలా చేసింది.

తనవైపు నుండి ఏవైనా తప్పు జరిగినా, నిర్మొహమాటంగా అంగీకరించడం ఆయన ప్రత్యేకత. 30 సం.ల క్రితం జరిగిన ఒక సంఘటనను రివ్యూ చేసుకుంటూ అది కరెక్ట్ స్టాండ్ కాదంటూ, ఒక లోపంగా ఆయన అంగీకరించడం విశేషం. అనారోగ్యంతో ఉన్న కానూరి తాతను కొంతకాలం తన ఇంట్లోనే ఉంచుకున్నారు. బాగోగులు చూశారు. కానూరి తాత డాక్యుమెంటరీ నిర్మాణానికి ముత్యంగారికి ఆర్థికంగా హార్ధికంగా అండదండలు అందించారు. అప్పటి ముఖ్యులు ఎవరు మృతి చెందినా తానున్నానని ముందుకు వచ్చి అందరినీ సమన్వయం చేసి స్ఫూర్తిగా నిలిచారు. ఇలా ఎందరికీ స్ఫూర్తినిచ్చిన ఆయన తన అనారోగ్యం విషయంలో మాత్రం పూర్తి నిర్లక్ష్యం వహించడం వలన అనేక సందర్భాల్లో నీరసించినా, తిరిగి కోలుకుని అందరిలో స్ఫూర్తిని రగిలించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన పిడిఎస్‌యు స్వర్ణోత్సవ సభలలో చురుకుగా పాల్గొన్నారు. డిసెంబరు 16 నుండి 18 వరకు అనంతపురంలో జరిగిన తమ హక్కుల సంఘం సభలలో పాల్గొన్నారు.ఇంతలో గుండెపోటు ఆయనను అభిమానించే వారి హృదయాల్లో తీరని లోటు మిగిల్చి మాధవరావు గారిని తీసుకెళ్లిపోయింది. మాధవరావు గారి మరణం న్యాయవాద వృత్తికీ హక్కుల ఉద్యమాలకూ సామాజిక ఉద్యమాలకూ తీరని నష్టమేనని చెప్పుకోవాలి. వారి మరణం పట్ల తీవ్రమైన విచారం తో వినమ్ర పూర్వక నివాళులు అర్పిస్తూ...

*08-01-2025.*

# మాధవుడు పరిపూర్ణ మానవుడు

– ప్రొ. వినయ్ బాబు

*(ఆనాటి అరుణోదయ సహచరుడు)*

మనుషుల్లో రకరకాలు చదువుల్లో దిట్టవులు, చేసే వృత్తిలో ప్రవీణులు. రచయితలు, సిద్ధాంతకర్తలు, ఉపన్యాసకులు, కళాకారులు, నాయకులు, శ్రామికులు, బోధకులు, ఉద్యమసారాదులు, పోరాట వీరులు, కరుణా హృదయలు, స్నేహశీలులు, ఇవ్వన్నీ ఒక్కరిలో కలిస్తే ఆయనే గొర్రెపాటి మాధవరావు. జంపాల ప్రసాద్ ఊరు ఎత్తోండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఓనమాలు, జంపాల దగ్గర రాజకీయ ఓనమాలు నేర్చికొని అయన రాజకీయ బాటలోనే జీవితాన్ని కొనసాగించాడు. స్కూల్లో, కాలేజీల్లో విద్యలో ముందు వరుస లోనే వుండేవాడు. సిటీ కాలేజీ B. Com లోనైన, OU క్యాంపస్‌లో లా కాలేజీ లోనైనా రాజకీయాలు, ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూనే, ఆయా కోర్స్‌ల్లో శ్రదగా, నిజాయితీగా ఏనాడూ ఫెయిల్ అనేది లేకుండా విద్యాభ్యాసాలు పూర్తి చేసాడు. పాఠ్య పుస్తకమైనా, రాజకీయ పుస్తమైనా ఒక్కసారి తీసుకున్నాడంటే ఇరానీ చాయ్, చార్మినార్ సిగరెట్ సేవిస్తూ వాటి అంతు చూసేవాడు. ఇంగ్లీష్, తెలుగు ఏ పుస్తకామైనా అయనకొకటే. రెండు భాషల్లోనూ ప్రావీణ్యుడు. రాజకీయ అవసరాల దృష్ట్యా ఇటు నుండి అటు, అటు నుండి ఇటు అనువాదాలు చేసే ప్రయోక్త, రచయిత మాధవరావు. విమోచన పత్రికకు సంపాదకుడిగా విజయవంతంగా నాలుగు సంవత్సరాలు నడిపాడు. స్కూల్ రోజుల్లో నుండే సంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఒక నట ప్రావిణ్యుడిగా ఎదిగి ఎమర్జెన్సీ తరువాత అరుణోదయ, పూర్వ కళాకారులందరూ ప్రక్కకు జరిగితే కా॥ కానూరి, కా॥ రామారావులతో పాటు నిర్మాణ బాధ్యతలు తీసుకోని మాలాంటి వాళ్లను తీర్చిదిద్ది, ముఖ్యంగా నాకు నాటక ప్రావీణ్యాలు, రాజకీయ బోధనలు అరుణోదయ నాయకునిగా నన్ను తీర్చిదిద్ది జంటనగరాల బాధ్యతను నా భుజస్కాందాలపై నుంచి తాను విమోచన పూర్తి బాధ్యతలు తీసుకున్నాడు. నాటకాల్లో హావభావల ప్రదర్శనలో, డైలాగ్ డెలవరిలో "డాంగే పాత్ర డాన్స్ స్టెప్పుల్లో అటు పత్రిక

రాజకీయ వ్యాసాల్లో, సంపాదకీయాల్లో, అనువాద రచనల్లో యిలా అన్నింటిల్లో ఆయనకు ఆయనే సాటి.

చదువుల్లోనే కాదు చిన్నప్పటి నుండి నాన్నతో పాటు అన్ని వ్యవసాయ పనుల్లో పాల్గొంటూ ప్రవీణ్యుడై శ్రమించి, చమటోడ్చి వ్యవసాయ రైతు కూలిల సరసన నిలిచాడు. ఈ అనుభవంతోనే ఎన్ని గంటల శ్రమైన ఎన్ని మైళ్ల అయినా కాలినడకన (శ్రీకాకుళ ఎన్నికల ప్రచారాల్లో) చేయగలిగిన శ్రమైక జీవి.

విద్యార్థి ఉద్యమాల ద్వారా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన, మర్క్స, లెనిన్, మావోల రచనలు,భారత కమ్యూనిస్ట్ యోధుల రచనలు, భారత,తెలంగాణా సాయుధ పోరాట చరిత్ర, నక్సల్బరి శ్రీకాకుళ పోరాటాల అధ్యాయనాలు చేసి పూర్తి కాలపు రాజకీయ దురంధుడిగా ఎదిగాడు. ఎం.ఎల్ పార్టీల చీలికల్లో నచ్చిన రాజకీయాలను సిద్ధాంతీకరించడంలో కీలక పాత్రలు పోషించిన వారిలో, వారితో క్రియాశీలకంగా వున్నాడు. నమ్మిన రాజకీయాల వైపు నిలిచాడు కానీ వ్యక్తులవైపు కాదు.పార్టీలలో భాగస్వామ్యనికి దూరమై రాజకీయాలకు, ప్రజలకు మాత్రం దగ్గరగానే వున్నాడు. (ఈ మధ్య జరిగిన రాజకీయ పార్టీల ఐక్యత చర్చల్లో, చర్యల్లో పాలు పంచుకున్నాడనుకుంటా) అయన ఒకరిని కూర్చోబెట్టుకొని రాజకీయ బోధన మొదలు పెడితే ఏ పార్టీ తో వున్నా,కోరుకొండ సైనిక్ స్కూల్లో చదువుకొని ఉద్యమలే లేని పాత బస్తీ కాలేజీల్లో చదివే వాళ్లయినా ఈయన రాజకీలా వైపున నాయకులుగా ఎదగాల్సిందే. విద్యార్థి ఉద్యమాల్లో నైనా, ఎం.ఎల్ పార్టీల రాజకీయ సభలోనైనా, ఎన్నికల సభలోనైనా, రైతు కూలీ సంఘాల్లో నైనా ముఖ్యంగా మానవ హక్కుల సభల్లోనైనా అనర్గళంగా spell bound కాకపోయినా ఆయా విషయాలకు సంబందించిన పరిజ్ఞానాన్ని వివరిస్తూ,విశదీకరిస్తూ సందర్భచితంగా ఛలోక్తులు విసురుతూ శ్రోతలను కూర్చోబెట్టే సత్తాగల ఉపన్యాసకుడు.ఆయన తోటి కార్యకర్తపైన,రాజకీయ సహచరులపైన విశేష ప్రేమ,స్నేహం చూపే ఆపేక్ష జీవి మాధవరావు. ముఖ్యంగా నా సహచరిణి కా॥ కరుణ మాధవరావుల బాంధవ్యం రక్త సంబందీకుల కన్నా ఎక్కువగా వుండేది. మాధవన్నయ్య, చెల్లి, తల్లి కరుణ లాంటి సంబోధనలతో పులకరించి పోయేది.స్నేహ సంబంధాలకొస్తే సత్తుపల్లి కొండపల్లి విజయ్ కుమార్, కొత్తగూడెం పురుషోత్తం, ఖమ్మం పోట్ల వేణు కుటుంబీకులను,రాజమల్లన్న కుటుంబీకులను ఎవరిని కదిలించినా మాధవుడి ఆప్యాయత, అనురాగం మన హృదయాలను కలిచివేస్తుంది. మేము కా॥ మాధవరావు మిత్రులం, సహచరులం విలువలను కాపాడుకోవడానికి పడుతూ లేస్తూ వున్నాము. కానీ మాధవరావు ప్రజాసంబంధాలను, రాజకీయ ఆచరణను కొనసాగిస్తూ కా॥ బాలాగోపాల్ వదిలివెళ్లిన మానవ హక్కుల పోరాటాలను, ఉద్యమాలను అత్యంత

చైతన్యవంతంగా నడుపుతూ 'ఎన్‌కౌంటర్స్‌కి వ్యతిరేకంగా కోర్టుల ద్వారా ప్రజా ఉద్యమాల ద్వారా సాగిస్తూ ఎందరికో అండగా నిలిచాడు. న్యాయవాద వృత్తిని హై కోర్ట్ లో వుండదగ్గ వాడైనా నిజామాబాదులో కొనసాగి, ప్రభుత్వ పదవులలో పడకుండా పీడిత ప్రజల పక్షాన నిలబడ్డ నిజాయితీ, నిబద్దత కలిగిన ప్రజా న్యాయవాది కా॥ గొర్రెపాటి మాధవరావు.

ఈ మధ్య కాలంలో భౌతికంగా మన నుండి దూరమైన వారి గురించి ముఖ్యంగా అందరికి సిపి గారి భార్యగా మాత్రమే పరిగణించే వాళ్లందరికీ కమ్యూనిస్ట్ యోధురాలిగా "నిర్మల రాధక్కగా మారిన తీరు "వ్యాసం ద్వారా రాధక్క ఔన్నత్యాన్ని చాటాడు. కా॥ లాయర్ శంకర్ రాజకీయ జీవితాన్ని వివరించాడు. కా॥ ముత్యం మరణంతో చలించిపోయాడా. అతని రాజకీయ, సాహిత్య, జీవిత పోరాటాన్ని అందరికి విశదీకరించాడు. ఏరా నాకన్నా చిన్నవాడివే కదరా ఎందుకు వెళ్ళి పోయావు అంటూ ఆ ఆత్మీయుడి దగ్గరకి వెళ్ళి పోయాడు. సీతారాం ఏచూరి గారి మరణం సందర్భంగా "నిజామాబాదు కమ్యూనిస్టుల ఆదర్శం పేరుతో పార్థివ దేహాన్ని వైద్య విద్యార్థులకు అందివ్వడంలోని ఔన్నత్యాన్ని చాటి, వారిలో ఒక్కటయ్యాడు. కా॥ మాధవరావు ఒక పరిపూర్ణ మానవుడు, ఒక స్ఫూర్తి ప్రదాత. మాధవరావు భార్య మీనా సహాని,కూతుర్లు మానస,ఆదిత్య మధుమిత్‌లకు, ఇతర కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాను. ఆయన రాజకీయ, మానవ హక్కుల పరిరక్షణ ఉద్యమాలను కొనసాగించడమే నిజమైన నివాళి.

కా॥ మాధవరావు – అమర్ హై

కా॥ మాధవరావుకు జోహార్లు... లాల్ సలాం...

# చురుకైన నాయకుడు – మాధవరావు

– ప్రొ. ఎ.వినాయక రెడ్డి

మాధవరావు నాకు అత్యవసర పరిస్థితి(ఎమర్జెన్సీ) ముగిసిన తర్వాత హైదరాబాద్ లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) ఉద్యమంలో పరిచయం. అత్యవసర పరిస్థితి తరువాత విద్యార్థి ఉద్యమ పునర్నిర్మాణంలో చురుకుగా పనిచేసి నగర ఉద్యమంలో ప్రధాన విద్యార్థి నాయకుడిగా గుర్తింపు పొందాడు. మాధవరావు సిటీ కాలేజీలో, నేను ఎస్.పి. కాలేజీలో వున్నాము. ఆ రోజుల్లో మేము చదివే కాలేజీలలోనే కాక యితర కాలేజీల బాధ్యతలు కూడా చూస్తుండే వాళ్ళము. రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్ నాయకత్వాన కాలేజీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వున్న అత్యధిక కాలేజీలలో వామపక్ష విద్యార్థులు ఎన్నుకోబడ్డారు. మేము తరచూ ఉస్మానియా యూనివర్సిటీలో కలుస్తూ వుండేవాళ్ళము. మా మధ్య తరచూ విద్యార్థి సమస్యలపై పోరాటాలను ఎలా ముందుకు తీసుకుపోవాలని చర్చ జరిగేది. విద్యార్థి వుద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికి మాధవరావు నిరంతరం వివిధ పోరాట మార్గాలను సూచించడమే కాక పటిష్టమైన విద్యార్థి ఉద్యమంలో ఉద్యమాన్ని నిర్మించడంలో అగ్రగణ్యుడు కూడా.

ముఖ్యంగా ప్రస్తావించాల్సిన విషయం బిజెపి నాయకుడు ఇంద్రసేనారెడ్డి పెళ్లి యూనివర్సిటీ ఫ్యాకల్టీ క్లబ్‌లో జరిగిన రోజు ఏబీవీపీ ఇతర మతోన్మాద మూకలు ఏ హాస్టల్‌లోని రూమ్ నంబర్ 15పై దాడి చేయడం జరిగింది. ఆ రూముని పిడిఎస్‌యుకి క్యాంపస్‌లో హెడ్‌క్వార్టర్‌గా పరిగణించే వాళ్ళము. దాడి తర్వాత సమావేశమైన నగర కార్యవర్గం ప్రతీకార దాడులు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది. ఆరోజుమాకున్న సమాచారం మేరకు దాడికి పాల్పడ్డ వాళ్ళు డీ హాస్టల్‌లో వున్నారు. మేము ఇంజనీరింగ్ కాలేజీ హాస్టల్‌లో సమావేశమై, దాడికి సన్నద్ధమవుతుండగా, పార్టీ పెద్దలు దాడిని ఆపాల్సిందిగా ఆర్గనైజర్ ద్వారా మాకు సమాచారం పంపించిన సందర్భంలో మా మధ్య తీవ్ర చర్చ జరిగింది. ఆ విధంగా

చేస్తే మన విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం దెబ్బతింటే, ఉద్యమం నష్టపోయే అవకాశం వుందని, దాడి చేయడమే సరైనదని మాధవ్ బలంగా వాదించాడు. కానీ చివరకు అసంతృప్తితోనే దాడి చేయకుండా నిలిచిపోవడం జరిగింది. తర్వాత కాలంలో నేను ఉద్యమ అవసరాల రీత్యా వరంగల్‌కు పోవడం, మాధవరావు యూనివర్సిటీ లా కాలేజీలో చేరడం జరిగింది.

ఏదైనా సమస్య ఎదురైతే మాధవరావు తన హేతుబద్ధమైనఆలోచనతో సరైన విశ్లేషణ చేసి సమస్యకు పరిష్కారం చూపించేవాడు. అంతేకాకుండా నాటి పార్టీ పత్రిక 'విమోచన' బాధ్యతలను తీసుకొని విజయవంతంగా పనిచేయవచ్చని చూపినవాడు. తన శక్తి యుక్తులను ఎల్లప్పుడూ ఉద్యమ విస్తరణకు వినియోగించి, విద్యార్థుల పట్ల బాధ్యతగా ప్రవర్తించి మంచి మేధావిగా గుర్తించబడ్డాడు. తన మేధస్సును తన ప్రయోజనాలకు కాకుండా ప్రజల ప్రయోజనాలకే ఉపయోగించేవాడు.

అత్యవసర పరిస్థితి తర్వాత పార్టీ ఎన్నికలలో పాల్గొనాలని నిర్ణయించింది. ఆ సందర్భంగా విద్యార్థులను పార్టీ పోటీ చేసిన వివిధ ప్రాంతాలకు పంపించడం జరిగింది. దానిలో భాగంగా మాధవరావు ,నేను, కామ్రేడ్ ముత్యం, కోట సురేందర్ రెడ్డి ఇంకా ఇతర మిత్రులు శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గం వెళ్లడం జరిగింది. ప్రచారం ముగిసిన తర్వాత మేము ఉద్దానం ప్రాంతంలో కొద్ది రోజులు పార్టీ వారితో కలిసి పర్యటించడం జరిగింది. మేము పేర్లు మార్చుకొని తిరగాలి అనుకుంటే మాధవరావు నాకు గణపతి అని నామకరణం చేశాడు.

అక్కడి కామ్రేడ్స్ మా పట్ల చూపించిన ప్రేమ, ఆప్యాయతలు మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. పార్టీ పని విధానం, అమరులైన కామ్రేడ్స్ త్యాగాలను తెలుసుకొని ఎంతో ఉత్తేజితులమయ్యాము. ఆ సందర్భంలోనే పైలా వాసుదేవరావును కలిసి, శ్రీకాకుళం ఉద్యమం గురించి, తదనంతర పరిస్థితుల గురించి తెలుసుకోవడం జరిగింది. మాధవరావు ఏ విషయాన్నైనా గ్రహించడంలో చాలా చురుకుగా వుండేవాడు.

మాధవరావు లాయరుగా నిజామాబాద్‌కి పోయిన తర్వాత పౌర హక్కుల సంఘంలో చాలా ప్రభావవంతమైన పాత్ర పోషించాడు. పౌర హక్కులు కాపాడడం కోసం నిరంతరం పోరాడేవాడు. రాష్ట్ర పౌర హక్కుల సంఘంలో జరిగిన పరిణామాల వల్ల డాక్టర్ కె.బాలగోపాల్, ఎస్. జీవన్ కుమార్, ఖమ్మం శంకర్‌తో కలిసి మానవ హక్కుల వేదిక(హెచ్ఆర్ ఎఫ్)ని పటిష్టమైన సంఘంగా నిర్మించాడు. ఒక దశలో హెచ్ఆర్ఎఫ్ పై రాజ్య హింసను ప్రయోగించడం జరిగింది. పౌర హక్కుల నేతలైన డాక్టర్ రామనాథం, జాపా లక్ష్మారెడ్డిలను ప్రభుత్వం ప్రత్యక్షంగా హత్య చేయడం జరిగింది.

ప్రభుత్వ నిర్బంధాన్ని లెక్కచేయకుండా రాజ్యాంగం ప్రసాదించిన పౌర హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహా నాయకుడు మాధవరావు. మా మిత్రుడు డాక్టర్ కె.ముత్యం అనారోగ్యంతో మరణించిన సందర్భంగా నిజామాబాద్‌లో, ఆ తర్వాత హైదరాబాద్‌లో జరిగిన పిడిఎస్ యు 50 వార్షికోత్సవాల సందర్భంగా నేటి దేశ రాజకీయ పరిస్థితులు, వామపక్ష ఉద్యమాల ప్రభావం తక్కువ కావడం, మతోన్మాదులు దేశంలోని యితర మతస్తులపై దాడులకు, ఆదివాసులపై దాడులకు పాల్పడడం, ఆపరేషన్ కగార్ పేరుతో కమ్యూనిస్టు ఉద్యమాల పేరుతో దేశ పౌరులపైనే యుద్ధం ప్రకటించడం వంటి విషయాలు చర్చించడం జరిగింది. అన్ని కమ్యూనిస్టు పార్టీలతో కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక (టిఎస్‌డిఎఫ్)ను స్థాపించినందుకు ఎంతో సంతోషించాడు. టిఎస్‌డిఎఫ్‌ను పటిష్టంగా ముందుకు తీసుకుపోవడానికి పలు సూచనలు చేశాడు. మా మధ్య జరిగిన ప్రధానమైన చర్చ ఒక పౌర సమాజాన్ని స్థాపించడం గురించి జరిగింది. పిడిఎస్‌యు 50వ వార్షికోత్సవం సందర్భంగా చాలామంది ఆనాటి ఉద్యమ మిత్రులు కలుసుకోవడం జరిగింది.

ప్రజాస్వామిక పౌర ఉద్యమాన్ని నిర్మించడం చాలా అవసరమని దాని, గురించి కొందరు మిత్రులతో డిసెంబర్ 3, 2024న సమావేశం జరపాలని అనుకున్నాము. అన్ని జిల్లాల్లోని మిత్రులను సంప్రదించి, ఇందుకోసం ఎంతమంది, ఎంత సమయం కేటాయించి పనిచేస్తారో తెలుసుకున్న తర్వాత, విస్తృత స్థాయిలో చర్చించి సమావేశం కావాలని నిర్ణయించుకున్నాము. కొంతమంది మిత్రులు చర్చల్లో ఆవేదన వెలిబుచ్చుతారు కానీ ఆచరణలో ముందుకు రావడానికి సిద్ధంగా ఉండరు అని గుర్తించడం జరిగింది. స్వప్రయోజనాల కోసం వచ్చే వారిని గుర్తించి దూరంగా పెట్టి, పటిష్టమైన, ప్రభావవంతమైన ఉద్యమాన్ని నిర్మించి ప్రజలను చైతన్య పరచడం ద్వారా వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమకారులు కలిసి పనిచేసే వాతావరణ సృష్టించడం గురించి ప్రధానంగా చర్చించాము.

మాధవరావు మరణం వారి కుటుంబానికే కాకుండా ప్రజాతంత్ర ఉద్యమాలకు, పౌర హక్కులకు, దేశ ప్రజల విముక్తి పోరాటలకు తీవ్ర విషాదం కలిగించింది. మాధవరావు గారి ఆలోచనలను ముందుకు తీసుకుపోవడమే బాధ్యత కలిగిన పౌరులుగా మనం ప్రకటించే అసలైన నివాళి.

# హక్కుల ఉద్యమ నేత గొర్రెపాటి మాధవరావు

**- తులా రాజేందర్‌కుమార్**

*అడ్వకేట్*

1977లో ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత ఏపిసిఎల్సి నిర్వహించిన సభలో మొదటిసారి వైఎంసిఎ లో కలుసుకున్నాము. తర్వాత జంపాల ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా వివిధ కళాశాలలోకి వెళ్లే బృందంలో మేమిద్దరం కలిసి ఒకే బ్యాచ్ లో తిరిగాము. మాధవరావు లా కళాశాలలో, నేను ఆర్ట్స్ కళాశాలలో అడ్మిషన్ తీసుకొని వేరువేరు హాస్టల్లో ఉన్నప్పటికీ, ఎక్కువ సమయం మా హాస్టల్– A లోనే గడిపేవాళ్ళము. ఆర్ట్స్ కళాశాల మిత్రులతో, లా కళాశాల మిత్రులతో పిడిఎస్‌యు లో అందరం కలిసి ఎమర్జెన్సీ తర్వాత పునర్నిర్మాణంలో మేమిద్దరం సూర్యాపేటలో డాక్టర్ రంగన్న, వినాయక్ రెడ్డి, యాదవ రెడ్డి, రాజేంద్రప్రసాద్, ఉమాకాంత్, సురేందర్ రెడ్డి చురుగ్గా పాల్గొన్నారు. తర్వాత వచ్చిన ప్రభంజనంలో మళ్ళీ సంపత్ కుమార్, రవికుమార్, వినయ్ బాబు, వెంకట్రాజం, ఆనంద్, సిఎస్ఎన్, తదితరులు ఇంజనీరింగ్ కళాశాలలో పిడిఎస్ యు నిర్మాణం కోసం పనిచేశారు. లా కళాశాలలో మాధవరావుతో పాటు రాజమల్లారెడ్డి, రామకృష్ణారెడ్డి, రవీందర్ రెడ్డి, ఆ తర్వాత కాలంలో వేణు, విజయ్ కుమార్, పురుషోత్తం తదితరులు పనిచేశారు. ఆర్ట్స్ కళాశాలలో నాతోపాటు శ్రీధర్, ముత్యం, ప్రభాకర్ రెడ్డి, రంగవల్లి, సత్యనారాయణ ప్రసాద్, అండక్క, రామకృష్ణ, గురువారెడ్డి, అశోక్ సామ్రాట్, సంజీవ్, రమణయ్య, పర్వతనేని సుబ్బారావు, తదితరులు చురుగ్గా అన్ని ఉద్యమాలలో కలిసి వచ్చేవారు.

ఎమర్జెన్సీ తర్వాత జరిగిన విద్యార్థి సంఘాల ఎన్నికల్లో వామపక్ష ఐక్య సంఘటన ఏర్పాటు కోసం జరిగిన అన్ని చర్చల్లో మాధవరావు చురుగ్గా పాల్గొనడమే కాకుండా నిర్మాణాత్మక కృషి చేశారు.

ఆదివారాలలో హాస్టల్ మూసివేసినప్పుడు విద్యానగర్ లో ఉన్న మాధవరావు ఇంటికి రాత్రి భోజనానికి వెళ్లేవాళ్ళం. మాధవరావు కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. నిజామాబాద్‌లో అనేకసార్లు కలుసుకున్నాము

విద్యార్థి బృందాలు 1978లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ ప్రాంతాలకు వెళ్లగా, నేను, మాధవరావు, వినాయక్ రెడ్డి వెంకట్రాజం,సిఎస్ఎన్,సి సత్యనారాయణ రెడ్డి శ్రీకాకుళంలోని పాతపట్నంలో పోటీ చేసిన వారణాసి నారాయణరావుకు మద్దతుగా పని చేసాము. ఎన్నికల తర్వాత ఒకరిద్దరూ తిరిగి వచ్చినప్పటికీ నేను, మాధవరావు, వినాయక రెడ్డి ముగ్గురం కలిసి ఉద్దానం ఏజెన్సీ ప్రాంతాల్లో దాదాపు 15 రోజులు ఉండి, అక్కడ ఉద్యమ స్థితిగతులను పరిశీలించాము. జిల్లాలో బొడ్డపాడులోని అమరవీరుల కుటుంబాలను కూడా కలవడం జరిగింది. 1980లో నేను క్యాంపస్ వీడి బయటకు రైతాంగ ఉద్యమంలోకి పూర్తిస్థాయి కార్యకర్తగా వెళ్లాను. మాధవరావు విమోచన బాధ్యతలు చూస్తున్నప్పటికీ కలిసినప్పుడల్లా ఆత్మీయంగా సోదర భావంతో మెలిగే వాళ్ళం. చార్మినార్ సిగరెట్లు, చాయ్ లు ఎక్కువగా తాగేవాడు. సిటీ అలవాట్లు మానుకోవాలని మానుకోవాలని చాలాసార్లు చనువుతో చెప్పేవాడిని. ఎప్పుడు కలిసినా పాత విషయాలు, అనుభవాలు తరచుగా నెమరువేసుకునే వాళ్ళం. ఇటీవల ముత్యం అనారోగ్యానికి గురైనప్పుడు, ఆ తర్వాత ముత్యం చనిపోయినప్పుడు కలుసుకున్నాం. చర్చించుకున్నాం. ముత్యం స్మారక సంచిక తేవడంలో కూడా ఇద్దరం, కొంతమంది ప్రభాకర్ రెడ్డి, వినాయక రెడ్డి కలిసి చర్చించుకున్నాం. అనారోగ్యంతో ఉన్నప్పటికీ హైదరాబాద్, కరీంనగర్ స్మారక మీటింగ్ లకు హాజరవుతానని నాతో చెప్పాడు. అనారోగ్యం తాత్కాలికమే అనుకున్నాం కానీ, ఈ వార్త నాకు ఆశనిపాతం అయ్యింది. మాధవ కుటుంబానికీ, మిత్రులకూ, కామ్రేడ్స్ అందరికీ తీరని లోటు. హక్కుల నాయకుడు మాధవరావు అమర్ హై.

# మరపురాని మాయమైన మాధవన్న

– చెరుకు సుధాకర్

ఇక్కడ తెరిపి లేని వర్షం మాత్రమే కాదు... ఇప్పుడు తెరిపి లేకుండా సుత్లి దారాన్ని పుటుక్కున తెంపుకున్నట్లు దశాబ్దాల అనుబంధాన్ని తెంచుకొని ఒకరు మాయమైన దుఃఖాన్ని మరవకముందే మరొక్కరు మాయమవుతున్నారు.

నిండా నెల రోజులు కాలేదు. ఖమ్మంలో చల్లా శంకర్ చనిపోతే ఆయన సంస్మరణకు అనేక న్యాయ శాస్త్ర చర్చలు తమ మధ్య జరిగినవి గుర్తు చేస్తూ రాసిన వ్యాసం నా మననం చేసుకుంటున్నావో లేదో అప్పుడే ఆయన మరణ వార్తే వినవలసి వచ్చింది.

గొర్రెపాటి మాధవరావు... మాజీ పౌర హక్కులసంఘం అధ్యక్షుడు, మానవ హక్కుల సంఘం నాయకుడు, విస్తృతంగా అనేక అంశాలపై మాట్లాడడం రాయగలగ్గము, అన్నిటికంటే ముఖ్యంగా పట్టు విడవకుండా చట్టం పరిధిలోనే విచారణ జరగాలని ఉద్యమ కార్యకర్తల తరపున 40 ఏళ్లు పైబడిన తండ్లాట, వయసు మీద పడుతున్న అదే యవ్వన ఉత్తేజంతో కోర్టులో ప్రజా సంఘాలు ఆత్మీయులు అందరినీ పలకరిన్చడం.. నిజామాబాద్ టు హైదరాబాద్ షటిల్ బస్సులో వచ్చినంత సింపుల్‌గా వచ్చి పోవడం ఆయనకే సాధ్యమైన మనిషి..

మా అన్న.. మొన్న పిడిఎస్‌యు 50 వసంతాల సభలో ... అట్లా ఎదురుగా ఉరుకొచ్చి .. చెరుకు... హౌ ఆర్ యు అంటూ పలకరించడం.. అదే 45 ఏళ్ల క్రింది కోరంటి దవాఖాన ఎదురు విమోచన ఆఫీస్ దరిదాపుల్లో పలకరించినట్లుగా.. గుర్తుకొస్తే దుఃఖం పొర్లుకొస్తుంది.

హెచ్‌ఆర్‌కే, జయక్క, గొర్రెపాటి మాధవరావు... బయట హాల్లో.. ఓంకార్, పెద్ద విమలక్క.. అన్ని గుర్తుకొస్తున్నాయి.

వైద్య వృత్తిలో ఉండడంవల్ల,.. హైదరాబాదు నుండి విడదీయబడి.. అంతకుముందు 15 ఏళ్ల ముచ్చట ఏమోగాని... ఇంతమంది మిత్రులతో కలిసి

పనిచేయడం, ఇరానీ హొటల్లో చాయ్, ఇష్టం లేకున్నా వాళ్లు తాగే సిగరెట్ పొగ పీల్చడం, తప్పు ఒప్పులు.. గప్పాలు, గాసిప్స్, క్లాసిక్స్, బేసిక్స్.. తర్కము నరకం స్వర్గం.. చెప్పుకుంటూ పోతే చాలా మిస్ అయినట్లు అనిపిస్తుంది.

ఎప్పుడు ఒకసారి కలుసుకుంటే.. కాసేపు ముచ్చట్లు పెట్టుకొని విడిపోయిన కొద్ది కాలానికి ఎవరమో ఒకరు మిస్ అవ్వడం సాధారణమైపోయింది.

పేదరికం నిర్మూలిస్తాం... సంపద పంచుతాం.. రోజుల నుండి.... నక్సలైట్లను నిర్మూలిస్తాం... సంపద పంచమంటే సంపుడు పందెం కొనసాగిస్తాం... అంటూ రాజ్యాంగానికి, రాజ్యాంగ హక్కులకు సవాలు విసురుతున్న కాలంలో మనమిట్ల కాలం చేస్తే.. కాల గమనం ఎట్లుండునో? చల్ల శంకర్, గొర్రెపాటి మాధవరావు, అంతకుముందు కన్నాబిరాన్, బాలగోపాల్, బుర్ర రాములన్న, జయశ్రీ.. తెలుగు నేల కోల్పోయింది.. హక్కుల నాయకులను మాత్రమే కాదు.. రెక్క విప్పే ఫాసిజం గద్దలపై ఎదురు తిరిగి తల్లి కోడి వారసత్వాన్ని కదా!

అవయవ దానం మాత్రమే కాదు.. మరణానంతరం దేహాన్ని కూడా దానం చేయడం, వైద్య కళాశాలకు ఆ అప్పగించడం ఒక ట్రెండ్ అయితే అందులో గొర్రెపాటి కూడా భాగమే.

# ప్రజా న్యాయవాది
# గొర్రె పాటి మాధవరావు

**– బి.ఎల్.బి. రవి,**

*తెలంగాణ యూనివర్సిటీ PDSU పూర్వ అధ్యక్షులు.*

ప్రభుత్వం తరఫున కేసులు నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం చే నియమింపబడే న్యాయవాదిని గవర్నమెంట్ ప్లీడరు అంటారు .అటువంటి ఆఫర్లు తిరస్కరించి ప్రజల వైపు, ప్రజాపక్ష న్యాయవాదిగా ఉంటానని శపథం చేసిన అలుపెరగని ప్రజా హక్కుల న్యాయవాది గొర్రెపాటి మాధవరావు.

మధ్యతరగతి కుటుంబంలో పుట్టినా, తన ఆలోచన మొత్తం సామాన్యుల పక్షమే. ఉన్నత చదువులు చదివి విలాసవంతమైన జీవితం గడపడానికి కావాల్సినంత డబ్బు సంపాదించే అవకాశాలు ఉన్నా వాటిని కాదని తన ఆశయం, లక్ష్యం అయిన సమ సమాజం కోసం, హక్కుల కోసం, మానవహక్కుల రక్షణకై ప్రతి ఒక్కరూ పోరాడాలని ఊపిరి ఉన్నంతవరకు తపనపడ్డాడు.

రాజ్యం బూటకపు కేసులు, అక్రమ దొంగతనాల కేసులు పెడితే బాధితుల పక్షాన నిలబడి వాదించాడు. నిజామాబాద్ జిల్లాలో ఒక యువకుని పై అన్యాయంగా దొంగతనం కేసు పెట్టి చంపేస్తే, ఆ యువకుడి తల్లి దగ్గరికి వెళ్లి అది అక్రమ కేసు అని దానిపై పోరాడుదాం, వారు పోలీసులైనా సరే శిక్షింప చేద్దాం అని చైతన్యం చేసి ,ఆ కేసు తుది వరకు దృఢంగా నిలబడేలా ఆ వృద్ధురాలిని చైతన్యం చేసిన వ్యక్తి మాధవ రావు గారు. ఆ కేసు గెలిచి ఆ రోజుల్లోనే నష్టపరిహారంగా ప్రభుత్వం నుంచి లక్ష రూపాయలు ఇప్పించారు. ఇలా పోలీసుల అక్రమ కేసులను ప్రజలకు తెలిసేలా చేశారు.

ప్రజా నాయకులపై ఔరంగాబాద్ కుట్ర కేసు మోపితే ఆ కేసును తప్పుడు కేసు అని వాదించి, కొట్టివేసే విధంగా చేసిన న్యాయకోవిధులు మాధవరావు గారు.

పర్యావరణం అంటే ఆయనకు అమితమైన ప్రేమ. భవిష్యత్ తరాల కోసం దాన్ని కాపాడుకుందాం అని బాలగోపాల్, బుర్రా రాములు లాంటి సహచరులతో

పుస్తకాలు కరపత్రాలు రాశారు. ప్రజా ఉద్యమాలు చెయ్యడం ఒక ఎత్తు అయితే, పర్యావరణం కాపాడుకున్నప్పుడే మనిషి మనుగడ సాధ్యం అని ప్రగతిశీల శక్తులకు చెప్పేవారు.పర్యావరణం పై ఉన్న ప్రేమ వల్ల తన ఇంటి పరిసరాలు మొత్తం చెట్లు మొక్కలతో నిండిపోయి ఉండేలా చూసుకున్నారు.ప్రకృతి విధ్వంసాన్ని వ్యతిరేకించాడు. తను చెప్పిన మాటలే నేడు నిజమై ప్రపంచం మొత్తం పర్యావరణంపై తీవ్రమైన చర్చ జరుగుతుంది. అంతర్జాతీయ వేదికలన్నీ నేడు ఈ అంశంపై దృష్టి సారించాయి.

ప్రజల హక్కులు ఎక్కడ హరించబడుతున్నా అక్కడికి వెళ్లేవారు. దళితులపై దాడులు, బూటకపు ఎన్కౌంటర్లు ,కుల, మత వివక్ష దాడులు ఎక్కడ జరిగినా నిజ నిర్ధారణకు వెళ్లేవారు. తన మేధో సంపత్తితో ఇట్టే పోలీసు, ప్రభుత్వ వైఫల్యాలను గుర్తించి ప్రజల ముందు ఉంచేవారు.

పోలీసు రాజ్యం చే బాధింపబడ్డ వారి పక్షాన నిలబడి, వారి పక్షాన కేసులు వేసి, తప్పుడు కేసులను తన మేధస్సుతో బట్టబయలు చేసేవారు.

ఆ బాధితులు ఆర్థికంగా చితికిపోయి ఉంటే తనతో పాటు తన సహచరులు తనను ఫాలో అయ్యే వారందరితో ఆ కుటుంబానికి ఆర్థికంగా ఆదుకునే విధంగా చేసేవారు. అందర్నీ కదిలించేవారు.

బూటకపు ఎన్కౌంటర్లలో తనదైన ప్రత్యేకమైన శైలి నిజనిర్ధారణలలో ఉండేది.

ప్రతి అంశాన్ని క్షుణంగా పరిశీలించి ఉన్న చట్టాలలో ప్రజలకూ, ప్రజా ఉద్యమకారులకూ ఏ విధంగా ఉపయోగపడతాయో తెలిసిన నేర్పరి మాధవరావు గారు. ఆ న్యాయ నైపుణ్యంతో బూటకపు ఎన్కౌంటర్లో పోలీసులు, రాజ్యం కుట్రలను బయటపెట్టేవారు.

న్యాయస్థానాలు సమాజానికీ, ప్రజలకూ, వ్యవస్థలో ఉన్న లోపాలు, చట్టాలలో ఉన్న లొసుగులు, వైఫల్యాలను చెబుతూ ప్రజా ఉద్యమకారులను నిరంతరం చైతన్యపరిచేవారు. ఉన్న చట్టాలను ఏ విధంగా ఉపయోగించుకోవాలి, వాటి ద్వారా ప్రజల హక్కులను ఎలా కాపాడుకోవాలని నిరంతరం చైతన్యపరచేవారు.

కళా రంగంలో కళాకారులను తీర్చిదిద్దడానికి కలలకు అక్షరాలు తోడై వాటికి రూపాన్ని అందించి, ఆ రూపాలకు రాతలతో జీవం పోశారు. ఇందిరా బాగోతం నాటిక ప్రదర్శన చేశారు. ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితిని ప్రజలకు అర్థమయ్యేలా రూపునిచ్చారు. అదే సందర్భంలో జాతీయత లేని జాతీయ కాంగ్రెస్ అనే పుస్తకం రాశారు.

యువతకు ఒక భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌లు, ఒక వేములపల్లి కిరణ్ కుమార్ లాంటి వాళ్లు ఆదర్శం కావాలన్నారు. వాళ్ళ స్ఫూర్తితో నిజామాబాద్ జిల్లాలో గుట్కా నిషేధ ఉద్యమం జరిగింది. ఈ ఉద్యమాల్లో ఎంతోమంది డాక్టర్లు, లాయర్లు, మేధావులు, యువత, ప్రజా ఉద్యమకారులను ప్రగతిశీల యువజన సంఘం (PYL) భాగస్వామ్యం చేసినప్పుడు తను కూడా ఈ ఉద్యమానికి వెన్నుదన్నుగా ఉన్నారు. అర్సపల్లిలో ఏర్పాటు చేసిన భగత్ సింగ్ విగ్రహం రూపకల్పనలో తన పాత్ర కీలకంగా ఉంది.

ఒక విషయాన్ని అర్థం చేయించడంలో ఒక వ్యక్తిని సంపూర్ణంగా తీర్చిదిద్దడంలో తయారు చేయడంలో తనకు ఎవరు సాటి లేరు, రారు. ప్రజా ఉద్యమకారుల పట్ల మరీ ముఖ్యంగా పూర్తి కాలం కార్యకర్తల పట్ల తనకు ప్రత్యేకమైన అభిమానం ఉండేది. వారు చేస్తున్న ఉద్యమం అశేషమైన ప్రజల కోసం అని వారిని ఉన్నతంగా చూసేవారు, ప్రోత్సహించేవారు.

ప్రస్తుత రాజ్యం రాజ్యాంగం మార్చ చూస్తూ , మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న రాజ్యాంగేతర పద్ధతులను రాజ్యాంగ పీఠిక ద్వారా కాపాడుకోవాలనే వారు, దానికోసం తను రాజ్యాంగంను అవపోసన పట్టారు.

మోడీ అధికారం చేపట్టాక ఎంతోమంది మేధావులను తూటాలకు బలి చేశాడు. మహారాష్ట్రలో మూఢనమ్మకాలకు వ్యతిరేక ఉద్యమం మతోన్మాదులు చేస్తున్న నరేంద్ర దబోల్కర్‌ను చంపారు. సనాతన ధర్మం గురించి వివరించిన ప్రొఫెసర్ కల్బుర్గి ని కర్ణాటకలో చంపారు. మత చాందసవాదం పై నిత్యం అక్షర గళం విప్పుతున్న గౌరీ లంకేశ్ ను చంపారు. వారి తప్పులపై ప్రశ్నిస్తున్న అందరిపై తుపాకీ ఎక్కుపెట్టి చంపుతున్నారు. లేదంటే జైల్లో పెట్టి హింసిస్తున్నారు. జైల్లో పెట్టి, మానసికంగా చంపుతున్నారు. అయినా సరే ప్రశ్నించడం ఆపొద్దు నేడు నిన్ను రేపు నన్ను చంపడానికి ఈ రాజ్యం వెనుకాడదు. అయినా ఈ రాజ్యం అసలు రంగు విప్పి ప్రజల ముందు నిలబెట్టాల్సిన బాధ్యత మనదే అనేవారు. అందుకు రాజ్యాంగ రక్షణ తక్షణ కర్తవ్యం గా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం పీఠికను చదవాలన్నారు. దాన్ని సారాంశం అర్థమైతే ప్రతి ఒక్కరు తమ హక్కులు ఎలా హరించబడుతున్నాయో తెలుసుకోగలరని నొక్కి చెప్పారు.

స్వాతంత్ర అనంతరం నాటి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కుల చట్టాలు మన తెలుగు రాష్ట్రాల ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా పుస్తక రూపంలో రాసి తీసుకువచ్చారు. కార్మిక చట్టాలలోని ప్రతి సెక్షన్ కార్మికులకు ఏ

విధంగా ఉపయోగపడుతుందో వివరంగా ఆ పుస్తకంలో రాశారు. కానీ, నేడు మోడీ ప్రభుత్వం ఆ నలభై చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్ బిల్లుల పేరుతో చట్టం చేసి తీసుకువస్తుంది. ఈ చట్టాలు రాకుండా అడ్డుకోవాలని తిప్పికొట్టాలని అది కార్మిక ఐక్యతతోనే సాధ్యపడుతుందని అన్నారు. ఈ చట్టాలపై ఒక్క మాటలో ఇలా అన్నారు కోరలు లేని కోడ్ బిల్లులు కార్మిక వ్యతిరేకమైనవి అన్నారు.

దేశ పాలకులు దేశ ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించే విధంగా ఉండాలి, కానీ ఉన్న హక్కులను రక్షణ ను తొలగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఆవేదన చెందారు.

రైతాంగ వ్యతిరేక నాలుగు చట్టాలు కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యవసాయం చట్టాలు తీసుకొస్తుంటే, మనం రైతుల పక్షాన నిలబడాలి అన్నారు. శ్రీకాకుళ పోరాటం నుండి గోదావరి లోయ ప్రతిఘటన ఉద్యమం వరకు జంపాల ప్రసాదు, ముత్యం సార్, సుబ్బారావు పాణిగ్రాహి వంటి ఎందరో నాయకుల సాహిత్య స్నేహం ఆయనను ఎన్నో కంటి చుక్కలను రాల్చేలా చేసింది.

సుబ్బారావు పాణిగ్రహి సాహిత్యం అంటే ఏదో అఫెక్షన్ అని ముత్యం సార్ రాసిన పుస్తకంలో ముందుమాట లో రాశారు. మాధవరావు గారికి సాహిత్యం అన్నా, చదవటం అన్నా విజ్ఞానాన్ని సంపాదించుకోవడం అన్నా ఎంతో ఇష్టం. దాని నుండి పుట్టిందే జంపాల శాఖ ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు. ఎంతోమందికి జ్ఞానం అందించాలని తపన. వందల పుస్తకాలు JCS గ్రంథాలయంలో ఉండేవి, పోటీ పరీక్షల పుస్తకాల నుండి కార్ల్ మార్క్స్ ,లెనిన్, ఎంగెల్స్, స్టాలిన్ పుస్తకాల వరకు ఎన్నో సాహిత్య పుస్తకాలు అందుబాటులో ఉంచేవారు. పర్యావరణ పుస్తకాలు, హక్కుల రంగం పుస్తకాలు, చిన్నపిల్లల కథల పుస్తకాలు ఇలా ఎన్నో రకాలవి గ్రంథాలయంలో అందుబాటులో ఉండేవి. నిజామాబాద్ వాసుల కోసం ట్రస్ట్ తరఫున జేసిఎస్ ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అయిన మాధవ రావు గారు పుస్తకాలు ఉ ంచారు.

జ్ఞానం ఎవరిదో ఒకరి సొత్తు గా ఉండకూడదు, అందరూ నిత్యం పుస్తకాలు చదవాలి, విజ్ఞానం పెంచుకోవాలి, రాయడం నేర్చుకోవాలి అని నిత్యం ప్రయత్నించేవారు, చెప్పేవారు. తన ప్రయత్నమే మాలాంటి వారిని తయారు చేసింది. కానీ తనకే వ్యాసం రాయాల్సి వస్తుంది అనుకోలేదు. ఇంతటి మహోన్నత వ్యక్తిత్వం ఉన్న మాధవరావు గారు ఇంత తొందరగా సమాజానికి తీరని లోటును మిగిల్చి వెళ్లిపోయారు. మా అందరికీ, సమాజానికి, పూడ్చలేని లోటు ఇది.

ఆయన సహచరి మీనక్కా,కూతురు ఆదిత్య మాధవరావు గారి ఆశయాలను గౌరవించి మెలిగారు. తనను కాపాడుకోవటం కోసం నిరంతరం తపించారు. ఆయన మరణానంతరం తన ఆశయాల వెలుగులో పయనిస్తున్నారు.అది చాలా గొప్ప విషయం.

చివరగా –

చరిత్ర చెరిపేయని అక్షరాలు మీవి. మీ స్థానం పదిలంగా ఉంటుంది చరిత్రలో. చిరస్థాయిగా పదిల పరుచుకుంటాం.

మానవజాతి ఉజ్వలమైన భవితవ్యం కోసం నిలబడిన ఒక మహోన్నతునిగా గొర్రెపాటి మాధవ రావు గారిని స్మరించు కుందాం. తమ స్వప్నం నిజమవుతుందని తాము నమ్మిన నిజం కోసం జీవించి ,తన చావు కళ్ళ ముందు తిరుగుతున్నా, చిరునవ్వుతో ఆ చావుని ఎదిరించి అక్షరాల సంగ్రామంలో యుద్ధం చేసి విలువైన అక్షరాలను మా కోసం ప్రజల కోసం వదిలివేసి, భౌతికంగా దూరమైన మిమ్మల్ని మరవబోం, అంటే మరవబోం అన్న... ఇవే మీకు కన్నీటి నివాళి..

జోహార్లు తాతయ్య.. జోహార్లు.. జోహార్లు..

యువ.. ధ్రువ

# మరువలేని మానవ హక్కులనేత మాధవరావు

– వి.బాల్ రాజ్,

హెచ్ఆర్ఎఫ్ నాయకులు

మిత్రుడు మాధవరావుతో నాకు ఉన్న అనుబంధం ఇద్దరం సిటీ కాలేజీ స్టూడెంట్స్ కావడం. ఓకే బ్యాచ్ నేను ఒక సైన్స్ విద్యార్థిగా ఆయన ఆర్ట్స్ విద్యార్థిగా 1978లో ఇద్దరం డిగ్రీ పూర్తి చేసుకోవాలి. కానీ, నేను ఒక ఏడాది చదువు ఆపడంతో ఆయన 1978 లోనే డిగ్రీ పూర్తి చేసుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్.ఎల్.బి విద్యార్థిగా జాయిన్ అయ్యారు. అక్కడ విద్యార్థి సంఘం పి.డి.ఎస్.యూలో జాయిన్ అయ్యారు. ఓ పదిమంది విద్యార్థులతో కలిసి సిటీ కాలేజీకి వచ్చారు. వచ్చి రాగానే కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించబడుతున్న మీటింగులో బి.సి, విద్యార్థులు పే చేసినటువంటి టర్మ్ ఫీజులు వాపస్ ఇవ్వాలంటూ కొన్ని ఎమోషనల్ స్లోగన్స్, తోటి విద్యార్థులంతా ఆయనకు తోడు పిడికిళ్లతో అద్భుతమైన స్లొగన్స్ ఇవ్వడం ఆవేశం వచ్చేసింది. ఆ గుంపులో మాధవరావు ఆ స్టేజ్ మీద మాట్లాడటం అందర్నీ ఉత్తేజపరచడం నాకు బాగా నచ్చేది. నాకు పిడిఎస్‌యు విద్యార్థి సంఘం అనేది ఒకటి ఉంటుంది అని తెలవదు. ఈ సంఘం ఇలాంటి విద్యార్థి సంబంధిత పనులు చేస్తుందని విషయం నాకు తెలవదు. నాకు ఏ విద్యార్థి సంఘాలతో పరిచయాలు లేవు.కానీ తరచూ ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ వెళ్ళేవాడిని. అక్కడ జరిగే సభలు సమావేశాలు అటెండ్ కావడం ఒక అలవాటుగా ఉండింది. నా మిత్రుడు నరసింహారావు నేను ఒక పొలిటికల్ పార్టీతో పరిచయం ఉండాలంటూ గుమ్మడి నరసయ్య ఎంఎల్ఏ క్వార్టర్‌కి తరచూ వెళ్ళేవాళ్ళం. అక్కడ రామకృష్ణ (మాధవరావు తమ్ముడు) ఎస్వీ, సంధ్య లను కలిసేది. మాధవ్‌ను అక్కడ కలిసేది.

1988 లో ఏపీసిఎల్సి నాకు పరిచయం అయింది. హైదరాబాదులో చాలా మీటింగ్స్ కు హాజరయ్యేవారు. మాధవ్ గుర్తుందా మనమిద్దరం సిటీ కాలేజీలో చదువుకున్నాం, అంటే ముసిముసిగా నవ్వుతుండేవారు. నిర్బంధం బాగా ఉన్న రోజుల్లో

అప్పటి రాష్ట్ర అధ్యక్షుడు కన్నాభిరన్ గారి ఇంట్లో ఈసీ జరుగుతుండగా జరిగిన పోలీసుల దాడిని ఎదుర్కోవడంలో చురుకైన పాత్ర పోషించడం నాకు బాగా గుర్తుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కడ మహాసభలు జరిగినా తప్పకుండా హాజరయ్యేవారు. కారణాలు ఏమైనప్పటికీ కొంతకాలం నిశ్శబ్దంగా ఉన్నారు. హెచ్ఆర్ఎఫ్ ఆవిర్భావం నుండి నిజామాబాద్ జిల్లాకు సంబంధించిన పనులు చేసేవారు. ఒక వకీలు గా, 1995లో జరిగిన బూటకపు ఎన్కౌంటర్లో నిజ నిర్ధారణ చేసి అది తప్పు అని నిరూపించి పోలీసులకు శిక్ష పడేలా చేశారు.

2009లో బాలగోపాల్ కొంతకాలానికి బుర్ర రాములు పోయాక ముఖ్యంగా క్రిమినల్ కేసులలో న్యాయ సంబంధిత నిష్ణాతుల కొరతను మాధవరావు తీర్చగలిగాడు. 2009 నుండి 2015వరకు ఉభయ రాష్ట్రాల బాధ్యతలు తీసుకుని నడిపిన జీవన్ కుమార్, వి ఎస్ కృష్ణ లకు న్యాయపరంగా ఎన్నో సలహాలు సూచనలు చేశారు. రెండు రాష్ట్రాలుగా విడిపోయాక తెలంగాణ రాష్ట్రానికి మాధవరావు అధ్యక్షత వహించారు. అదిలాబాద్ జిల్లాలో ఆదివాసుల సమస్యలకు భుజంగ రావు గారు అడిగే ప్రతి ప్రశ్నకు మాధవరావు నుండి సమాధానం దొరికేది.

ఆరోగ్యం అసలే సహకరించడం లేదు. అయినప్పటికీ 300 నుండి 350 కేసులు పెండింగ్లో ఉన్నాయి. సార్ జూనియర్లు కూడా హెచ్ఆర్ఎఫ్ కార్యకర్తలు కావడం మంచి పరిణామమే.

చివరగా, అతను అనంతపూర్ పట్టణంలో కలిసి బాలు భయ్యా, ఈనాటి మహాసభలలో పి.డి.ఎస్.యు విద్యార్థులుగా మనమిద్దరమే ఉన్నాము కదా అంటూ ఆలింగనం చేసుకోవడం మరువలేనిది. విజయవంతంగా జరుపుకున్న అనంతపూర్ మహాసభలలో మాధవ్ లంచ్ ప్లేట్లో ఉన్న జిలేబి తినడం చూసి నేను ఒక చిన్న లెటర్ మీద నిర్భయంగా రెండు జిలేబిలను తిన్నాడంటూ కంప్లైంట్ లెటర్ ను మీనా సహాని గారికి ఇచ్చాను. నేను రియాక్షన్ ఎలా ఉంటుందో అని ఎదురుచూసిన కొద్దిసేపటికి ఇద్దరు నవ్వుకుంటూ వచ్చి ఆయన రెండు జిలేబీలు తినరు. బాలు భయ్యా నేను ఒకటే తిన్న. నువ్వు కంప్లైంట్ ఇచ్చిన తను నమ్మదు. నిజానికి, ఇద్దరికిని హాట్సాఫ్. నా గాలి పోయి తుస్సుమంది. మాధవరావు లాంటి ఒక మంచి నేర్పు, ఓర్పు, సమర్ధవంతమైన హక్కుల కార్యకర్తను మిస్ అయ్యాం. నిజానికి తను పోలేదు. మంచి మృదుస్వభావిని, రాజకీయ పరిపక్వత కలిగిన న్యాయవాదిని, సూపర్ సీనియర్ మానవ హక్కుల వేదిక కార్యకర్తల (మాధవి, జయశ్రీ, రాములు, బాలగొపాల్, నరేంద్ర నాథ్) ను హెచ్.ఆర్.ఎఫ్ కోల్పోయింది.

భారతదేశంలో ఎమర్జెన్సీ కాలంలో కఠినమైన ఆంక్షలతో, అప్రజాస్వామిక పోకడలతో, నిర్బంధాలతో జైలు శిక్షను అనుభవించిన వ్యక్తులు ఉన్నారు. వారిలో చాలామంది పెద్దపెద్ద రాజకీయ నాయకులుగా ఎదిగారు. భారత రాజ్యాంగ నిర్మాతలు కూడా ఊహించని విధంగా మతం రాజకీయాలలో కలిసి దేవుడి పేరు మీద రాజ్యాధికారంలోకి వచ్చారు. 1980లో వచ్చిన అభ్యుదయ ఉద్యమాలు తగ్గుతూ వచ్చాయి. ఈ సమయంలో పాతతరం వారు ఒక్కొక్కరు వెళ్ళిపోతున్నారు. నిజానికి ఇప్పుడే మాట్లాడే వారు. రాసేవారు ఎక్కువగా అవసరం ఉన్న ఈ సమయంలో మాధవరావు వెళ్లిపోవడం అభ్యుదయ సమాజానికి తీరని లోటు.

జోహార్ మాధవరావు.

# నాన్నా! ఇంకెప్పుడు పలుకుతారు?

- ఆదిత్యా మధుమిత్ గొర్రెపాటి

(మాధవరావు కూతురు)

అమ్మడూ, నాతో పాటు అనూ
"మందార మకరంద మధురయామున దేలు
మధుపము వోవునే మదనములకు... ఆ తర్వాత
అందుకో..." అని ఒళ్ళో పడుకొని
మళ్ళీ పద్యాలు పాడతారా నాన్నా?

1. "బంటా!పద, అమ్మకు తెలియకుండా కాఫీ పెట్టుకుందాము. చూస్తే ఇద్దరికీ తిట్లు పడతాయి"

ఇప్పుడు నేనొక్కదాన్నే తిట్లు తినాలా నాన్నా?

2. "ఏంటమ్మాయి అసలు ఆపకుండా ఎప్పుడూ మాట్లాడుతూనే ఉంటారా? కాసేపు గమ్మున కూచోండి" అని ఇంకోసారి విసుక్కోరా నాన్నా?

3."సిరి, ఇందిరా సంగతి. ఇలా చేస్తే బావుంటదేమో. ఏమంటావు ?"

"ఇప్పుడు బాబాయి ఒక్కరే ప్రతిదీ చూసుకోవాలా నాన్నా?"

"అరిస్టాటిల్‌కి అలెగ్జాండర్ ఎలాగో, నాకు బాబాయి అట్లాంటివాడు , అని ఇంకా కలవరించారా నాన్నా?

4. "అమ్మడూ బ్రాహ్మణీ !వచ్చేయవే!చాలా రోజులయ్యింది నిన్ను చూసి"

ఇప్పుడు అక్కని ఎవరు కదిలిస్తారు నాన్నా?

5. "అరేయ్ డుంబూ! వాళ్లిద్దరూ మనల్ని ఏదో అంటుంటారు రా. పట్టించుకోకు" అని 'టాఫీ'ని మళ్ళీ ఓదార్చరా నాన్నా?

When I was a little girl, people used to ask me who my father was. The aww expression I received every time I gave your name was always surprising. Gradually, when I grew up I knew what you really were.

Gorrepati Madhava Rao had multiple angles and dimensions. People know you as a saviour, they know you as a human rights activist, as an advocate, as a leader, a teacher, an advisor to both the legal fraternity and anyone in need, a great companion, a ray of hope and confidence. But for me, you're my father – my constant support system and my pillar of strength.

There is also an angle no one knows about Nanna. An enthusiastic kid who is always eager to find answers to diverse things. A kid who questions, who tries different approaches to solve an issue.He couldn't bear an inch if there was something he didn't knew. The curiosity with which he woke up every single day, to accomplish things. There isn't any subject that he did not have knowledge about. Which is why he is called a Walking Encyclopedia.

"Meenajee, Nuvvuntechaalu. EdayinaSadhistanu!" – Sadhincharukooda. Mamma is that fuel, an engine like Madhava needs. Mamma calls him 'Comrade!'. And he never made injustice to that word. They are not merely wife and husband. It was much more than that. The bond they shared, the love and friendship that evolved through the span of 37 years, is an inspiration to hundreds out there. They understood each other like nobody else. He could live at a far distance from me also, but with mamma, he never had the strength or even the ability to survive without her. Mamma has been that strength and backbone, supporting and encouraging Nanna for every step throughout his life. I don't know if I would be able to witness such a couple in my lifetime anymore.

For the first time, I recommended Nanna to read Sadat Hasan Manto's, Thanda Ghost. The person who hardly took any book recommendations, had very next day placed an order for the book.

The moment he finished reading, he immediately sat down to re-write Manto in Telugu as there were no works of Manto in telugu. He wanted the Telugu audience to read and feel those sensational stories and believed that it was a necessity.

Though he knew his health was deteriorating and was advised to take rest, he had the spirit to meet people, participate in various conferences, share his insights through lectures and seminars and be active as much as possible. He did not lose hope. He always quoted "Sontakutumbalakosam, pratiokkarukrushipadataru. Kaniteliyaniparayakutumbalakosamevarayinaalochistara?" Adi mukhyamammayi…He could not see people in pain. It pinched him inside. He made that pain his own, and worked relentlessly to resolve it. That is when I knew that he was more of a People's Man, than a Family Man.

While working on the State Repressive Laws project, thearguments we had on the Amendment to Article 19 and the application of UAPA, one thing I can confidently put is, no law professor I have met till time was able to contemplate these issues in a manner as Nanna did. The dedication with which he prepared himself to deliver a single lecture on any issue or a matter in Court, without calculating the hours he slept, day and night till he had absorbed every corner of the subject, blew my mind. Majority of his preparation was on weekends or during the night and the only time I used to get to fully spend with Nanna was while having dinner. It pissed me off when Nanna gave time to any other person or thing other than me, especially while having dinner. He's my father too.I wanted to spend time with him as much as possible. I understand that he's a busy man, a person who people would look up to for resolving any issue, but he's my father. The fear that always ate me from inside, was 'what if I don't get to spend time with him after a while.  I wanted to make the maximum out of what I get to have' – and that was the least I could do and that too in a limited time.

I was voting for the first time. Generally, parents ask their children to vote for a specific party for various reasons. But Nanna

had a very different approach. While explaining the voting process, he said "Nuvvuenchukunna party symbol ni press chesi, 2 seconds aagiappudu move avvu". Though we had similar political interests, he still told me to vote for a party of my choice rather stressing on one single party.He believed in me. He believed in every choice I made, without questioning. The sense of confidence I had every time I discussed things with him, and that go ahead nod I received – will I not be able to experience it again?

It was this time I wrote my article for a digital newspaper. That was a sarcastic column. As usual, I made him read the draft for any discrepancies. The joy I saw on his face and the confidence he held – I could do anything to relive that moment, to feel and consume it atleast one more time. He couldn't stop himself even till the time the article was published. Immediately, he forwarded it to all of his friends to read. The pride I saw on his face and the sense of satisfaction he held – there can be no other greater bliss than that.

That push, that encouragement, that belief and that trust he had in me, I call myself the luckiest and most fortunate daughter for having a father like him.

I can writepages for days together about you. About us. And I'll be out of words and it would still be incomplete. But tell me. What is the purpose of my writing when you aren't there to read it? Who would clap from behind even if I fall? Who would debate with me that Leo Tolstoy is superior, when I contend Dostoevsky had finer way of expressing depth? Will there be no go to person for me anymore? You asked me to come that one last time. You wanted to see me. Why couldn't you wait a little longer Nanna? What was the hurry that you disappeared in a click? Will these questions be left unanswered?

Nanna, will you respond one more time? Will you feed me that first bite of your meal once again?

# నా గత స్మృతులు

**– కొండపల్లి విజయకుమార్,**

న్యాయవాది, సత్తుపల్లి

28.12.2024 మధ్యాహ్నం ఒంటి గంట సుమారుగా నా న్యాయవాద మిత్రుడు ఫోన్ చేసి నేను ఒక మెసేజ్ పంపాను చూసారా అని అడిగాడు. లేదు అన్నాను. మీ నిజామాబాద్ మిత్రుడు గొర్రెపాటి మాధవ రావు అదే మనం కొత్తగుడెంలో కలిసి మాట్లాడాము కదా ఆయన చనిపోయారని తెల్సింది. మీకు తెలవలేదా అన్నాడు. లేదు అన్నాను. తర్వాత మెసేజ్ చూసాను. ఇది నాకు ఒక పెద్ద షాక్, ఎందుకంటే గత నాలుగు నెలల కాలంలో మా క్లాస్ మేట్స్ గిరి, స్వామీ, మిత్రుడు ముత్యం, చల్లా శంకర్ ఇలా...... స్వామి చని పోయాక వారం రోజులకు నేను మాధవరావుతో మాట్లాడితే, అవును నాకు తెల్సింది, కృష్ణారావు చెప్పాడు. ఏంటోరా అందరూ వెళ్తున్నారు. మనం నల్గురమే మిగిలాం అన్నాడు. నల్గురం అంటే నేను, మాధవరావు, కృష్ణారావు (నందిగం), రమేష్, తర్వాతా కొద్దిరోజులకే ఈ వార్త వినాల్సి వచ్చింది.

1978 లో నేను, పొట్ల వేణు, వున్నం వెంకటేశ్వరరావు, ముగ్గురం ఖమ్మం డిగ్రీ కాలేజీలో చేరాము. అక్కడే మాధవరావు మాకు పరిచయమయ్యాడు. మేము నల్గురం కల్సి తిరిగే వాళ్ళం. తర్వాత లా కాలేజీ స్టూడెంట్స్ ఎన్నికల్లో పిడిఎస్‌యు బ్యానర్ మీద మాధవరావు జాయింట్ సెక్రెటరీగా, రామకృష్ణారెడ్డి సెక్రెటరీగా పోటీ చేసారు. ఓడిపోయాము. కాని కాలేజీలో పిడిఎస్‌యుకు మంచి గుర్తింపు లభించింది. మాకు చాలా మంది డే స్కాలర్లు, హాస్టల్ మిత్రులు తోడయ్యారు.

మాధవరావు అప్పట్లో 'విమోచన' ప్రింటింగ్ పనులు చూసేవాడు. నేను 'విజృంభణ' ప్రింటింగ్ పనులు చూసేవాడిని. అనేక సందర్భాలలో రాత్రులు ప్రెస్సులోనే పడుకొనేవాళ్ళం. మా రాజకీయ ఆలోచనా విధానం ఒకటే కావడంతో మేమిద్దరం మరియు వేణు బాగా క్లోజ్ గా వుండేవాళ్ళం. మాధవరావుతో చర్చలవల్ల మాకు చాలా విషయాలలో అవగాహన ఏర్పడ్డది. మాకందరికీ పెద్ద అండ. కాలేజీలో మరియు బైట, రాజమల్లారెడ్డి, రాజమల్లన్నకు మాధవరావు కమిట్మెంట్ పని విధానాలవల్ల అతని మీద గొప్ప అభిమానం ఏర్పడింది. 1978 నుండి 1982 వరకు మాధవరావుతో

కల్సి సాగింది మా ప్రయాణం. అప్పుడు విద్యార్థి రాజకీయాలు పిడిఎస్‌యు లో కల్సి పనిచేశాం.

లా తర్వాత నేను, వేణు ఖమ్మంలో లా ప్రాక్టీసు పెట్టాము. మాధవరావు నిజామాబాద్ లో ప్రాక్టీసు చేసేవాడు. కానీ తరచుగా మాధవరావు అనేక సార్లు ఖమ్మం వచ్చి మాతో కల్సి ఉండేవాడు.

1983 లో సత్తుపల్లిలో బత్తులవెంకటేశ్వర రావు మెమోరియల్ గ్రంధాలయం ప్రారంభించ బడింది. నేను కూడా ట్రస్ట్ బోర్డు సభ్యుడనే. ఆ తర్వాత మాధవరావు సత్తుపల్లి గ్రంధాలయానికి వచ్చాడు. సెమినార్ కూడా జరిగింది.

నేను, వేణు, మాధవరావు ఎపిసిఎల్‌సిలో సభ్యులుగా వుండటం వలన తరచుగా మీటింగులలో, కార్యక్రమాలలో కలుసుకునే వాళ్ళం. 2012 లో వేణు చనిపోయిన తర్వాత నేను, మాధవరావు చాలా బాధపడ్డాము. ఆ తర్వాత నేను నా లా ప్రాక్టీసు మీద కేంద్రీకరించాను. కానీ, మాధవరావు లా ప్రాక్టీసు తో పాటు చివరి వరకూ రాజకీయాలు, పోరాటాలు కొనసాగించాడు. సెల్ ఫోన్ లు వచ్చాక తరచుగా మాట్లాడుకొనే వాళ్ళం.

రాజమల్లారెడ్డి మరణం అనేక మంది సాధారణ కక్షిదారులకూ, బంధు మిత్రులకూ తీవ్ర నష్టం కలిగించింది. కానీ, మాధవరావు మరణం బాధితులకూ, రాజకీయ సహచరులకూ తీవ్ర నష్టం కలిగిస్తుందని భావిస్తున్నాను. మాధవరావు నుంచి నేను రాజకీయాలనూ, సిద్ధాంతాలను చాల నేర్చుకున్నాననే చెప్పాలి. మాధవరావు నిరంత పఠనాశక్తి, గ్రహణ శక్తి చాల అద్భుతం. ఆయన నుంచి మనందరం నేర్చుకోవలిసిన చాలా విషయాలు వున్నాయి. నా మిత్రుని అకాల మరణానికి చింతిస్తూ తాను నేర్చిన, నేర్పిన సిద్ధాంతాలకు చివరి వరకూ కట్టుబడి పనిచేసిన మాధవరావుకు విప్లవ జోహార్లు.

– నీ మిత్రుడు

# నా జ్ఞాపకాలలో పెదనాన్న

**– పరుచూరి సిరి**

కొంతమందికి అయన మామ,కొంతమందికి తాత, ఇంకొంతమందికి ఆయనొక సీనియర్ అడ్వకేట్, మరి కొంతమందికి కడ దాకా మానవ హక్కుల కోసం పోరాడిన ఒక నేత, చాలామందికి ఆయనొక మహా రచయిత; అలా ఆయనకి చాలా పేర్లు. చాలా మంది పరిస్థితుల వల్లో, వృత్తి వల్లో, కుటుంబాల వల్లో ఆయన్ని ఇంట్లో మనిషిలాగా చాలా పేర్లతో పిలిచేవాళ్ళు. కానీ నాకు మాత్రం చిన్నప్పటి నుంచి "సిరులూ …. !!!"అంటూ నన్ను పెంచిన మా పెదనాన్న.

మా పెదనాన్న మాధవ రావు, పెదమ్మ మీనాల ఇంటికి రోజూ మా నాన్న శ్రీధర్ తో వెళ్లేదాన్ని. మీనా పెద్దమ్మ రాత్రి భోజనం తయారు చేస్తోంటే, వాళ్ళ యింట్లో కిచెన్ గట్టు మీద కూర్చొని పెద్దమ్మ పెట్టింది తింటూ, వాళ్ళిద్దరికీ కబుర్లు చెప్పిన రోజులు నాకు ఇంకా చాలా బాగా గుర్తున్నాయి. తరువాత నా చెల్లి ఆదిత్య మధుమీత్ (స్మైలీ) పుట్టింది. ఒకే అమ్మా నాన్నలకి పుట్టకపోయినా మేము ఇద్దరం సొంత అక్కా, చెల్లెళ్ల లాగానే పెరిగాము. నా స్నేహితులు గానీ, నా సన్నిహితులు గానీ చాలా మంది మేము ఇద్దరం సొంత అక్కా చెల్లెళ్ళం అనే అనుకునేవాళ్ళు. అలాంటిది మా కుటుంబాల అనుబంధం. చిన్నప్పుడు నువ్వు ఒక్కదానివేనా అని స్కూల్ లో నన్ను ఎవరన్నా అడిగితే నేను పేరుకి ఒక్కదాన్నే అయినా నాకు ఒక అన్న, ఒక చెల్లి ఉన్నారని అందరికీ చెప్పేదాన్ని. నేను ఎప్పుడూ మా నాన్నతో ఆఫీస్ కి వెళ్ళినపుడు అక్కడ ఎవరన్నా క్లైంట్స్ ఉండి మా పెదనాన్నని తను ఎవరు అని అడిగితే నా పెద్ద కూతురు అని అందరికీ చెప్పేవారు.

మా పెదనాన్న సమాజానికి మార్పు అవసరం అని అది ఇంట్లో నుంచే మొదలు అవ్వాలి అని నమ్మే వారు. ఇంట్లో మార్పు వస్తే ఆటోమ్యాటిక్ గా సమాజంలో మార్పు వస్తుంది అనేది ఆయన పాలసీ. అలానే మా ఇద్దరినీ పెంచారు. నువ్వు లైఫ్ లో ఏం చేస్తున్నా సమాజానికి ఎలా హెల్ప్ అవుతుంది అనేది ముఖ్యం అని ఆయన నాకు చెప్పిన విషయాలు నా ఆలోచనల్ని ఎంతగానో మార్చాయి . చాలా కమ్యూనిస్ట్ కుటుంబాలలో వాళ్ళ ప్రభావం ఇంట్లోని వ్యక్తుల పై ఉండదు కానీ మేము అలా

పెరగలేదు. మేము ఎంత దూరంగా ఉన్నప్పటికీ మా నేపథ్యం కానీ మేము ఎక్కడ నుంచి వచ్చాము అనేది కానీ ఎప్పటికీ మర్చిపోము. మేము అలా పెరగడంలో పెదనాన్న పాత్ర ఎంతో ఉంది.

ఈరోజు మా స్మైలీ "లా" పూర్తి చేయడంలో గానీ, నేను ఇప్పుడు ఉన్న స్థాయికి చేరుకోవడంలో గానీ మా పెదనాన్న పాత్ర ఎంతో ఉంది.. మా పెదనాన్న ఇచ్చిన స్ఫూర్తితో నేను ఒక కాన్ఫిడెంట్ మనిషిలాగా ఎదిగాను. ఇప్పుడు పది మందిలో స్టాండౌట్ అవ్వగలను. నేను ఉండేది యూ ఎస్ ఏ లో అయినా నా ఆలోచనలు కమ్యూనిస్టు దృక్పథంలోనే ఉంటాయిబీ దానికి చిన్నప్పటి నుంచి మా నాన్న, పెదనాన్న మరియు మా వీవీ తాతని చూస్తూ పెరగడం ఎంతగానో సహాయ పడింది ..చిన్నప్పటి నుంచి వింటూ పెరిగాను; "ఇద్దరికీ ఆడపిల్లలే, ఎలా అన్నా !!?" అని కొంతమంది అడుగుతుండగా. కానీ ఈరోజు వాళ్ళు ఇచ్చిన ఇన్స్పిరేషన్ తో చాలా మంది అబ్బాయిల కంటే మేము ఎక్కువ కాన్ఫిడెంట్ గా ఏ పనినైనా చురుకుగా చేసేస్తాం ఆడపిల్లలుగా ఎదగటం లయబిలిటీ; కాదు కాన్ఫిడెన్స్ అని చాలా మందికి తెలిసేలా పెంచారు మమ్మల్ని. మా నాన్న, పెదనాన్న ప్రభావం నా మీద ఎంత ఉంది అంటే బయట ఎవరన్నా ఆడపిల్లనే కదా అని బెదిరిస్తే ఏ మాత్రం తగ్గకుండా నిలదొక్కుకుని వాదించే దాన్ని. ఇలాంటి సంఘటనలు నా లైఫ్ లో ఎన్నో... ఎన్నెన్నో.

నేను యూఎస్ఏ వెళ్లే జర్నీలో కూడా ప్రతి స్టెప్‌లో మా పెదనాన్న ఉన్నారు. నా కాలేజెస్‌కి రాసే SOP లెటర్ నుంచి నా అప్లికేషన్స్ దాకా అన్నీ ఆయనే చేసారు. ఆఖరికి నా పెళ్ళి పత్రిక రాసింది కూడా ఆయనే. మా పెళ్ళి కూడా ఆయనే దగ్గరుండి చేసారు.

మా పెదనాన్న మా ఇంట్లో మా నాన్నకి సొంత అన్న కన్నా ఎక్కువ. బహుశా సొంత అన్న లేడు అని మా నాన్న ఎప్పుడూ రియలైజ్ కూడా అయి ఉండరు . మా అమ్మకి కానీ, మా నాన్నకి కానీ ఆయనొక పెద్ద దిక్కు ..ఆయనకి ఇష్టం అయింది ఏది వండినా బాక్స్ పంపడం మా అమ్మకి అలవాటు. ఈ మధ్య పెదనాన్న హాస్పిటలైజ్ అయినప్పుడు అమ్మ వండి పంపింది తిన్న తరువాత పెదనాన్న అమ్మకి ఫోన్ చేసి "మా అమ్మ గుర్తొచ్చింది రా నీ చేతి వంట తిన్నాక" అని అన్నారు అప్పుడు అమ్మ ఫోన్ చేసి నాకు చెప్పింది నాకు ఎంత పెద్ద కొడుకు ఉన్నాడు అని మురిసిపోతూ చెప్పుకుంది. అయిన ఒపీనియన్ లేకుండా, సలహా లేకుండా, ముఖ్యంగా ఆయన లేకుండా మా ఇంట్లో ఇప్పటి వరకు ఏది కూడా జరగలేదు ..ఆయనకి లాస్ట్ సెప్టెంబర్ లో హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు మా నాన్న భుజం మీద వేసుకొని మెట్లు

దింపారు ..ఆయన శ్రీధర్ నన్ను ఎత్తుకునే సరికి నాకు రోగం మొత్తం పోయిందని ఊరంతా చెప్పారు. ఎవరి ఇంట్లో ఏం అయినా మొదటి ఫోన్ ఇంకొకరి ఇంటికి వెళు తుంది. అలానే మొన్న కూడా పెద్దమ్మ మా నాన్నకి ఫోన్ చేసి "సిరీ, అన్న ఏదో టెన్షన్ పెడుతున్నారు తొందరగా ఇంటికి రా అని చెప్పింది" నేను టెన్షన్ పడుతుంటే మా అమ్మ అప్పుడు కూడా చెప్పింది ఏం కాదు చాలా సార్లు పెదనాన్న ఇలానే టెన్షన్ పెడతారు, రేపు పొద్దున ఏం కాదు అని నాకు ధైర్యం చెప్పింది కానీ ఇలా జరుగుతుంది అని మేము ఎవ్వరం అసలు అనుకోలేదు.

మా నిజామాబాద్ పార్టీ మేము అందరం ఒక కుటుంబం.కొంతమందిలా అంకుల్, ఆంటీ లాగా పిలుచుకునే అనుబంధం కాదు మాది. తాత, మామ, అన్న, అక్కలుగా ఇంట్లో వాళ్ళ లాగా పిలుచుకునే అనుబంధం ..నేను నిజామాబాద్ నుంచి వెళ్ళిపోయి ఈరోజుకి 13 ఏళ్ళు అయినా నేను ఎప్పుడూ బయట దాన్ని అవ్వలేదు. ప్రతి కుటుంబంలో గొడవలు వస్తాయి. అలా మా కుటుంబంలో కూడా వచ్చాయి. చాలా చర్చలు, చాలా లేఖలు, ఒకరిని ఒకరు చాలా అనుకున్నారు. లేఖలు, వాటికి ప్రతిజవాబులు చాలా మామూలు అయిపోయాయి. ఇలాంటి పరిస్థితిలో ఆయనని చాలా మంది చాలా బాధ కలిగించే మాటలు అన్నా, వాక్యాలు రాసినా ఆయన వాటికి జవాబులు చాలా సున్నితంగా ఇచ్చే వారు. అలాంటి సున్నిత హృదయం మా పెదనాన్నది. ఇక పై మాకు ఇలా రాసేవారు ఎవరు ? రోజూ కోర్టులో ఎంత పని ఉ న్నా అది పూర్తి చేసుకొని పార్టీ కోసం కానీ, మానవ హక్కుల కోసం కానీ రాత్రంతా కూర్చొని రాసేవారు. వదిలేయండి అని మేము ఎంత చెప్పినా నేను ఇంకా చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి, నాకు ఏమీ కాదు, ఊరికే టెన్షన్ పడకండి అని చెప్పి మాకు ధైర్యం ఇచ్చే పెదనాన్న గురించి నేను ఇలా రాస్తాను అని నేను ఎప్పుడూ అనుకున్నదే లేదు.

నేను నా భర్త "సుహాస్" తో ఎప్పుడూ చెప్పేదాన్ని; మన పెళ్ళి చేసింది పెదనాన్ననే, మన పిల్లలకి పేరు పెట్టేది కూడా పెదనాన్నే అని కానీ అది జరగకుండా మమ్మల్ని ఇలా వదిలేసి వెళ్ళిపోయారు ఏంటి పెదనాన్న.

ఆయన బతికి ఉన్నప్పుడు చాలా మందికి చాలా నేర్పారు కానీ చనిపోయాక కూడా సమాజానికి ఎలా నేర్పించాలో మా అందరికీ నేర్పి వెళ్లారు. చనిపోయాక బాడీని హాస్పటల్‌కి డొనేట్ చేయడం వల్ల అక్కడ డాక్టర్స్ ఇంకా బాగా నేర్చుకొని ఇంకా మంచి డాక్టర్లు అవుతారు అన్న ఆలోచన పెదనాన్నదే ..చాలా మందికి దీని విలువ అర్థం కాకపోయినా దాన్ని ఎక్స్ప్లెయిన్ చేసి సుమారు 15 బాడీస్ ని హాస్పటల్‌కి

డొనేట్ చేపించారు. అలా మా ఆలోచనని ఇంకా మెరుగ్గా మార్చిన పెదనాన్నని మేమే తీసుకొని వెళ్లి శరీర దానం చేస్తాం అని అనుకున్నదే లేదు ..ఏంతో మందికి ఎన్నో అయ్యి వాళ్లందరినీ మధ్యలో వదిలేసి వెళ్లిపోయారు.

పెదనాన్న ఇచ్చిన స్ఫూర్తితో, ఆయన చెప్పిన మాటలతో, నేర్పించిన కమ్యూనిజంతో ఆయన చూపించిన బాటలో మేమంతా ఎప్పటికీ నడుస్తాము. ఆయన మాటలు ఎప్పటికీ మర్చిపోలేము.

You are a person in my life that no one can ever replace pedananna. I will miss you !!!

# హక్కుల యోధుడు కామ్రేడ్ గొర్రెపాటి మాధవరావు అమర్ రహే

-పి. మహేష్
PDSU *తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు*

మనుషులను మనుషుల నుండి మరింత వేరు చేస్తున్న కాలం. ప్రజల మధ్య సోదర భావాన్ని దెబ్బతీసి చిచ్చు పెడుతున్న కాలం. ప్రేమ ఆప్యాయలతో విలసిల్లాల్సిన చోట ఈర్ష్య, ద్వేషాన్ని నింపుతున్న కాలం. హక్కులు హననమై ప్రశ్నించే వారిని భౌతికంగా హతమార్చడం, లేకుంటే జైళ్లకు పంపుతున్న ఫాసిస్ట్ కాలం... సరిగ్గా ఇదే కాలంలో మనుషులను దగ్గర చేసే మహామనిషి, స్నేహ భావాన్ని నూరిపోసే గొప్ప మనిషి, మానవ హక్కుల మహా మనిషి, హక్కుల గొంతుకై నినదించే రణ నినాది, ఫాసిస్టు కాలానికి ఎదురు తిరిగి సవాలు చేసే ఉద్యమ సారథి కామ్రేడ్ మాధవన్న మరణం ఈ సమాజానికి తీరని లోటు. ఉద్యమ కార్యకర్తలకూ, హక్కుల సంఘాలకూ ఇది పెను విషాదం.

PDSU నిర్మాత కామ్రేడ్ జేసిఎస్ ప్రసాద్ అమరత్వ స్ఫూర్తితో ఉద్యమ బాటను ఎంచుకొని తన తుది శ్వాస వరకు వీడని నాయకుడు. తొలినాళ్లలో PDSU పత్రికను ఇంగ్లీష్, తెలుగు లో ప్రచురించడంలో క్రియాశీలక పాత్ర పోషించాడు. హైదరాబాద్ మహానగరంలో PDSU విద్యార్థి ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ లో జరిగిన విద్యార్థి సంఘ ఎన్నికల్లో PDSU ప్యానల్‌ను గెలిపించడంలో ఆయన కృషి అమోఘం. ఆయన సందేశం ఇచ్చినా, సారాంశం చెప్పినా ఎంతో సరళంగా ఉండేది. అందరికీ అర్థమయ్యేదిగా ఉండేది. PDSU రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతుల్లో అనేకసార్లు ప్రగతిశీల విద్యార్థులకు పాఠాలు బోధించారు. JCS ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా గ్రంథాలయాన్ని స్థాపించి విప్లవ సాహిత్యాన్ని సమాజానికి అందించారు. ఎన్నో విలువైన పుస్తకాలను ట్రాన్స్ లేట్ చేశారు. మార్క్సిస్టు మేధావిగా తన ప్రసంగాలు, రచనలు నూతన ఆలోచనలను రేకెత్తించే విధంగా ఉండేవి. ఉద్యమ కేసులను వాదించి ప్రజా న్యాయవాదిగా పేరు గడించారు. మానవ హక్కుల నేతగా, విప్లవ మేధావిగా ప్రజల మన్ననలు పొందారు.

వీరు పి.డి.ఎస్.యూ పిల్లలు... వేసవి కాలాన్ని విందులు, వినోదాలతో గడపరు... ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను అధ్యయనం చేసి పోరాటాలకు సిద్ధం కావాలంటారంటూ.. 2013లో ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన PDSU రాష్ట్ర 19వ మహాసభకి మాధవన్న ప్రగతిశీల విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే విధంగా ఆహ్వాన సంఘ కరపత్రం రాశారు. ఇది విద్యార్థి ఉద్యమానికి ఎంతగానో తోడ్పడింది. 2022 డిసెంబర్‌లో PDSU రాష్ట్ర మహాసభలో నిజామాబాద్ జిల్లా కేంద్రంగా జరిగాయి. ఈ మహా సభలు విజయవంతం చేయడంలో క్రియాశీలక పాత్ర పోషించాడు. అంతేకాదు తొలి పలుకులను అందించి విద్యార్థులను ఆలోచింపజేసే ప్రసంగాన్ని చేశారు. ఈ మహాసభల నుండి కామ్రేడ్ మాధవరావన్నతో ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడింది. 2024 ఆగస్టు 16, 17 సిద్ధిపేటలో జరిగిన PDSU రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతుల్లో మతోన్మాదం–ఫాసిజం క్లాసును చెప్పాలని కోరగా అంగీకరించాడు. చివరిలో తన అనారోగ్యం కారణంగా రాలేనని చెప్పాడు. సరేనని మేము ఇంకొక టీచర్‌ని ఏర్పాటు చేసుకున్నాము. సాధారణంగా ఏ టీచర్ అయినా క్లాస్ కి రానని చెప్తే ఆ తర్వాత దాని గురించి పట్టించుకోరు. కానీ మాధవరావన్న క్లాసులు అయిపోయాక ఎంతమంది వచ్చారు క్లాసు ఎలా జరిగాయి అని కనుక్కున్నాడు. అంతేకాదు మైక్ ప్రాబ్లం అయిందంట కదా.. నన్ను అడిగితే వైర్లెస్ మైక్ పంపించేవాడిని అంటూ చెప్పాడు. తనకున్న కమిట్మెంట్ నాకు బాగా నచ్చింది. చివరగా అక్టోబర్ 24న ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన PDSU అర్థ శతాబ్దోత్సవ సభలో కలుసుకున్నాము. అదే చివరి కలయిక అవుతుందని అనుకోలేదు.

కామ్రేడ్ మాధవరావు అన్న పీడిత ప్రజల గొంతుక, హక్కులనేత, ప్రజా న్యాయవాది. దేశానికి ఫాసిస్టు ప్రమాదం పొంచి ఉన్న కాలంలో మాధవరావన్న లాంటి గొప్ప మనిషిని కోల్పోవడం సమాజానికీ, విప్లవోద్యమానికీ తీరని లోటు. అమర్ రహే మాధవ రావన్న.

# మానవత్వపు నిండుకుండ మాధవరావు

- బైస రామదాసు
*సంపాదకుడు, పొద్దు దినపత్రిక*

గొర్రెపాటి మాధవరావు గారు భౌతికంగా దూరం కావడం పౌర సమాజానికి, పత్రికా లోకానికి, అట్టడుగున ఉన్న బడుగులు, బలహీనవర్గాలకు తీరనిలోటు. నిజామాబాద్ కేంద్రంగా సమాజానికి ఆయన చేసిన సేవలు, ముఖ్యంగా పౌరహక్కుల కోసం నాయకత్వం వహించి ఆయన జరిపిన పోరాటాలు చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోతాయి.

న్యాయవాద వృత్తి చేపట్టినప్పటి నుండి నాకు మాధవరావు గారు పరిచయం. నా సంపాదకత్వంలో కుటుంబ సభ్యులు మిత్రులు సమాజ శ్రేయస్సు కోరే వారందరి మద్దతుతో పొద్దు పత్రిక ప్రజల పక్షాన నిలబడడంలో ఆయన ఇచ్చిన నైతిక మద్దతు, న్యాయసలహాలు మాకు స్ఫూర్తినివ్వడమే కాక అరాచక శక్తులను, అవినీతిపరులను ఎదిరించడానికి మాకు కొండంత బలాన్నిచ్చాయి. మాకే కాదు వృత్తిపరంగా సమాజంలో ఇబ్బందులను ఎదుర్కొన్న పాత్రికేయులందరికీ ఆయన అండగా నిలిచారు.

నిన్న మొన్నటి తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రత్యక్షంగా పరోక్షంగా ఆయన మద్దతు మరువలేనిది. నేను కన్వీనర్ గా జిల్లా కుల ప్రజాసంఘాల నాయకులు ప్రజలందరితో ఆవిర్భవించి పోరాడిన తెలంగాణ కుల ప్రజాసంఘాల జేఏసీకి ఆయన ఇచ్చిన సహకారాన్ని ఎప్పటికీ మర్చిపోలేము. ఆయన గాయకుడు కాకపోయినా ఉత్సాహంతో వేదికపై పాడిన అందెశ్రీ గారి జై తెలంగాణ పాట ఇప్పటికి మా చెవుల్లో గింగురు మంటూనే ఉంది.

చావు మాధవరావు గారిని భయపెట్టలేకపోయింది నాలుగేళ్ల క్రితం నేను బైపాస్ సర్జరీ చేయించుకున్నప్పుడు ఈ విషయంలో "నేను మీకు సీనియర్ ని సార్" ఏం భయపడొద్దు డాక్టర్లు చెప్పిన జాగ్రత్తలు పాటిస్తే మన పని ఎప్పటిలాగే చేసుకుంటూ పోవాలి అన్న అనునయ వాక్యాలు నాకు ఇప్పటికీ ధైర్యాన్ని యిస్తాయి. వయసులో

నాకంటే రెండేళ్ల చిన్నవాడైన, ఉన్నత ఆశయాలలో నాలాంటి వారందరికీ అందనంత ఎత్తులో ఉన్న ఎలాంటి బేషజాలకు పోకుండా, గర్వం లేకుండా ఆశయాల బాటలో మాతో కలిసి, మెలిసి, నడుస్తూ అందరం సమానమని అన్న భావన కల్పించేవారు మాధవరావు గారు మన మధ్య లేకపోయినా ఆయన ఆశయాలు, జ్ఞాపకాలు మనల్ని ముందుకు నడిపిస్తూనే ఉంటాయి మాధవరావు గారు .చెర్మన్‌గా సమసమాజ నిర్మాణం కోసం పోరాడి ఎమర్జెన్సీ౨ి కాటుకు గురైన నవ యువ నాయకుడు జేసిఎస్ ప్రసాద్ పేర ఏర్పడిన ట్రస్టులో నాకు చోటు కల్పించినందుకు గర్వపడుతూనే నా వంతు కృషి చేయలేకపోయినందుకు సిగ్గుపడుతున్నాను.దారులు వేరైనా మన అందరి లక్ష్యం ఒకటే మాధవరావు గారి పోరాట స్ఫూర్తితో సమసమాజ లక్ష్యసాధనకు అందరం కృషి చేద్దాం.

# కామ్రేడ్ మాధవన్నకి విప్లవ జోహార్లు!

**– మల్లిక్ పలుకూరు,**

*సిపిఐ(ఎం-ఎల్)న్యూడెమోక్రసీ కార్యకర్త*

**కా**మ్రేడ్ గొర్రెపాటి మాధవరావు గురించి నేను పిడిఎస్‌యు కార్యకర్తగా వున్నపుడు మొదటిసారి 1994లో విన్నాను. అప్పటికే జంపాల చంద్రశేఖరప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ సభ్యుడిగా మాధవన్న వ్రాసిన "ఆచరణలో గతితర్కం" పుస్తకం నా చేతికి వచ్చింది. ఆ తరువాత నేను2001లో హైదరాబాద్‌కి వచ్చిన తరువాత ప్రతి సందర్భంలోనూ కామ్రేడ్ మాధవన్న క్రమ తప్పకుండా మార్క్స్ భవన్‌కి వచ్చేవారు. ఎప్పుడొచ్చినా అందరినీ పలకరించకుండా మాత్రం వెళ్లేవారు కాదు.

ఒకసారి యిలాగే మార్క్స్ భవన్‌కి వచ్చినపుడు "అన్నా, ఆరోగ్యం బాగోలేదని తెలిసింది, యిపుడెలా వుంది?". "ఫర్వాలేదు మల్లిక్. బైపాస్ సర్జరీ చేసారు. వయస్సు తక్కువే కాబట్టి నాకు బైపాస్ చేసారు. అదే యాదగిరి అన్నకి మాత్రం కుదరలేదు". ఈ మాట చెప్పినపుడు నాకు అనారోగ్యం కాబట్టే బైపాస్ సర్జరీ చేశారన్నది కాకుండా, చిన్న దెబ్బకి కట్టు కట్టారన్నంత సులభంగా చెప్పారు.

మరొక సందర్భంలో జర్మనీ నుండి కామ్రేడ్ క్లాస్ వాలెన్‌స్టీన్ భారత పర్యటనకి వచ్చినపుడు తనతో పాటు నేను కూడా నిజామాబాద్‌కి వెళ్ళినపుడు జిల్లా ముఖ్య కార్యకర్తలతో ఒక సమావేశం ఏర్పాటు చేసారు. కామ్రేడ్ క్లాస్ వాలెన్‌స్టీన్ ప్రసంగాన్ని చాలా సులభగ్రాహ్యంగా చెప్పారు.

నేను నిజామాబాద్ జిల్లా పార్టీ నిర్మాణంలో వున్నపుడు క్రమం తప్పకుండా కామ్రేడ్ మాధవన్నతో కలిసేవాడిని. అనేక విషయాలు మాట్లాడినా, నేను తెలుసుకోవాలన్న కొన్ని విషయాలు నేను అడిగేవాడిని కాదు, తానూ చెప్పేవారు కాదు. అలాంటి సున్నితమైన విభజన రేఖని పాటించేవారు.

ఉపాధ్యాయ ఉద్యమ ప్రముఖులు, ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం(ఏపిసిఎల్‌సి) నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు, పార్టీ నిర్మాణంలో మా సభ్యుడైన అమరుడు కామ్రేడ్

మొవ్వా నాగేశ్వరరావు గారితో పరిచయమయ్యాక, కామ్రేడ్ మాధవన్నతో మరింత చనువు పెరిగింది. ఏదైనా సలహా, సంప్రదింపులు అవసరమైతే నేరుగా అడిగేవాడిని. ఎప్పుడు కూడా అదే చిరునవ్వుతో,"సరే మల్లిక్" అనేవారు. అమరుడు డాక్టర్ ముత్యం అన్న ఎప్పుడైనా పుస్తకాలు యిచ్చినా, మాధవన్న నుండి తీసుకుని రమ్మని కోరినా మాధవన్న దగ్గరికి వెళ్లివచ్చేవాడిని.

2008లో ఆదిలాబాద్–నిజామాబాద్– కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గం నుండి శాసన మండలి సభ్యులుగా పోటీ చేసినప్పుడు, నామినేషన్ దాఖలు చేయడానికి కామ్రేడ్ మాధవన్నతో కరీంనగర్ జిల్లా కలక్టరేట్‌కి వెళ్ళినప్పుడు, అమరుడు అరెట్టి నారాయణ, నాయక్వాడి నర్సయ్య వంటి పెద్దలున్నారు. వారి నుండి అనేక విషయాలపై అలవోకగా సమాధానాలు వచ్చేవి. జిల్లా ఉద్యమం కొత్త కనుక అవన్నీ నాకు ఆశ్చర్యంగా వుండేవి. పట్టభద్రుల జాబితా పట్టుకుని ప్రచారానికెళ్ళినపుడు, నందిపేట మండలం శాపూర్ అనే గ్రామంలో ఒక పట్టభద్రురాలిని మొదటి ప్రాధాన్యతా ఓటు కామ్రేడ్ మాధవన్నకే వేయాలని అభ్యర్థించగా, భూమ్‌రావు అనేటాయన "నేను మాధవరావు గురించి విన్నాను. ఆయన విప్లవకారుడు కదా, ఎన్నికలలో పోటీ చేస్తున్నాడా?" అంటూ ఆశ్చర్యంగా అడగడం నాకిప్పటికీ గుర్తే.

ఈ సందర్భంగానే మరో విషయం చెప్పాలి: ఎమెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా చౌడమ్మ కొండూరు ప్రభుత్వ హై స్కూల్ దగ్గర ఒక ప్రచార గోడపత్రిక (వాల్ పోస్టర్) అంటించాము. రెండు రోజుల తరువాత పట్టభద్రులైన ఉపాధ్యయులను కలిసి మొదటి ప్రాధాన్యతా ఓటు కామ్రేడ్ గొర్రెపాటి మాధవరావు గారికే వేయాలని అడగడానికి అనేకులం కలిసి వెళ్ళాము. అప్పటికే ఒక విద్యార్థి మాధవన్న పోస్టర్‌కి తనవైన తుదిమెరుగులు దిద్దాడు. అది చూసి మొదట ఆశ్చర్యపోయినా,"వీడెవడో గానీ గొప్ప కళాకారుడు. నాకు లేని జుట్టుని ఒత్తుగా మొలిపించి మరీ అభిమానం ప్రకటించాడు. గ్రేట్ అండ్ గుడ్!" అనడం ద్వారా తనపై తానే ఛలోక్తి విసురుకున్నారు.

నందిపేట మండలం చిమ్రాజ్ పల్లి, లక్కంపల్లి, బజార్ కొత్తూరు ప్రాంతాలను కలిపే ప్రాంతంలో...గోదావరి నది నీటిని ఎత్తిపోతల పథకం ద్వారా చౌడమ్మ కొండూరు నుండి మాక్లూర్ మండలంలోని గుత్ప ప్రాంతానికి తరలించే అర్గుల్ రాజారామ్ ఎత్తిపోతల పథకం పూర్తయిన తరువాత, విద్యుత్తు సౌకర్యం కూడా అందుబాటులోకి వచ్చిన తరువాత, అప్పటివరకూ బీడు బారిన పొలాలు మూడు పంటలు పండే సస్యశ్యామలంగా మారిన తరువాత...నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఒక ప్రత్యేక ఆర్థిక మండలం(సెజ్) ఏర్పాటు చేయదలచింది. దీనిని పరిశీలించిన అనంతరం, "రైతుల

నోట్లో మట్టిగొట్టడానికే యిలాంటి ప్రచారార్భాటాలతో కొత్తకొత్త నినాదాలు ప్రభుత్వాలు ముందుకు తెస్తున్నాయి”అని వివరించారు. చివరాఖరికి ఎకరానికి రూ.14 లక్షల నష్టపరిహారం చెల్లిస్తామన్న హామీ నుండి వైదొలిగిన ప్రభుత్వం అప్పటికే సాగులో వున్న భూమికి రూ.లక్షా ముప్పై వేలు, పడావు భూమికి కేవలం రూ.65 వేలు చెల్లించి చేతులు దులుపుకున్నది. సరిహద్దులు,కొలతలలో కూడా తేడాలున్నాయని బాధిత పేద రైతాంగం తరువాత చెప్పింది.

నేను నిజామాబాద్ జిల్లా పార్టీ నిర్మాణంలో వున్నపుడు నాకు అవసరమైన మద్దతునిచ్చిన వారిలో కామ్రేడ్స్ మొవ్వా నాగేశ్వరరావు, ఆకుల పాపయ్యలతో పాటు మాధవన్న కూడా ఒకరు.

2012 జనవరిలో జరిగిన నిజామాబాద్ జిల్లా పార్టీ మహాసభలో కేంద్ర కమిటీ ప్రవేశపెట్టిన డాక్యుమెంట్‌ని సమర్థిస్తూ కామ్రేడ్ మాధవన్న చేసిన ప్రసంగం యిప్పటికీ తాజాగా వున్నది. 2014లో అరుణోదయ వ్యవస్థాపకులైన అమరుడు కామ్రేడ్ కానూరి వెంకటేశ్వరరావు (కానూరి తాత గారు) మరణించిన తరువాత, “యు టూ బ్రూటస్” అంటూ విసిరిన చురకత్తి వంటి పదునైన వ్యంగ్యాస్త్రం చదివిన వారెవరూ మాధవన్నని మర్చిపోజాలరు. ఈ సంవత్సరం జూన్ నెలలో గోదావరిలోయ ప్రతిఘటనా పోరాట యోధురాలు కామ్రేడ్ రాధక్క చనిపోయినపుడు “నిర్మల రాధక్కగా మారిన తీరు” ఎంతగానో ఆకట్టుకున్నది.

2013 సెప్టెంబర్ చివరి వారంలో నేను హైదరాబాద్‌కి మారిన తరువాత... ఒకసారి ఆరోగ్యం బాగోలేక హైదరాబాద్‌లోని తన సోదరుడి యింటికి వచ్చినపుడూ, వారి నాన్న గారి సంతాప సభ సందర్భంగానూ, పరిశోధక హాలికుడు కామ్రేడ్ ముత్యం అన్న సంతాప సభలోనూ, యిటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన పిడిఎస్ యు అర్ధ శతాబ్దోత్సవ సభల సందర్భంగా కూడా...ఎప్పుడు కలిసినా అదే చిరునవ్వుతో కూడిన పలకరింపు, ఆత్మీయతో కూడిన కరచాలనం...ఎవ్వరూ కూడా ఎప్పటికీ మరచిపోలేనివి.

ఆగస్టు 20న కామ్రేడ్ ముత్యం అన్న చనిపోయినపుడు “ఎందుకురా అంత తొందరగా వెళ్ళిపోయావు?” అని తన స్నేహాన్ని, కామ్రేడ్లీ తత్వాన్ని చాటి చెప్పి, డిసెంబర్ మొదటి తేదీన చల్లా శంకర్ అన్న చనిపోయినపుడు “ఒక్కొక్కరుగా వెళ్లిపోతున్నారు” అని తీవ్ర బాధతప్తతను వెలిబుచ్చిన కామ్రేడ్ మాధవన్న, కొద్ది రోజుల వ్యవధిలోనే వారినే అనుసరించి శాశ్వతంగా మన అందరి నుండీ “ఇక శెలవ్” అంటూ వెళ్లిపోవడం హక్కుల ఉద్యమానికి, విప్లవోద్యమానికి తీరని లోటు, పూడ్చలేనిది.

ఒక వ్యక్తి మరణానంతరం కూడా జీవితం వుంటుందని, వారి పార్థీవ దేహాలను (శవాలను) ఖననం చేయడం కంటే వైద్య విద్యార్థులకు పరిశోధనలకు ఉపయోగపడాలని అనేకులను వివిధ వైద్య కళాశాలలకు, బోధనాసుపత్రులకు యిప్పించడమే కాకుండా, తాను సైతం నిజామాబాద్ వైద్య కళాశాల విద్యార్థులకు ఒక పాఠమై నిలిచాడు. ఎందరికో స్ఫూరిగా, మార్గదర్శిగా నిలిచిన ఉన్నత మానవుడు కామ్రేడ్ మాధవన్న.

కొందరు అనేక విషయాలలో ప్రవేశం కలిగి వుంటారు లేదా నైపుణ్యం కలిగి వుంటారు. కానీ అన్ని అంశాలపైనా సాధికారతతో మాట్లాడడం, చర్చలు జరపడం, ఎదుటి పక్షాన్ని తన వాదనతో ఏకీభవించేలా చేయగలిగిన ప్రతిభావంతులు కొందరు మాత్రమే వుంటారు. అలాంటి ప్రతిభావంతుడు కామ్రేడ్ మాధవన్న. న్యాయవాది, హక్కుల కార్యకర్త,యోధుడు, అనువాదకుడు, రచయిత, వ్యాఖ్యాత, విమర్శకుడు, ప్రకృతి ప్రేమికుడు, అన్నింటికీ మించి కామ్రేడ్ మావో చెప్పినట్లు "మంచి కామ్రేడ్" అయిన కామ్రేడ్ మాధవన్నకు విప్లవ జోహార్లు.

*01-01-2025*

# మానవ హక్కులనేత గొర్రెపాటి మాధవరావు గారికి జోహార్లు

**– బిజిగిరి శ్రీనివాస్**

*ఎడిటర్ నినాదం దినపత్రిక*

1997లో అనుకుంటా.. మానవ హక్కుల వేదిక కరీంనగర్ జిల్లా అధ్యక్షులు న్యాయవాది సుధాకర్ రెడ్డి గారి ఇంట్లో బాలగోపాల్ సార్ రౌండ్ టేబుల్ సమావేశం పెట్టారు. అప్పుడు నేను బిడిఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నాను. హక్కుల కోణంలో దళిత సమస్యపై చర్చ జరిగింది. ఆ సమావేశంలో బీడీఎస్ ఫ్ (బహుజన డెమొక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్) కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా పాల్గొన్నాను.ఆ సమావేశంలో గొర్రెపాటి మాధవరావు సార్ పాల్గొన్నారు. అలా ఆ పరిచయం కడవరకు కొనసాగింది. ఎన్నో రాత్రులు గంటల కొలది రాజకీయ చర్చలు మా మధ్య జరిగేవి. మారోజు వీరన్న ప్రస్తావన లేకుండా ఏనాడు మా చర్చ ముగించలేదు. ఉద్యమాల నుండి జర్నలిస్టుగా మారాక, మరికొంత కాలానికి సొంత పత్రిక నినాదంను ప్రారంభించాను. నినాదం దినపత్రికలో అనేక వ్యాసాలు మాధవరావు గారివి ప్రచురించబడ్డాయి. ఏ న్యాయ సలహా కావాలన్నా మాధవరావు గారికి ఫోన్ చేసే వాడిని. హక్కుల ఉద్యమంలో గొర్రె పాటి మాధవరావు లేని లోటు పూడ్చలేనిది.. మాధవరావ్ సార్ కు జోహార్లు.

# గుండెకొలిమి అంటించిన మాధవుడి మరణం

– గోపరాజు నాగేశ్వరరావు
నరసరావు పేట.

మరణం ఒక యాదృచ్ఛిక సంఘటన అదేముందిలే అనుకునేవాడ్ని చిన్నప్పుడు. అమ్మ నాన్న అక్కలు అన్న కాలగతిలో కనుమరుగైతే బాధనిపించింది కొంతకాలం, మరీ అంత పూడ్చలేని వెలితి కాదనిపించింది, నిబ్బరపడ్డాను.

కాలం అన్ని గాయాలు మాన్పుతుంది అంటారు గాని అందులో సత్యమెంత? అది సత్యమే ఐతే ఇంకా గొర్రెపాటి మాధవరావు గారు గుర్తొస్తేచాలు, ఎందుకు నా కండ్లు తవ్విన చలమలౌతాయి? బాగా ఆలోచించిన మీదట అసలు విషయం అర్థమైంది, కొందరి మృతి గుండెలో కొలిమి అంటిస్తుంది. జ్ఞాపకాల ముళ్లతో పొడిచి పొడిచి బాధిస్తుంది. వాటిల్లో మాధవుడి మరణం కూడా ఒకటి. మాధవరావు మృతి కారణంగా అంటుకున్న గుండెకొలిమి చల్లారాలంటే ఆయన ఆశయాల కొనసాగింపు మాత్రమే పరిష్కారం.

ఐనా నేనెందుకు నిజామాబాద్ రావాలి, నా కెందుకు మాధవరావు గారు పరిచయం కావాలి, ఆ పరిచయం ఎందుకంత గాఢమైత్రిగా మారాలి, ఆయన అర్ధాంతరంగా నన్ను విడిచిపెట్టి వెళ్లి పోవాలి, వెళ్లే ముందు పనిమాలా నన్ను చూసేందుకు భార్యతోసహా మా ఇంటికి రావాలి, ఇదే కడగంటి చూపని చెప్పకనే చెప్పారా మాధవరావు గారూ? అర్థం చేసికోలేని దురదృష్టం నాది. మీరు చెప్పినట్లు మీ అడుగుల్లో అడుగేసి ముందుకు కదలాలంటే వయస్సు అనుమతించదు. బాటసారులకు దారిచూపించి మీ కోరిక నెరవేరుస్తాను. అందులో సాంత్వనం పొందుతాను. అంతకు మించి ఏం చెయ్యగలను మిత్రమా, రహస్యంగా కన్నీళ్లు తుడుచుకోవడం తప్ప.

బురద కాలువ శుభ్రం చెయ్యాలంటే బురదలో దిగాలని నేను, అంటుకున్న బురద వదలకపోతే ఒక జీవితం వృథా ఔతుందని మీరూ.. భలే పోట్లాడుకునేవాళ్లం కదూ, –ఇక నే నెవ్వరితో పోట్లాడాలి, ఎలా స్వాంతన పొందాలి, మీరే చెప్పండి. అక్షరాలు కన్నీళ్లు పెట్టిస్తాయని విన్నాను గానీ మిమ్మల్ని గురించి వ్రాస్తుంటే అక్షరాలకు కన్నీళ్లొస్తున్నాయి, ఇక ఏమీ వ్రాయలేను. వస్తాను, త్వరలో అక్కడ పోట్లాడుకుందాంలే.

# అమరుడా మాధవన్న మాకోసం మళ్ళీ ఒకసారి రావ...

– జె.సాయికృష్ణ
PDSU

సూర్యుడు ఆరోజు ఉదయించక పోయిన బాగుండేది మా మాధవన్న మాతోనే ఉండేవాడు.. ఈ లోకమంతా నిద్రలేచింది మా మాధవుడు తప్ప.

అన్నా మీ ఆజ్ఞ కొరకు శ్రీధరన్న సిద్ధంగా ఉన్నారు.. మీ సలహాల కోసం పాపన్న వేచియున్నారు.. మీ రాకకోసం మేమంతా ఎదురు చూస్తున్నాము.. మా మాటలాలకించి ఒక్కసారి తిరిగి మీ శరీరాన్ని ధరించండి... మాతో మాట్లాడండి మైకు పట్టి ఈ సమాజంలో జరిగే అన్యాయాల్ని ఎప్పటి లాగే ప్రశ్నించండి లేవండి అన్నా..

అన్న లేడన్న వార్తను సామాజిక మాధ్యమంలో చూడగానే కళ్ళకు తెలియకుండానే నా ముందున్న పుస్తకం మీద కన్నీళ్లు అన్నతో నా తొలి పరిచయం దగ్గరనుంచి అన్న చెప్పిన క్లాసులు, అన్న హాజరై ఉపన్యసించిన సమావేశాలు, అన్న యొక్క మాటలు అన్నీ అన్నీ గుర్తుకు వస్తున్నాయి..

నా కుటుంబం ఈ రోజు పెద్దదిక్కును కోల్పోయింది. కానీ, ఆ పెద్ద ఇచ్చిన విలువైన సూచనలు,సలహాలు మేమున్నంత వరకు మాతోనే ఉంటాయి, మమ్మల్ని ఆయన బాటలో నడిపిస్తాయి, సమాజానికి ఉపయోగపడేలా చేస్తాయి. సమ సమాజ స్థాపనకోసం, మానవహక్కుల సాధనకోసం, అన్యాయల్ని ఎదుర్కొంటున్న వారికి న్యాయం అందించడం కోసం అన్న చేసిన కృషి వర్ణనాతీతం.. శత్రువుతో కూడా కంటనీరు పెట్టించే గొప్ప జీవితం మా మాధవన్నది..

మృత్యువు అనుకోవచ్చు. హమ్మయ్య ఇప్పటికైనా ప్రశ్నించేటోన్ని, న్యాయం కోసం నిలబడేటోన్ని, మాట్లాడితే మానవ హక్కులనేటోన్ని, ప్రజాసంఘాల్ని నడిపించేటోన్ని ఇన్నాళ్ళకి ఆపగలిగానని.. పాపం ఆ మృత్యువుకు తెలియదు మేం మరణించినా సమాజానికే ఉపయోగ పడేటోల్లమని.. అందరిలా మేం మట్టిలో

కలిపోయేటోల్లం కాదని మా కళ్ళను లయన్స్ క్లబ్ వారికిచ్చి కళ్లులేని వారికి కంటిచూపై ఈ సమాజాన్ని ఎప్పటికప్పుడు కనిపెడుతూనే ఉంటామని... మా అవయవాలను సైతం ఆపదలో ఉన్నవారికి దానం చేస్తామని.. మా శరీరాన్ని మరో పది మందికి ఉపయోగపడేలా వైద్య విద్యార్థులకు అప్పగిస్తామని.. ఇది మా గొప్పతనం కాదు ప్రగతిశీలురమైన మా కర్తవ్యం..

మీ చివరి చూపు దక్కలేదన్న బాధ నాలో ఎప్పుడూ ఉండి పోతుంది.

మాధవన్నకు జోహార్లు..

# గొప్ప మానవతావాది మాధవన్న

**– జి.గంగాధర్ సిర్పా,**

*ఇండిపెండెంట్ జర్నలిస్ట్*

1980వ సంవత్సరంలో మాధవరావు గారితో పరిచయం ఏర్పడింది. నిజామాబాద్ జిల్లాలో జరిగిన అనేక ఎన్కౌంటర్ కేసుల్లో ఆయనతో పాటు వెళ్ళాను. ఆ సమయంలో నేను ఆంధ్ర జ్యోతి స్టాఫ్ రిపోర్టర్‌గా పని చేస్తున్నాను. పడకల్, కలవరాల, తదితర ఎదురు కాల్పుల సంఘటనలపై పౌర హక్కుల బృందంతో పాటు నిజ నిర్ధారణకు వెళ్ళాను. ఎదురు కాల్పుల ఘటనను మాధవరావు గారు నిశితంగా పరిశీలించేవారు. తన సహచర మిత్రులతో కలిసి వివరంగా చర్చించిన అనంతరం నివేదిక తయారు చేసేవారు. ఆ రిపోర్టును పత్రికలకు విడుదల చేసేవారు. మాధవన్న తనతో పాటు వచ్చిన పాత్రికేయులు, ఇతర మిత్రుల పట్ల చాలా శ్రద్ధ చూపేవారు. ఆయనకు తందూరి రోటీ, అండ గుర్జు వంటకాలు బాగా నచ్చేవి. డాబా హోటల్లో వాటిని అన్న ప్రత్యేకంగా తయారు చేయించేవారు. నిజామాబాద్ జిల్లాలో జరిగిన అనేక ప్రజా ఉద్యమాలకు వెన్నుదన్నుగా ఉన్నారు. అలాంటి గొప్ప మానవతావాది మరణించాడని తెలిసిన తర్వాత ఎంతో బాధ కలిగింది. ఆయన ఆనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా ఆదుకునేవారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు ఎంతో నష్టం. మాధవన్నతో మళ్లీ ఒకసారి మాట్లాడాలని ఉంది. అయితే అది సాధ్యం కాదని తెలుసు. అయినా మనసు ఎందుకో ఆరాటపడుతోంది. ఈ ప్రపంచంలో పుట్టిన ప్రతి మనిషి మరణించక తప్పదు. మనిషిని మర్చిపోవచ్చు కానీ అయన చేసిన మంచి పనులు ఎప్పటికీ మరచిపోలేము. నేను వృత్తి రీత్యా ప్రొఫెసర్ కాకపోయినా, ఆయన నన్ను ప్రొఫెసర్ అనే పిలిచేవారు. మానవ హక్కుల యోధుడు మాధవరావు అన్నకు కన్నీటితో వీడ్కోలు.

# కామ్రేడ్ మాధవన్నతో నా స్మృతులు

– వి. భాస్కర్
*PDSU ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు*
న్యాయవాది

అది 1982 సంవత్సరం. ప్రజావుద్యమాలపై, ముఖ్యంగా ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాలపై పోలీసుల తీవ్ర నిర్బంధం అమలవుతున్న రోజులు. ఊరేగింపులు తీయడం, కరపత్రాలు పంచడం, వాల్ పోస్టర్లు అతికించడం, గోడ వ్రాతలు రాయడం కూడా పోలీసుల దృష్టిలో నేరమే. ప్రముఖ న్యాయవాదులు, ప్రజాస్వామికవాదులు పి.వి. రాజ గణేశ్, అఖ్తర్ మొయిఉద్దీన్ అన్సారీ, ఏ.ఎస్. పొశెట్టి, ప్రజాస్వామికవాది సి.హెచ్.మధులతో నిజామాబాద్ జిల్లాలో పౌర హక్కుల సంఘం పని చేస్తున్నది. విద్యార్థి నాయకులను, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి రోజుల తరబడి లాకప్‌లలో పెట్టి తీవ్ర చిత్ర హింసలు పెడుతున్న పరిస్థితి. అరెస్టయిన వారిని తొందరగా విడుదల చేయించడానికి కోర్టుల్లో నూ, క్షేత్ర స్థాయిలోనూ ఎక్కువ సమయం కేటాయించి పనిచేసి న్యాయ పరమైన పరిష్కారం కోసం చర్యలు తీసుకొనే లాయర్ల కొరత వున్న పరిస్థితి.

సరిగ్గా అదే సమయంలో కామ్రేడ్ మాధవన్న హైదరాబాద్ నుండి నిజామాబాద్‌కు వచ్చాడు. లాయర్‌గా ప్రాక్టీసు ప్రారంభించాడు. అప్పుడు నేను PDSU నిజామాబాద్ తాలూకా ప్రధాన కార్యదర్శిగా వున్నాను. హైదరాబాద్‌లో పిడిఎస్‌యూలో నాయకుడయినందున నిజామాబాద్ వచ్చిన కొత్తలోనే నాకు అన్న తో పరిచయం జరిగింది. 1982 అక్టోబర్‌లో నిజామాబాద్ తిలక్ గార్డెన్‌లోని టౌన్ హాల్‌లో జరుగుతున్నా పిడిఎస్‌యూ జిల్లా మహాసభను భగ్నం చేయడానికి పోలీసులు పెద్ద ఎత్తున తిలక్ గార్డెన్ చేరుకొని అష్ట దిగ్బంధం చేసి మహాసభ కు జిల్లా నలుమూలల నుండి వచ్చిన విద్యార్థి ప్రతినిధులపై దాడిచేసి, లాఠీచార్జ్ చేసి ముఖ్య నాయకులను అరెస్టు చేసి ఒకటవ టౌన్ పోలీసు స్టేషన్‌లో లాకప్‌లో నిర్బంధించి తీవ్ర చిత్రహింసలు

పెట్టారు. శరీరాలన్నీ రక్తమోడిన గాయాలతో వున్న నాయకులను కోర్టులో హాజరు హాజరు పరిస్తే తమపై క్రిమినల్ కేసులు నమోదవుతాయనే భయంతో, కోర్టు నుండి తెస్తారనే భయం తో పోలీసులు చిత్రహింసలకు గుర్రైన నాయకులను ఒకటవ టౌన్ పోలీసు స్టేషన్ నుండి తీసుకెళ్లి బోధన్ రోడ్‌లోని అప్పటి పోలీసు ఔట్ పోస్ట్‌లో దాచి వుంచారు. ఆ విషయం సంస్థ సానుభూతిపరుల ద్వారా తెలుసుకున్న అరెస్టు కాని పిడిఎస్‌యూ నాయకత్వం కామ్రేడ్ మాధవన్న ద్వారా కోర్ట్‌లో పిటిషన్ వేసి సర్చ్ వారెంట్ తీసుకొని చిత్రహింసలకు గుర్రైన నాయకులను విడుదల చేయించుకోవడం జరిగింది. ఈ సంఘటన జిల్లాలో ఒక సంచలనంగా మారింది. ప్రగతిశీల విద్యార్థి ఉద్యమానికి, జిల్లా విప్లవోద్యమానికి ఎంతో ఉత్తేజాన్నిచ్చింది, కార్యకర్తలకు మనోధైర్యాన్నిచ్చింది. జిల్లాలో ప్రజావుద్యమాలను అణచివేసేందుకు టాడా, పోటా చట్టాలను ప్రయోగించి అప్పటి పీపుల్స్ వార్ పార్టీకి చెందిన అనేక మంది నాయకులపై, సానుభూతి పరులపై పోలీసులు తప్పుడు కేసులు పెట్టినప్పుడు వాళ్ళని బాయిల్ పై విడుదల చేయించడంలో, అవి తప్పుడు కేసులని రుజువు చేయడంలో అగ్రభాగాన నిలబడ్డాడు. పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకొని జిల్లాలో జరిగిన అనేక ఎన్కౌంటర్లపై నిజ నిర్ధారణ కమిటీలుగా వెళ్ళి విచారణ జరిపి అవి ఎన్కౌంటర్ మరణాలు కావని, పోలీసులు చేసిన హత్యలని నివేదికలు రూపొందించి వార్తా పత్రికల్లో ప్రకటనలిచ్చి, ఎన్కౌంటర్లలో పాల్గొన్న పోలీసు అధికారులపై హత్యా నేరం కేసులు నమోదు చేయాలని, బూటకపు ఎన్కౌంటర్‌లలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పోలీసు స్టేషన్లలో లాకప్ మరణాలపై వుద్యమించారు. విప్లవ రాజకీయాలకు సంబంధం లేని ప్రజాస్వామికవాదులయిన అనేకమంది లాయర్లను పౌరహక్కుల సంఘంలో చేరే విధంగా చైతన్యపరిచి, వారిని నిజనిర్ధారణ కమిటీలలో క్రియాశీలంగా పాల్గొనేలా సమీకరిచాడు మాధవన్న.

1985-86 విద్యా సంవత్సరం లో నేను గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి సంఘానికి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనప్పుడు కళాశాల వార్షికోత్సవంలో ఉపన్యసించడానికి ప్రొ.హరగోపాల్ గారిని ముఖ్య అతిథిగా పిలిచిన సందర్భంగా మాధవన్న హరగోపాల్ గారికి తన ఇంట్లో ఆతిథ్యమిచ్చి మాకు అండగా వున్నాడు. మళ్ళీ 1986-87 విద్యా సంవత్సరంలో నేను అధ్యక్షునిగా ఎన్నికైనప్పుడు కళాశాల వార్షికోత్సవంలో ఉపన్యసించడానికి పిడిఎస్‌యూ ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కామ్రేడ్ పి. ప్రసాదన్నను ముఖ్య అతిథిగా, కామ్రేడ్ మాధవన్నను అతిథిగా పిలిచినప్పుడు

తమ ఉపన్యాసాలతో విద్యార్థి లోకంలో ఉత్తేజాన్ని నింపారు. ఆ విధంగా మాధవన్నతో నాకు అనుబంధం పెరుగుతూ వచ్చింది. పిడిఎస్‌యూ ప్రతి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించే రాజకీయ, వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో మాధవన్న రాజ్యం, రాజ్యాంగ యంత్రము, అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రం తదితర అంశాలపై పాఠాలు చెప్పి విద్యార్థులను చైతన్య పరిచేవారు.

నేను పిడిఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడిగా వున్నప్పుడు పిడిఎస్‌యూ రాష్ట్ర 11 వ మహాసభలను 1992 డిసెంబర్‌లో నిజామాబాద్‌లో జరుపాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించినప్పుడు మాధవన్న మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా బాధ్యత తీసుకొని జిల్లా పిడిఎస్‌యూ నాయకులకు పెద్ద దిక్కుగా వుండి సభల ఏర్పాట్లను ఎలాంటి లోటు లేకుండా చేసి సభలు ఉత్తేజపూరితంగా విజయవంతం కావడంలో ప్రధాన పాత్ర నిర్వహించి పిడిఎస్‌యూ రాష్ట్ర నాయకత్వం, రాష్ట్ర ప్రతినిధుల నుండి ప్రసంశలందుకున్నారు.

నేను లాయర్‌గా ప్రాక్టీస్ చేయడానికి 1995లో మాధవన్న ఆఫీసులో జూనియర్‌గా చేరిన తర్వాత మాధవన్న నుండి లాయర్ వృత్తికి సంబంధించి అనేక మెళుకువలు నేర్చుకున్నాను. మాధవన్న నాయకత్వంలో నేను పౌర హక్కుల సంఘంలో నిజామాబాద్ జిల్లా సహాయ కార్యదర్శిగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వుండి కల్వరాల, కొండపూర్, మానాల, తిమ్మాపూర్ తదితర ఎన్నో ఎన్కౌంటర్ హత్యలపై నిర్ధారణ కమిటీలలో పాల్గొనడం ద్వారా పౌర హక్కుల పట్ల మరింత అవగాహన పెంచుకున్నాను.

జిల్లాలో రెండు ఎన్కౌంటర్ హత్యల్లో నష్ట పరిహారం చెల్లించాలని మాధవన్న నయా పైసా ఫీజు తీసుకోకుండా నిజామాబాద్‌లోని సబ్‌కోర్ట్‌లో రాష్ట్ర ప్రభుత్వంపై, పోలీసులపై కేసులు వేసి విజయం సాధించాడు. అట్టి తీర్పుపై పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కోర్ట్‌లో అప్పీలు వేసి ఓడిపోయారు. చివరకు ప్రభుత్వం, పోలీసులు రెండు కేసుల్లో ఎన్కౌంటర్ బాధితుల కుటుంబాలకు లక్ష రూపాయల చొప్పున వడ్డీతో సహ నష్టపరిహారం చెల్లించారు. ఈ విజయం దేశ న్యాయ వ్యవస్థ చరిత్రలోనే నూతన అధ్యాయానికి నాంది పలికింది. పౌర హక్కుల సంఘంలో సైద్ధాంతిక, ఆచరణ అంశాలపై ఏర్పడిన భిన్నాభిప్రాయాల కారణంగా 1998 లో పౌర హక్కుల సంఘం నుండి ఒక వర్గం విడిపోయి మానవ హక్కుల సంస్థగా ఏర్పడినప్పుడు కొంతకాలం ఏ పదవిలో లేకుండానే రెండు సంస్థల కార్యకర్తలకు హక్కుల ఉద్యమంలో దిశానిర్దేశం చేస్తూ ఉపన్యాసాల ద్వారా, వ్యాసాల ద్వారా తన పాత్రను నిర్వహించాడు. తర్వాత మానవ హక్కుల సంఘంలో రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు

చేపట్టి మానవ హక్కుల సంఘం రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం కావడానికి తీవ్రంగా కృషి చేశాడు. ఒకవైపు మానవ హక్కుల సంఘం రాష్ట్ర నాయకుడిగా వుంటూ కూడా పౌర హక్కుల సంఘం జిల్లా నాయకత్వానికి అండగా వుంటూ తన సూచనలు, సలహాలు అందించాడు. పౌర హక్కుల సంఘంతో కలిసి ఉమ్మడి కార్యక్రమాల నిర్వహణకు మార్గదర్శిగా నిలిచాడు.

ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషలపై మాధవన్నకున్న పట్టు అమోఘమైనది. భారత రాజ్యాంగాన్ని, వివిధ చట్టాలను మార్క్సిస్ట్ దృక్పథంలో అన్వయించడంలో తనకు తానే సాటి. 1999లో సివిల్ ప్రొసీజర్ కోడ్‌లో సవరణలకు ప్రవేశపెట్టిన బిల్లుకు వ్యతిరేకంగా జరిగిన దేశవ్యాప్త ఉద్యమం సందర్భంగా సవరణల వల్ల ఎలా నష్టమో లాయర్లకు, సామాన్య ప్రజలకు అర్థమయ్యే విధంగా ఉపన్యాసాలు, వ్యాసాల రూపంలో చైతన్య పరిచాడు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో సవరణల కోసం వేసిన జస్టిస్ మాలిమత్ కమిటీ రిపోర్ట్ లోని పౌర హక్కులకు భంగం కలిగించే అంశాలకు వ్యతిరేకంగా 2003 లో జరిగిన దేశ వ్యాప్త ఉద్యమంలో జిల్లా లోనే కాక, రాష్ట్ర వ్యాప్తంగా తన ప్రసంగాలు, వ్యాసాల ద్వారా న్యాయ వాదుల్లో పౌర హక్కుల ఉద్యమ స్ఫూర్తిని పెంపొందించాడు. దేశవ్యాప్త ఉద్యమ ఫలితంగా కేంద్ర ప్రభుత్వం జస్టిస్ మాలిమత్ కమిటీ రిపోర్ట్‌ను ఉపసంహరించుకుంది.

కామ్రేడ్ మాధవన్నకు 2003 సంవత్సరంలో గుండెకు బైపాస్ సర్జరి అయినప్పటికి అహర్నిశలు అటు న్యాయవాద వృత్తిలో, ఇటు మానవ హక్కుల ఉద్యమం లో, విప్లవోద్యమంలో నిమగ్నమై వుండేవారు. ఉద్యమ సహచరులతో, కార్యకర్తలతో, న్యాయవాదులతో స్నేహపూర్వక సంబంధాలు కలిగివుండే వారు. వాళ్ళ నిత్య జీవితంలో ఎదుర్కొనే సమస్యలకు ఒక అన్నలా అండగా నిలిచి మనోధైర్యాన్నిచ్చి, సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందించేవారు. మహిళలు తమ అత్తవారింటిల్లో భర్తలతో, అత్త మామలతో, వారి కుటుంబ సభ్యులతో ఎదుర్కొంటున్న గృహ హింసకు వ్యతిరేకంగా కోర్టుల్లోనూ, బయటా అనేక పోరాటాలు చేశారు. పురుషాధిక్య, పురుషాహంకార భావజాలానికి వ్యతిరేకంగా, స్త్రీ– పురుష సమానత్వం కోసం తీవ్రంగా కృషిచేశారు. మహిళలు తమ భర్తల, అత్తమామల చేతుల్లో పడుతున్న హింస, బాధలు వింటున్నప్పుడు తీవ్ర ఆవేదన చెందడంతో పాటు, ఆవేశంతో ఉడికిపోయేవారు మాధవన్న.

న్యాయవాదులెవరికైనా తమ కేసుల్లో న్యాయపరమైన సమస్యలు ఎదురై తనను సలహాలు అడిగినప్పుడు వారికి వెంటనే తగిన సలహాలు ఇచ్చేవారు. న్యాయవాదులకు

జడ్జిల వల్ల, క్లయింట్ల వల్ల, పోలీసుల వల్ల, గూండాల వల్ల ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు ఎదురైనా న్యాయవాదులకు మద్దతుగా నిలబడి పోరాడేవారు.

కామ్రేడ్ మాధవన్న ఒక గొప్ప మార్క్సిస్ట్ మేధావి. ఒక విజ్ఞాన సర్వస్వం (ఎన్సైక్లోపీడియా). ఒక తాత్వికుడు. రాజ్యాంగ నిపుణుడు. ఒక పోరాట యోధుడు. ఏ రంగానికి చెందిన ఏ సందేహాన్నైనా తీర్చగల గొప్ప జ్ఞాని. అలాంటి కామ్రేడ్ మాధవన్న మరణం నన్ను తీవ్రంగా బాధించింది. మాధవన్న మన నుండి విడిపోవడం అన్న కుటుంబ సభ్యులకూ, సన్నిహితులకూ, హక్కుల ఉద్యమానికీ, న్యాయ వ్యవస్థకూ, విప్లవోద్యమానికీ తీరని లోటు. మాధవన్న మరణం పట్ల నా ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తున్నాను. అన్నకు నా విప్లవ జోహార్లు అర్పిస్తున్నాను.

# మానవ హక్కుల నిలువెత్తు సంతకం కామ్రేడ్ గొర్రెపాటి మాధవరావు

**- మాతృక సంపాదకవర్గం**

కామ్రేడ్ గొర్రెపాటి మాధవ రావు గారు, హక్కులనేత, ప్రజాపక్షపాతి, తుది శ్వాస వరకు మానవ హక్కుల కోసం పోరాటం చేసిన ప్రజా న్యాయవాది. ఆత్మీయులందరికీ తీవ్రమైన ఆవేదన, దుఃఖం మిగిల్చి ఆయన గుండెపోటుతో 28.12.2024న నిజామాబాద్‌లో అమరులయ్యారు. ఆయన నేత్రాలను లయన్స్ క్లబ్‌కి, భౌతిక కాయాన్ని ప్రభుత్వ వైద్య కళాశాలకి విద్యార్థుల వైద్యపరహొపరిశోధనల కోసం బంధుమిత్రుల సన్నిహితుల కుటుంబ సభ్యుల సమక్షంలో అశ్రునయనాల మద్య ఇచ్చారు. మరణించిన మానవ శరీరం కూడా వైద్య విద్యార్థులకు ఉపయోగపడాలనే మాధవరావు గారి మహత్తర ఆశయంలో భాగంగా ఆయన బౌతిక కాయాన్ని నిజామాబాద్ వైద్య కళాశాలకు అందించారు. మానవ హక్కులకు, మానవీయ విలువలకు నిలువెత్తు సంతకంగా మిగిలాడు కామ్రేడ్ గొర్రెపాటి మాధవరావు.

విప్లవ మేధావి, కామ్రేడ్ మాధవరావు మరణం ఓ విషాద వార్త. పీడీఎస్‌యూ కార్యకర్తగా, రాష్ట్ర నాయకుడుగా తన విప్లవోద్యమ జీవితాన్ని ప్రారంభించి విజృంభణ పత్రిక బాద్యుడిగా, ప్రజల న్యాయవాదిగా, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ మెమోరియల్ ట్రస్టీగా, పౌర హక్కుల రాష్ట్ర నాయకుడుగా, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులుగా... ఎన్నో బాధ్యతలు నిర్వహించాడు. తాను నడిచొచ్చిన దారినీ, విప్లవోద్యమ విలువలను, మానవ హక్కుల స్పృహను ఎన్నడూ వదిలి పెట్టలేదు. రచయితగా, అనువాదకుడుగా సాహిత్య కృషి చేస్తూనే హక్కుల ఉద్యమ కారుడుగా జీవించాడు. ఆయన మరణం ప్రజా స్వామిక శ్రేణులకు, ఉద్యమాలకు తీరని లోటు, నష్టం. నిబద్ధతతో, విలువలతో మానవీయంగా జీవించిన మాధవన్నకు ప్రగతిశీల మహిళా సంఘం, మాతృక సంపాదక వర్గం వినమ్రంగా నివాళి అర్పిస్తున్నది. ఆయన అకాల మరణం పట్ల తీవ్ర విచారాన్ని తెలియజేస్తూ, కుటుంబ సభ్యులకు, ఉద్యమ సహచరులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నాం.

పీడిత ప్రజల హక్కులనేత కామ్రేడ్ గొర్రెపాటి మాధవరావు మరణం ప్రజా ఉద్యమాలకు, మానవ హక్కుల ఉద్యమానికి, ప్రత్యేకంగా పిఓడబ్ల్యూకి, మాతృకకి తీరని లోటుగా భావిస్తున్నాం. కామ్రేడ్ మాధవరావు లేడనే భౌతిక వాస్తవం మమ్మల్ని తీవ్రంగా కలచి వేస్తోంది. తన మరణ వార్తను ఎంతకూ జీర్ణించుకోలేకపోతున్నాం. ఆయనతో మహిళా సంఘానికున్న అనుబంధం, నాలుగు దశాబ్దాలుగా అనేక సందర్భాల్లో అందించిన సహకారం మరువలేనిది. పత్రిక నిర్వహణకు సంబంధించి, ఛందాలు చేర్పించడానికీ, సంస్థకు ఆర్థిక సహకారం అందించడానికి మనస్ఫూర్తిగా కృషిచేశాడు. కార్యకర్తల అభివృద్ధికీ అధ్యయనానికి దోహదపడుతూ ఎన్నో సందర్భాల్లో విలువైన సూచనలిచ్చి సంఘం ఎదుగుదలకు ధృడంగా నిలబడ్డాడు. దేశానికి ఫాసిస్టు పెను ప్రమాదం పొంచి ఉన్న కాలంలో గొర్రెపాటి మాధవరావు లాంటి హక్కుల నాయకుడు, మానవతావాది, ప్రజాపక్షపాతి భౌతికంగా దూరమవడం ప్రజా, హక్కుల ఉద్యమాలకు, యావత్ ప్రజానీకానికి తీవ్ర నష్టమని తెలియజేస్తూ ఆయన మరణం పట్ల మరోసారి విప్లవ జోహార్లు అర్పిస్తున్నాం.

కామ్రేడ్ మాధవరావు కుటుంబ నేపథ్యం నుండి ఆవరించిన కమ్యూనిస్టు రాజకీయాలు విద్యార్థి దశలో మరింత సంఘటితపడుతూ అమరుడు జంపాల చంద్రశేఖర ప్రసాద్ ప్రభావంతో విప్లవ రాజకీయాల మీద గాఢమైన విశ్వాసాన్ని ధృవీకరించుకున్నాడు. యూనివర్సిటీ ప్రవేశంతో విప్లవ విద్యార్థి ఉద్యమంలో మిలిటెంట్‌గా పాల్గొనడమే కాకుండా ఆ సంస్థ పత్రిక నిర్వహణలో కీలకపాత్ర వహించారు. పిడిఎస్‌యులో క్రియశీలకంగా వ్యవహరిస్తూ రాష్ట్ర ఉద్యమ నిర్మాణంలో కూడా భాగమయ్యారు. 1980 ప్రాంతంలో ఉస్మానియా యూనివర్సిటీలో లా చదువుతూ విద్యార్థి ఉద్యమాన్ని నడిపించడంలో, నిరంతరం విద్యార్థులను కూడగట్టడంలో కీలక పాత్ర పోషించాడు. ఇంగ్లీష్, తెలుగులో అనేక అనువాదాలు, రచనలు చేశాడు. నిజామాబాద్‌లో న్యాయవాదిగా ప్రజల పక్షం వహించారు. టీచర్‌గా, మేధావిగా అనేకసార్లు ప్రగతిశీల విద్యార్థులకు ఉద్యమ పాఠాలను బోధించారు. బహుభాష కోవిదుడుగా అనేక రచనలు చేశారు. ఈ వ్యవస్థ మార్పుకోసం, సమసమాజం కోసం పరితపించారు. దీనికోసం సాహిత్యాన్ని సృష్టించారు. విప్లవోద్యమంలో భాగంగా నవలలనూ, చైనా చరిత్రను అనువదించారు. ప్రజా కళలను ప్రోత్సహించారు. డిడి కోసంబి వ్యాసాలు అనువాదం చేశారు. చైనా కమ్యూనిస్టు పార్టీ చరిత్ర అనువాదం చేశారు. సామాన్యమైన కార్మికులకు ఉపయోగపడేవిధంగా కార్మిక చట్టాలు తెలుగులోకి అనువదించారు. మంచి ఉపన్యాసకుడుగా పాల్గొని స్ఫూర్తిని అందించి చైతన్యాన్ని

కలిగించాడు. జంపాల చంద్రశేఖర ప్రసాద్ మెమోరియల్ మేనేజింగ్ ట్రస్ట్ తరపున విప్లవ, ప్రగతిశీల సాహిత్యాన్ని సమాజానికి అందించారు. జీవితాంతం మానవ హక్కుల పరిరక్షణ కోసం ఎనలేని కృషి చేశారు. ఆయన విప్లవోద్యమపు కేసులు ఎన్నో వాదించి, వందలాది మందికి బెయిల్స్ ఇప్పించారు, విప్లవకారులను గెలిపించారు, కేసులు కొట్టుడు పోయేలా చేశారు, నిర్దోషులుగా విడిపించి తన నిబద్ధతను, నిజాయితీని చాటుకున్నాడు. ప్రజా ఉద్యమ కేసులను వాదించడంలో బెయిల్ ఇప్పించడంలో, అక్రమ, కుట్ర కేసులను కొట్టివేపించడంలో అందె వేసిన చేయిగా పేరు తెచ్చుకున్నారు. ఉత్తర తెలంగాణా, నిజామాబాదు ప్రజా జీవితంలో విడదీయరాని పెద్ద దిక్కుగా, న్యాయవాదిగా సమాజ మార్పు కోసం సాగిన పోరాటంలో క్రియాశీలకంగా పాల్గొన్నారు.

స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం జరిగిన పోరాటాలకు అండగా, కార్మికవర్గ సైద్ధాంతిక దృక్పథంతో జీవితాంతం పనిచేశాడు. మార్క్సిజం తాత్విక శక్తితో, విప్లవ భావజాలంతో హక్కుల ఉద్యమంలో నిరంతరం కృషి చేశాడు. ఆకలి, కన్నీళ్లు, దోపిడీలేని సమసమాజం కావాలని వివిధ రూపాల్లో సోషలిజాన్ని విరామ మెరుగక ప్రచారం చేసాడు. నిరుపేదల ప్రతినిధిగా మొక్కవోని దీక్షా దక్షతలతో తన ప్రస్థానాన్ని కొనసాగిస్తూ ఎదిగిన మానవతా మూర్తి, మానవ హక్కులనేత కామ్రేడ్ గొర్రెపాటి మాధవరావు. విప్లవ రాజకీయాలల్లో క్రియాశీలక భూమిక పోషించాడు. హక్కుల ఉద్యమాల్లో ప్రధాన భాగస్వామిగా తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పాత్ర పోషించాడు. రాజ్యహింసను వ్యతిరేకించడంలో భాగంగా రాష్ట్ర హక్కుల సారధి బాలగోపాల్‌తో నడిచారు. అదే క్రమంలో బాలగోపాల్ స్థాపించిన మానవ హక్కుల సంఘాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా అణచివేత, దేశంలో జరిగిన రాజ్యాహింస, అక్రమ కేసులు, ఉద్యమాలపై నిర్బంధాలకు వ్యతిరేకంగా నిజనిర్ధారణలు నిర్వహించి నివేదికలు సమర్పించారు. ఎంతటి స్థాయి వారితోనైనా ఎంతో కలివిడిగా, ఆప్యాయంగా మెలిగేవాడు. తాను మౌలికంగా మార్క్సిజాన్ని, మనుషులనూ ప్రేమించాడు. విప్లవోద్యమ కృషికి అండగా ఉన్నాడు. రాజకీయ భిన్నాభిప్రాయాలు ఉన్నా మనుషులతో ప్రేమగా, స్నేహంగా ఉండేవాడు. కామ్రేడ్ మాధవరావు అందించిన విప్లవస్ఫూర్తి ప్రజాఉద్యమాలకి పెట్టుబడిగా కొనసాగింది. ఆయన దృఢంగా ఆశించిన ఆశయాల కోసం తుదికంటా పోరాడుతామని ప్రతిజ్ఞ చేస్తూ ఆయనకు మరోసారి విప్లవ జోహార్లు !

గొర్రెపాటి మాధవరావు అమర్ రహే!!

# హక్కుల ఉద్యమ సేనాని

- ఎమ్మెస్

ఇఫ్టా

డిసెంబర్ 28 అత్యంత విషాదకరమైన రోజు. విప్లవ మేధావి మాధవన్న శాశ్వత నిద్రలోకి వెళ్ళిన రోజు. ఆహక్కుల ఉద్యమ నేత గొంతు ఆగిపోయిన రోజు కూడా. ఆయన ఆలోచనలు భౌతికంగా భిన్న సామాజిక సమూహాల మధ్య మెదలాడే అవకాశం ఇకపై ఉండదు. కానీ ఆయన నిర్దేశించుకున్న ఆశయాల భావజాలం మన మధ్య నిరంతరం ఉంటుంది మనల్ని వెన్నంటి నడుపుతుంది. పీడిత వర్గ ఉద్యమాల వైపు అడుగులు వేయిస్తుంది.

మాధవన్న మనలోనివాడు. ముమ్మాటికి ఇది నిజం. మాధవన్న మనవాడు. మనలోనివాడు. మనందరివాడు. ఎందుకంటే ఆయన పీడిత ప్రజాపక్ష పాతి. అట్టడుగు వర్గాల కనురెప్ప. కష్టజీవుల కాపలాదారుడు. మాధవన్న మార్క్సిజం పునాదిగా ఎదిగిన మానవతావాది. ప్రజా ఉద్యమాలకు దిక్సూచి. హక్కుల ఉద్యమంలో అలుపెరుగని నేత. పీడిత ప్రజా ఉద్యమాలకు ఆలోచనపరుడు. మార్గదర్శి. హింసాత్మక రాజ్యానికి ప్రతిఘటన కార్యశీలుడు. రాజ్యహింసపై రణనినాదం. అణగారినవర్గాల తరపు ఆరిపోని గొంతుక. అణిచివేసినా కొద్దీ మరింతగా లేచే చైతన్య దీపిక. ఎల్లలు లేని ప్రపంచం నాదంటూ సకల సకల పీడిత ప్రజా రాశులను అక్కున చేర్చుకునే ఆపద్బాంధవుడు. నిత్య అధ్యయనశీలి. ప్రతి విషయాన్ని మార్క్సిస్టు–లెనినిస్ట్ పర్స్పెక్టివ్‌తో పరిశీలించే స్వభావి. ప్రజాక్షేత్రంలో అపారమైన జ్ఞాన సంపత్తిని సమకూర్చుకున్న మార్క్సిస్ట్–లెనినిస్ట్ కార్యకర్త. నిరంతరం హక్కుల, ప్రజా ఉద్యమాల నుండి నేర్చుకోవడం, బోధించడమన్న ప్రక్రియను దైనందిన జీవిత జ్ఞాపకంగా అలవర్చుకున్న మావో వాది. నిరంతరం ప్రజల హక్కుల కోసం పరితపించే హక్కుల ఉద్యమ సేనాని. హక్కుల ఉద్యమంలో రాజీలేనీ, మడిమతిప్పని పోరాట ధీశాలి. ప్రజా ఉద్యమాలకు బాసటగా నిలిచిన ఆచరణశీలి.

మూల ఆదివాసి బిడ్డలకు రక్షణ కవచంగా నిలిచిన హక్కుల ఉద్యమ సేనాని. రాజ్య హింసపై ప్రతిఘటన స్వరం. అడవి పై సంపూర్ణ హక్కు, అధికారం ఆదివాసులదే

అని చాటిన సామాజిక సమన్యాయవాది. పూసలలో దారంలాగా ప్రజా ఉద్యమాలకు బాసటగా నిలిచినవాడు. హక్కులు ఎక్కడ ఎప్పుడు ఏ రూపంలో ఉల్లంఘించిన ప్రశ్నించే తత్వాన్ని జీవితత్వంగా అలవర్చుకున్న ఉద్యమ యోధుడు మాధవన్న. సైదాంతిక రాజకీయ భావజాలం పట్ల కమిట్‌మెంట్, పనిపట్ల నిబద్ధత, పారదర్శకత, జవాబుదారితనం మాధవన్న సొంతం.

విప్లవకర సామాజిక, ప్రజాస్వామిక రాజకీయ విలువలను పాదుకోల్పడానికి నిబద్ధతతో కృషి చేసినవాడు మాధవన్న. నిజమైన ప్రజాస్వామ్య హక్కులు సాధికారతకు సామాజిక విప్లవమే మార్గమని విశ్వసించిన వాడు మాధవన్న. వర్గ సమాజంలో వర్గ సంఘర్షణ సహజమని, అసమానపు సమాజాన్ని పేకలించాలంటే ప్రజల భాగస్వామ్యం తప్పనిసరనీ వారి భాగస్వామ్యం లేకుండా పోరాటాలలో సజీవత్వం ఉండదని విజయం సాధించడం కూడా అసాధ్యమని దృఢంగా భావించినవాడు మాధవన్న.

మాధవన్నతో మూడు దశాబ్దాల పరిచయం. పిడిఎస్‌యు బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు పలుమార్లు నిజామాబాద్ వెళ్లిన సందర్భంలోనూ తాను హైదరాబాద్ ఆఫీస్‌కు వచ్చిన సందర్భంలోనూ కలిసే వాళ్ళం. ఆయన పలకరింపులో ఉండే ఆత్మీయత, ప్రేమ, ఆప్యాయత, అభిమానం, ఇమిడి ఉండే సోదర భావం పదేపదే కలవాలని కలిసి ఉండాలని ఆలోచన రేకెత్తించేది. ఎప్పుడు కలిసిన సంఘ కార్యక్రమాలు సభ్యుల అధ్యయనం తీరు సంబంధించి అడిగేవాడు రాజకీయ శిక్షణ తరగతుల ప్రాధాన్యత విద్యార్థులు మార్క్సిస్టు క్లాసిక్‌ను విధిగా అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పేవాడు. జిల్లా రాష్ట్ర స్థాయి సభ్యుల అధ్యయన దృష్టి పెంపొందించాల్సిన బాధ్యత రాష్ట్ర నాయకత్వంపైనే ఉంటుందన్న విషయాన్ని గుర్తు చేసేవాడు. ఇంతకీ నాయకత్వం శ్రేణి ఆ విధంగా ఆచరణలో ఉన్నప్పుడే సాధ్యమవుతుందని కూడా చెప్పేవాడు. విద్యార్థి సంఘం నిర్వహించే తిరుగుబాటు పత్రిక నాణ్యత ప్రమాణాల గురించి సూచించేవాడు.

హైదరాబాదులో మేమంతా 2024 డిసెంబర్ 24న జరిగే పిడిఎస్‌యు పూర్వ విద్యార్థుల సభ సందర్భంగా వెలువరించి బుక్లెట్ పనిలో నిమగ్నమే ఉన్నాం. డిసెంబర్ 22 రాత్రి 11:30 గంటలకు నిజామాబాద్ నుంచి ఫోన్ వచ్చింది అది మాధవన్న నుండి వచ్చిన ఫోను. శ్రీను బుక్‌లెట్‌లో ప్రచురించే నా వ్యాసం రేపు 12 గంటల లోపు పంపవచ్చా? అవకాశం ఉంటుందా? నిజానికి ఇది మాకు పిడుగు లాంటి సమాచార మే కొద్ది క్షణాల్లో చేరుకొని పరవాలేదు అన్న పంపండి.

డిసెంబర్ 24 పూర్వ విద్యార్థుల సభకు కుటుంబ సభ్యులతో ఉద్యమ సహచరులతో కలిసి వచ్చాడు. నేను కనపడగానే శ్రీనివాస్ ఇబ్బంది కలిగించానా? పర్వాలేదు కదా నా వ్యాసం ప్రచురించడానికి అవకాశం ఉండేనా అంటూ పలకరించాడు. అంతా ఓకే. పుస్తకం కూడా వచ్చేసింది. అయితే ఆ పుస్తకాన్ని మీరు చూస్తే మాకు ఇబ్బందులు గట్టిగానే ఉంటాయని నవ్వుతూ అన్నాను అంటూ సభకు వస్తున్న పూర్వ విద్యార్థి నాయకులను నా ఫోన్లో బంధించడానికి ప్రయత్నం చేస్తున్నాను. ఆ ప్రయత్నంలో భాగంగా ఈ సమూహాన్ని ఫోటో తీయడానికి ప్రయత్నిస్తుండగా అందరూ రండి మన శ్రీను ఫోటో తీస్తున్నాడు అంటూ నవ్వుతూ తనతో వచ్చిన సహచరులను, కుటుంబ సభ్యులను దగ్గరికి పిలిచాడు. ఆ ఫోటో ఇవ్వాలా ఆయన అమరత్వం సాక్షిగా వచ్చే పుస్తకంలో ఉంటుందని ఊహించలేదు. అసలు ఆయన అకాల మరణాన్ని నా ఊహలో లేనిది. రాకూడనిది కూడా.

# పెద్దన్నను కోల్పోయాం

– **గజవాడ హన్మంత్‌రావు**
*చీఫ్ ఇంజనీర్ (రిటైర్డ్)*
*రహదారులు భవనముల శాఖ, నిజామాబాద్*

నాకు పార్టీతోనూ, మాధవ గారితోనూ 1983 సంవత్సరం నుంచి అనుబంధం ఉంది. నాకు ఒక పెద్దన్న లాగా ప్రతి విషయం లోనూ మార్గదర్శకంగా ఉండేవారు. నేను ఇంటర్మీడియట్ వరకు ఆర్‌ఎస్ఎస్ లోనూ, ఇంజనీరింగ్ విద్యా చదివేటప్పుడు ఆర్ఎస్‌యులో పాల్గొన్నాను. అటు సనాతన మరియు ఇటు వామపక్ష భావజాలం యొక్క ప్రభావం నా వ్యక్తిత్వం పై పడింది. శ్రీ మాధవరావు గారిని కలిసిన తర్వాత భావజాలాలకు అతీతంగా సమాజానికి మేలు జరిగే విషయంలో, సహాయం అవసరం ఉన్న వారి విషయంలో స్పందించడం మానవ ధర్మ మని నేర్చుకున్నాను. మనం నమ్మిన దానికోసం, మనని నమ్ముకున్న వారి కోసం మన శాయశక్తుల కృషి చేయాలని మాదవ్ అన్న ద్వారా నేర్చుకున్నాను. మాదవ అన్న లేని లోటు మాకు ఒక పెద్దన్నను కోల్పోయినంత. మీనా అక్క గారికీ, స్మైలీకీ మేము, మా కుటుంబ సభ్యులము ఎప్పటిలాగే మాదవ్ అన్నగారు ఉన్నప్పుడు ఎలా ఉండేవారము అంతకంటే మంచిగా ఉండి మాదవ్ అన్న రుణం తీర్చుకోవాలని నిర్ణయించుకున్నాము.

# ఇందూరు బంధువు ఇందూరు ఎర్రని సింధూరం

**- సిర్ప లింగం**

అర్సపల్లి

ఎమర్జెన్సీ కూరల తడి ఆరని కొన్నేళ్లుగా పిడిఎస్యు ఆవిర్భావంలో పాత్రుడు.

అరుణోదయ గలాలకం ధ్వని గజ్జల సవ్వడి పునాది తప్పులకు అమరుల ఆశయాల ఎర్రజెండా సుత్తి కొడవలి. శ్రామిక జన గొంతుక. ఆశల పల్లకి బోయి. దోపిడీదారుల గుండెల్లో పరిగెత్తిన రైలు బండి. ఆశయాల మేఘాలను వర్షించే నీటి బిందువు.

నిజామాబాద్ నిండుకుండ ఆఖరి దప్పుల అన్నార్తుల విముక్తి బాటల రత్న కిరీటం. మాటలతో అగ్ని కురిపించి న్యాయవాద వృత్తి ప్రజల కోసం అండదండలై అహర్నిశలు శ్రమించిన నల్లకోటులో ఎర్ర చొక్కా ధరించిన తెలుపు యజ్ఞంతో శాంతిని కోరిన కనిక నిప్పు. చిరునవ్వు అరనవు మాత్రమే కోపంతో అర్థం తెలిపిన వాడు. ఆలోచనల్లో అంతరార్థం ఎరిగినవాడు. ఇందూరు జిల్లాపై ఎర్రజెండా ఎగరేసిన వారు. రాత్రింబవళ్లు ఆధ్యాంతం లెక్క చేయక అధ్యయనం చేసి ప్రజల మార్గం ఆచరణాత్మక పార్టీ కార్యకర్తలపై పూర్తి కాలం త్యాగదనులపై నడకలు నేర్పిన వారు. మార్క్సిజం లెనిజం పాటల మహోపాధ్యాయులు.

కామ్రేడ్ జెసిఎస్, కానూరి, రామారావు, ఆరెట్టి, పరుచూరి సీతారాములు, ముత్యం, డీవీకే అరుణ తారల మనోగతాన్ని మదించిపట్టి జన బహుళయంలోకి వారి జీవిత ఆశయాలను పట్టి పట్టి విత్తు విత్తున మొక్కల నుండి ఫలాలను అందించినవారు. అనేక వ్యాసాలు పుస్తకాలు నవలలు జీవిత కథలు రచనలు రూపంలో అంత: దృష్టితో వివరించి చెప్పిన నాయకుల నోనోర్చిన ప్రజా సంఘాల తీరుతిన్నాను. అంతర్ శత్రువు బాహ్య శత్రువుల మాటుగాచినవారు.

అన్నా అన్నా పిలుపు మిన్న వినలేని ఆ నోరు మాట దూరమైనది. అవయవ దానము వీరమ కాబోయే డాక్టర్ల పరీక్షల కొరకు ఎనలేని కృషి వల్లరులు. నిజామాబాదు

నుండి ఎందరినో అవయవాలు దానం చేయించి కళ్ళు, గుండె, కిడ్నీలు ఎందరివో ప్రాణాలు జీవం పోయించి పునర్జన్మ ఇప్పించారు.

మానవ హక్కుల నేత పోరాటయోధుడు ఎన్కౌంటర్ జరిగిన ప్రాణాలు తీసిన పోలీసు తూటకు విలువకట్టి ఇప్పించిన  కుటుంబ నిరుపేదల జీవితాలను మల్లెపూల బాటన నడిపినారు.

వామపక్ష భావాల పెద్దదిక్కు అన్నింటికీ సలహాలు సహాయం అడిగిన వెంటనే ఆర్థిక హార్దిక మనోధైర్యం నింపిన వారు. అతను హిమశిఖరం అతను ఆరోగ్యం పట్ల అందరికీ బోధన చేసిన వారు. భోజనం ఎలా ఉండాలి ఆహార నియమాలు పాటించిన వారు. యోగా యోగి నడక నడిచిన వారు. పెన్ను గన్నును చేసి అనేక పుస్తక గ్రంథాలయం అందించినవారు. విద్యార్థులయెడల తాపత్రయంతో జేసిఎస్ గ్రంథాలయం భద్రపరిచినవారు.

అలా 67 లో వంద నిండే అడుగు ఆగి ముందుకు నడిచేలా ఆచరణ యోగాత్మక బాటను చూపినవారు.

మనిషి అంటే ప్రేమ

ఆప్యాయత

భావోద్వేగి

అధ్యయనం

ఆచరణ

సిద్ధాంతకర్త

అన్ని రంగాలను అలలపై తెలియాడా వేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి కామ్రేడ్ గొర్రెపాటి మాధవరావు.

నిశ్శబ్దం ఛేదించాలి అలజడి తాకిడి కావాలి. సంధ్యా కెరటాలై పొంగిపొర్లాలి.

నీ తోడు నీడ దొరకదని ఖచ్చితమైన అభిప్రాయం.

కానీ నీ వారమలనందించిన ఘణిత ఉంది. శ్రీధర్, భాస్కర్, రవి, రమేష్, పాపయ్య, కన్నెగంటి యువ కార్యకర్తలు ఎందరో నీ ఆశయాల అడుగులు వేసి నడవాలని విప్లవ సలామ్.

# విప్లవ మేధావి, మానవ హక్కుల యోధుడు గొర్రెపాటి మాధవరావుకు విప్లవ శ్రద్ధాంజలి!

మానవ హక్కులు, ప్రజాస్వామిక హక్కుల ఉద్యమంలో నాయకుడిగా 40 సం.లకు పైగా దీర్ఘకాలం పనిచేసిన గొర్రెపాటి మాధవరావు తే.28-12-2024న ఉదయం 7.20 ని.లకు తీవ్రమైన గుండెపోటు కారణంగా, హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మరణించారు. వీరి మరణం మానవహక్కుల ఉద్యమానికేగాక, విప్లవోద్యమానికి కూడా తీరనిలోటు. అమరుడు మాధవరావుకి విప్లవ జోహార్లు అర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులు - జీవిత భాగస్వామి మీనా, కూతుర్లు మానస, ఆదిత్య మధుమితలకూ, వారి సహచరులకూ తీవ్ర విచారాన్ని సి.పి.ఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, తెలంగాణా రాష్ట్ర కమిటీ తెలియజేస్తోంది.

గొర్రెపాటి మాధవరావు విద్యార్థి దశ నుండే ప్రగతిశీల ప్రజా ఉద్యమాలతో సన్నిహిత సంబంధం కలిగిఉన్నారు. విద్యార్థిగా డిగ్రీ, లా చదువుతున్నప్పుడు పి.డి.ఎస్.యు. నాయకుడిగా విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొని, విద్యార్థుల సమస్యలపై పోరాడారు. అప్పటి పి.డి.ఎస్.యు. పత్రిక " విజృంభణ బాధ్యతలు కొంత కాలం చూశారు. అలాగే 1977 నుండి 1980 వరకు లి విమోచన పత్రికలో బాధ్యతలు నిర్వహించారు.

నిజామాబాద్ లో న్యాయవాదిగా ప్రారంభించి, ప్రభుత్వ ప్లీడర్ గా అవకాశం వచ్చినా తిరస్కరించి, న్యాయవాదిగానే కొనసాగారు. పౌర హక్కుల సంఘంలో 1983-1996 వరకు రాష్ట్ర సహాయ కార్యదర్శిగా చురుకైన పాత్ర నిర్వహించారు. తర్వాత, మానవహక్కుల వేదికలో చేరి, రాష్ట్ర అధ్యక్షుడిగా 2019-2023 వరకు కొనసాగి, తన జీవితం చివరి వరకు మానవహక్కుల ఉద్యమంలో ముఖ్యమైన పాత్ర నిర్వహించారు.

మాధవరావు నిరంతర అధ్యయనశీలి. రచయిత. 1977లో ప్రారంభమైన తన రచనా వ్యాసంగం చివరి వరకు కొనసాగింది. సులభంగా అర్థమయ్యే సాధారణ పరిభాషలో రాయడం ఆయన ప్రత్యేక శైలి. ఆయన రచనలలో కార్మిక చట్టాలు బాగా గుర్తింపు పొందింది. అనువాదాలలో అందెవేసిన చేయి. ఆధునిక చైనా విప్లవం 'జాతీయత లేని కాంగ్రెస్', 'విశ్వ మానవ హక్కుల ప్రకటన ఆచరణలో గతితర్కం (డి.డి. కోశాంబి) ఆయన అనువాదాలలో కొన్ని,

న్యాయవాద వృత్తిలో వుండి, చివరికి ఎన్‌కౌంటర్‌పై కేసువేసి, ప్రభుత్వం

నుండి నష్టపరిహారం కోర్టు ద్వారా సాధించింది ప్రత్యేక ప్రాధాన్యత కలది. ప్రభుత్వంపై ఎన్ కౌంటర్ల విషయంలో కేసువేసి, ధైర్యంగా నిలబడి, గెలవడం అతని ప్రత్యేకతను తెలియజేస్తోంది. అనేక బూటకపు ఎన్ కౌంటర్లలో నిజ నిర్ధారణ చేసి, వాస్తవాలను ప్రపంచానికి వెల్లడించడంలో మాధవరావు కృషి మరువలేనిది.

అన్నింటికీ మించి, దేశంలో సమ సమాజం గురించి కలలు కని, అందుకు అన్ని విధాలుగా సహకరించారు. భాగస్వామి అయ్యారు. ఆయన కృషి మానవహక్కుల, ప్రజాస్వామిక హక్కుల ఉద్యమకారులకు ఒక స్ఫూర్తి నిస్తుంది. ఆదర్శంగా నిలుస్తుంది.

అమరుడు గొర్రెపాటి మాధవరావుకి శ్రద్ధాంజలి ఘటిస్తూ, ఆయన ఆశయసాధనకై మా కృషిని చివరికంటా కొనసాగిస్తామని ప్రతినబూనుతున్నాం.

**పి.సూర్యం**

*రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర కమిటీ,*

*సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ*

హైదరాబాద్,

28-12-2024.

# మాధవరావుకి కన్నీటి వీడ్కోలు

మనిషితనంతో బ్రతికిన మానవ హక్కుల నేత మన మాధవరావు. మానవ మనుగడకు దారి చూపిన నేస్తం మన గొర్రెపాటి. తప్పు ఒప్పులను సరితూయగల ధీశాలి. ఉద్యమానికి ఊపిరిలూదిన మహాశయుడు. హక్కుల కోసం నినదించిన మార్గదర్శకుడు. రాజ్య హింసలకు తల్లడిల్లిన మానవమూర్తి. భవిష్యత్ తరాలకు ఓ బాటసారి. ఈ నిర్బంధాలను తెంచుకొని హక్కుల బాట పట్టమని శాసించాడు, దీవించాడు. మాధవరావు చల్లని నవ్వుల నుండి వెదజల్లిన శాంతి కుసుమాలు శాశ్వతం అజరామరం. తండ్రి ప్రేమలో తడిసి ముద్దయిన కూతుళ్ళ రోదనలు మారుమోగుతూనే ఉన్నాయి. మీనా రోదన అరణ్య రోదనగానే మిగిలింది. కళ్ల దానంతో చీకట్లను చీల్చుకుంటూ, అవయవ దానంతో మరణించి జీవించాడు. మన మాధవుడు మహోపాధ్యాయుడయ్యాడు. మంచికి మరణం లేదని సాటి చెప్పిన మాధవరావుకి విప్లవ జోహార్లు.

– గుత్తా జ్యోత్స్న

# ఒక శిఖరం నేలకొరిగింది

– పటోల్ల విఠల్ రెడ్డి

పల్లవి:
ఒక శిఖరం నేలకొరిగింది.
ఒక తార రాలి పోయింది.
ఒక సెలయేరు ఆగి పోయింది.
ప్రశ్నించే గొంతు ఎక్కడుందని చెప్పాలి. //ఒక్క//

చరణం:
కష్టజీవులే నా ఊపిరి అంటీవా!
ఎర్రజెండే నా ప్రాణమంటివా!
ఒకవైపున హక్కుల జెండా
మరోవైపున విప్లవ జెండా
ఎత్తుకొని నీ పయనం సాగేనా
అన్నలను చంపితే ప్రశ్నించావు!
హక్కులకై నీవు వాదించావు!

ప్రజలకు స్వేచ్ఛ రావాలంటూ
రాజ్య హింస ఆగాలంటూ
అలుపెరుగని నీ గమ్యం సాగేనా మాధవా! //ఒక్క//

ప్రజల కోసమే జీవించావు!
చివరి కంటా పోరాడినావు!
సంకెళ్ళకు అదరలేదు!
గన్నులకు బెదరలేదు!
అందరికీ ఆదర్శమైతివీ
ఉద్యమ స్ఫూర్తిని రగిలించితివీ
ఇక సెలవంటూ వెళ్లిపోయావా
మాధవా! //ఒక్క//

# జోహార్లు కామ్రేడ్ గొర్రెపాటి మాధవరావు

– మిత్ర

పల్లవి :
ఏదీ స్వాతంత్ర్యమో – ఏది
మనకు స్వేచ్ఛనో
ఏదీ ఆకలి పీడన
ఆజాదికి అర్థమో
ఏది దేశద్రోహమో
ఏది కర చట్టమో
ఏ సకల సంపదలు
శ్రమజీవుల స్వంతమో
వివరించిన విప్లవాల ప్రేమికా
విరచించిన హక్కులా నాయకా
జోహార్లు గొర్రెపాటి మాధవరావూ
నీవే కదా మా హృదయారుణ వెలుగుల తావు ॥ఏదీ॥

1)
కళ్ళు తెరిచి చూస్తివి కద
పిడిఎస్‌యు విద్యార్థిగ
కుళ్ళిపోయిన సమాజాన్ని
కూకటి వేళ్ళతో కూల్చగ
అమరుడు జంపాల నీకు
ఆధ్యంతం ప్రేరణ
విజృంభణ, విమోచనలు
అక్షరాల ధారణ
తిరిగి తిరిగి పేదలకు న్యాయమంటు నిలిచావు
మానవ హక్కుల పోరుకు దండోరా వేశావు ॥జోహారులు॥

2)
ప్రపంచీకరణలోన
పాలమీగడెవరికోజి
రిజర్వేషన్ల గంజి
గుంజుకునే మోసమో
వివరిస్తూ తేడాలను
విప్పారిన నీ మోము
ఎప్పటికీ మరువము
ఎదురీత ప్రయాణము
కొండలనే ఢీకొట్టే నీ గుండె కెట్ల ప్రమాదం
చండాలుడే ప్రచండమౌ గొప్పది నీ ఆశయం ॥జోహరులు॥

3)
ఎడతెగక ప్రగతి బాట
నడ్సి నడక నేర్పావు
పుస్తకాలనిస్తానని జి
పుస్తకంగా మారావు
సమానత్వ సాధనయనె
వాగ్దానం చేసావు
విశ్వ మానవులై బతికే
పాఠం అందించావు
మనిషికి ప్రకృతికి సంబంధ బాంధవ్యం
మార్పు దిశగా పోరాటం చారిత్రిక కర్తవ్యం

జోహారులు నీకు గొర్రెపాటి మాధవరావు
నీవే కదా మా హృదయారుణ వెల్గులతావు
హక్కుల అమలుయే
నిజమైన స్వాతంత్రం
సంపదల పంపిణే
పేదరికానికి అంతం
జాతుల విముక్తితో

దేశాలకు స్వేచ్ఛతో
విప్లవించే ప్రజలతోనె
దోపిడికి ఘోరీయని
నడ్సినావా హక్కుల నాయకా
ప్రజా విముక్తి పోరు సేవకా
గొర్రెపాటి నీకు వందనాలు–మా
హృదయారుణ వెలుగు నీకు జోహారులు

*(మానవ హక్కులనేత, ప్రజా న్యాయవాది కామ్రేడ్ గొర్రెపాటి మాధవరావు స్మృతిలో..)*

# మానవ హక్కుల నేత మాధవరావుకు జోహార్

– సిర్ప లింగం

ఆలాపన....
ఆ.... ఆ..... ఆ....
ఆ..... ఆ..... ఆ...

సాకి:
సుకుమారపు హృదయమా
చిరునవ్వుల నే
పరిశేచన చేస్తూ
ఎన్ని ఆశలు నీ మీద పెట్టుకుని
ఎన్ని కలలు నీ చుట్టు పోగు చేసుకొని
అన్ని తన్ని వేసావా నేస్తం
కల కల లాడించే నీ నవ్వు కనబడకుండా
ఇంతలోనే కరిగిపోయినదా...

పల్లవి:
బయలుదేరిన
బాటసారి మళ్లీ రాలేవా
నడిసముద్రపు నావ తీరున
మమ్ము చేరేవ
మానవ హక్కుల నేస్తం
పౌర హక్కుల మిత్రమా
మాధవన్న మరువలేము
మీకు జోహార్లు
తల్లడిల్లె కెళ్ళగిల్లే పల్లటిల్లె  బాటసారి నీకు జోహార్లు

చరణం:
యుగ యుగాల దోపిడీలో
నర నరాల రాపిడిలో

వగ దూరిన పొగచూరిన
శాసనాల జాడలల్ల
నరనరాల వేదనల్లో
పేదవాళ్ల బతుకులల్ల
వీర శంఖం ఊదినట్టి
నేస్తమా నీకు జోహార్లు

చరణం:
మానవాళికి హక్కులన్నీ
వహిస్తుందా రహిస్తుందా
రాత్రి పగలు నిదురపోక
జాతి ముక్తి జాడలెంకి
పుస్తకాలు వ్రాసినావు
వ్యాసాలను దిద్దినావు
జడలు విచ్చిన సుడులు రెచ్చిన
కడలి నృత్యం శ్రమిస్తుందా
పడవతీరం క్రమిస్తుందా

చరణం:
కళ్ళు ఇచ్చి ఒళ్ళు ఇచ్చి
లోకమంతా తాను నిలిచి
అవయవ దానమ్ము మిన్న
జగముకింత లేదు లేదని
ఎందరెందరో ప్రాణవాళికి
జీవమిచ్చిన జీవధార
బానిస సంకెళ్ళనింక
శృంఖలాల పగులగొట్టిన

సాకి:
ఓ ఓ –
మాధవన్న
మమ్ము విడిచి దూరమున
చేరిపోయావా నేస్తం –

# నీ ఆశయాలు విప్లవిస్తాయి మా మాధవన్న

– ఉప్పెన

గొర్రెపాటి మాధవన్న గొంతు మూగబోయినాద
అలుపెరుగని హక్కుల ఉక్కుపిడికిలి విశ్రమించె
మా అక్షర నివాళులందుకో మా మాధవన్న
మా విప్లవ జోహారులందుకో మా మాధవన్న "మా అక్షర"

రాజ్యాన్ని నిగ్గదీసీ రాజ్యహింసను ప్రశ్నించి
రాజిలేని వాదనాతో ప్రజల పక్షపాతివయ్యి
నల్లకోటు న్యాయవాదివి మా మాధవన్న
తెల్ల మనసు ఎర్ర గుండెవో మా మాధవన్న "మా అక్షర"

ఇంగ్లీసు బాషలోన ఉపన్యాసం చెప్పేవాల్ల
మాటలాను తెలుగులోన ఎంతొ మంచిగ చెప్పేవాడివి
అసలునే మించి పోయి మా మాధవన్న
అనువాదాలు వుండేవి మా మాధవన్న "మా అక్షర"

జీవించే హక్కుకొరకు జిందగంతా ధారబోసి
జంగ్ నడిపేటి బిడ్డల బొందిలోని ప్రాణమోలే
దిక్కులన్ని పిక్కటిల్లేలా మా మాధవన్న
హక్కల గొంతయ్యి గర్జించే మా మాధవన్న "మా అక్షర"

నీ రాతలన్ని ఉద్యమాల్లో రాజుకుంటయ్ రగులుకుంటయ్
నీ మాటలన్ని జనం జెంగ్ తూటలైతయ్ ఈటెలైతయ్
నీ అమరత్వం పల్లవిస్తుంది మా మాధవన్న
నీ ఆశయాలు విప్లవిస్తాయి మా మాధవన్న "మా అక్షర"

నీ జీవితం ఆదర్శం నీ మార్గం మార్గ దర్శం
నీ మరణం మాసిపోదు నీ ఆశయం చెరిగిపోదు
హక్కులా జెండయ్యి ఎగిరేవు మా మాధవన్న
ఉక్కు పిడికిలయ్యి కదిలేవు మా మాధవన్న "మా అక్షర"

# హక్కులకై ఎత్తిన ఉక్కుపిడికిలి!

– ఉదయగిరి

ప) హక్కులకై ఎత్తినాడు ఉక్కు పిడికిలి
అన్యాయం గుండెలపై చేసే అలికిడి
ఆ గొర్రె పాటి మాదవన్న గొంతులో సడి
వెర్రితలల వ్యవస్థపై రేపె అలజడి ॥హక్కుల॥

1) నిరంతరం జనం మదిలొ చిరంజీవిగా
ప్రభాతపు పతాకమయ్ ఎగురుతుండుగ
గరిబోళ్ల లోగిలిలో గరిక పూవుగా
గతించక ఉండిపోయె చరిత నువ్విగ
కష్టజీవులింట పొడిసేటి పొద్దువంట
కలతలన్ని బాప నడిచావు ప్రజల వెంట
జనం మదిలొ పదిలమయ్యి నిత్యముందువంట ॥హక్కుల॥

2) నిజాంబాదు గడ్డమీద నిప్పు కణములా
నరంనరం మీటినాడు పోరు స్వరముల
జ్వలించిన కిరణం జంపాల దోస్తిగా
ప్రకాశమై వెలిగెను ఆ ప్రగతి మైత్రిగా
రగిలినావు జ్వాలై చైతన్య త్యాగశీలై
సమత పంటచేలో ఆదర్శ తోటమాలై
వడితగ్గక ఉద్యమంలొ కదిలె కార్యశీలై ॥హక్కుల॥

3) దుర్మార్గం తలను తుంచె కడలి చెమ్మగా
చిరకాలం చిగురుతొడుగు పూలకొమ్మగ
రాక్షసంగ రాజ్య హింస సాగుతుండగా
కంఠంపై కత్తిలా నిర్బంధముండగ
వకీలయ్యితాను వాదించ నిలిచెనంట
చికాకులు ఎన్నొఛేదించి గెలిచెనంట
సంధించెను దోపిడిపై ప్రశ్నల పెనుమంట. ॥హక్కుల॥

# మాధవన్న స్మృతిలో

- యన్. దాసు

అన్నన్న మాయన్న. ఓ.మాధవన్నా... మాయన్న
కాన రాకుండా కదిలిపోయావా మాయన్న. ॥అన్నన్న॥

నీ మాట, నీ రూపు మాయమైపోయే మాయన్న
కొండంత దీము లేకుండా పాయే ఓయన్నా ॥అన్నన్న॥

1) హక్కుల కొరకు కొట్లాడినావే మాయన్న.
ఎదురు కాల్పుల గుట్టు విప్పావు ఓయన్నా ॥అన్నన్న॥

2) విద్యార్థి దశలోన పిడికిలి ఎత్తి మాయన్న.
విప్లవ బాటలో పయనించినావు ఓయన్నా ॥అన్నన్న॥

3) సాహిత్యాన్ని ఎంతో చదువు మన్నావు ఓయన్న
మార్క్సిజం బాటలో నడువమన్నావే మాయన్న ॥అన్నన్న॥

4 ) బాగా చదువుమనీ వెన్ను తట్టావే మాయన్న
సంఘర్షణలో ముందుండు మన్నవ్ ఓయన్నా ॥అన్నన్న॥

5) కష్టజీవుల రాజ్యం కోసం మాయన్న
కడదాకా నడిచిన వీరుడవన్న మాయన్న ॥అన్నన్న॥

6) నీ మాట, నీ స్ఫూర్తి యెద నిండా నింపి ఓయన్నా
ఎర్రసైన్యమై సాగుతమన్న ॥అన్నన్న॥

# గొర్రెపాటి మాధవరావు

- దయా నర్సింగ్

గొర్రెపాటి మాదవరావు ఎక్కడున్నడో
గోసలు బాపె మాదవరావు ఏమై పోయెనో
మానవ హక్కుల హుక్కు ధైర్యం ఆర్తనాదాల ఆకలిదైవం
మట్టి మనుషుల మానవహారం నేలరాలిన ఉద్యమశిఖరం
॥గొర్రెపాటి॥

న్యాయశాస్త్రం చదివినా నీతి ధర్మాత్ముడన్నా
నయవంచకుల పాలనపైన నినదించి నాడన్నా
పేదల సాదలకొరకు పోరుబాటలో నడిచిన యోధుడమ్మా
పేరు గల్లా పోరు ఎర్రజెండకు మెరుగు లొద్దిన వీరుడమ్మా
॥గొర్రెపాటి॥

వర్గ పోరు దారుల్లోనా విప్లవించే కమ్యూనిస్టులకు
వోర్పునేర్పు దాపు కాచి దారి చూపిన అక్షరమాలి
త్యాగాల తనువులు తాకిన నేటి తరాణికి ధీరుడోయమ్మా
తల్లి వేరయ్యి సాకిన నల్ల కోటు న్యాయ శూరుడోయమ్మా ॥గొర్రెపాటి॥

రాజ్యం పన్నిన కుట్ర కేసులు చేదించిన యోగెనన్నా
రాజ్యాంగపు నీలి నీడనా బుద్ధుడై గెలిచిండంన్నా
జైలుగోడల్లో మగ్గే విప్లవ వీరులు గాథలు విన్నడోయమ్మా
జంకధన్నడు జగడమాడిండు జైలుగోడలను దాటించిండు ॥గొర్రెపాటి॥

అన్నా నీవు చేసిన త్యాగం ఏనాడు మేము మర్చిపోము
అన్నా నీవు నడిచిన బాట ఏరోజు మేము ఇడిచిఉండం
అన్నా నీవు ఎక్కడున్నా అందుకో మా ఎర్ర దండము
అన్నా నీవు మా గుండెలో ఎల్లకాలం ఉంటావన్నా.... ॥గొర్రెపాటి॥

# మాధవన్న మాకు దూరమాయెనని

– బి.ఎన్.బి

మాధవన్న మాకు దూరమాయెనని
మానవ హక్కులు రోదిస్తున్నవి
పోరాట యోధుని అండగా కోరుతూ
గుండెలు బాదుక ఏడుస్తున్నయి ॥మాధవన్న॥

ఎత్తుకున్న ఎర్రజెండాతో హత్తుకున్న గుండె చప్పుడు
ఎప్పుడూ మాతో వుండాలని
ఆశపడ్డ మీ ఆప్తులందరు
ఎందరో కన్నీటిలోన తడుస్తున్నారు ॥మాధవన్న॥

నిజనిర్ధారణ కమిటీలకు పెద్దదిక్కు లేకుండా పాయే
ఎర్రజెండా ఊరేగింపులో
అడుగులేసే ధీమా పాయె
మాకంటి పాపలో
మా ఎత్తిన పిడికిలిలోని సత్తువంతా కరిగిపాయి
మా కంటిపాపలో నిలిచిపోతావా ॥మాధవన్న॥

ఓ మాధవ్ అన్న
నీ ముచ్చట్లతో అగ్గి రాజేస్తం
ఓ మాధవన్నా
జోహార్ కామ్రేడ్ మాధవన్నా
అమర్ రహే మాధవన్నా

# మాధవన్నా ఓ మాధవన్న..

– వి సురేష్ బాబు

మాధవన్నా ఓ మాధవన్న../2/
మమ్మెట్ల విడిచితివే మధవన్న../2/
నిన్నెట్లా మరతుమే.. మాధవన్న../2/

చిన్ని చిన్ని చిరునవ్వుతో
ఈ దోపిడీ దొంగల గుట్టు విప్పితివన్న... /2/ // మాధవన్న//

నీ మాట నీ రూపు మాయమై పోయేనా...
కొండంత దీపము లేకుండా పోయేనా...//2//
మా హక్కుల కొరకు కొట్లాడినావే...
ఎదురు కాల్పుల గుట్టు నువ్వు విప్పినావే... //2//
//మాధవన్నా//

విద్యార్థి దశలోన పిడికిళ్ళు ఎత్తినౌ ..
ఎర్ర జెండా బాటలోన పోరాడి గెలిసినౌ...//2//
పేదవాడికే ధైర్యం ఇచ్చినవే....
శ్రమశక్తి కి హక్కులను నేర్పినావే...//2//..
/ మాధవన్న//

# పేదల బంధువునీవంట

ప). బంధువు నీవంట పేదల బంధువునీవంట
సమ సమాజ స్థాపనకు సాగినవుఅంట
ఓయన్న మా మాధవన్న నీకు సలామే
మా కష్టజీవుల కన్నీటి సలామే ॥శ్రామిక॥

1) చదువుకునే ప్రాయంలో సత్యాన్ని గ్రహించి
ప్రగతిశీల జండా బట్టి జేసీఎస్ తో దోస్తీ కట్టి
ఎగిరే పిడికిలి జెండా ఎర్రదారవైనట్టి
మా గుండెల పదిలంగ నిలిచినావు వెన్ను తట్టి ॥శ్రామిక॥

2) పట్టుబట్టి పుస్తకాలు చదివినట్టి మాధవుడు
సోషలిజం ఒనమాలు గురువై దిద్దించిండు
నిర్బంధాన్ని ఎదిరించిన నిప్పుకణిక మాధవన్న
రాజ్య హింస నిదిరించిన రగల్ జెండా నీవన్న ॥శ్రామిక॥

3) సమాజాన్ని మార్చుటకు చదువు ముఖ్యమన్నాడు
విజ్ఞానమే నీకు విలువ తెస్తుందని అన్నాడు
పీడితుల అందరిని జమ చేయాలన్నాడు
పోరాట పాఠాలే నేర్పాలని అన్నాడు ॥శ్రామిక॥

4) అమాయకుల చరబట్టి ప్రాణాలను కొల్లగొట్టి
ఉద్యమకారులను బట్టి ఎన్కౌంటర్ చేస్తుంటే
రాజ్యాన్ని నిలదీసి హక్కులకై కొట్లాడే
రాజ్య హింస పైన ప్రశ్నలని సంధించే మాయన్న
మాధవన్న నీకు వందనాలు
మా మదిలో ప్రతినిత్యం ఉంటావు నీవు ॥మాయన్న॥

# ఎర్రజెండా పునాది...
# గొర్రెపాటి గుండె సెలవన్నది....

**- ఏలేశ్వర హరీష్**

కూర్చుంటే సభ అంతా కన్నీళ్ళే....
ఎర్రాజెండాకు కంచెగా మారిన...
నాల్గు అడుగుల ఓ మహాఋషి...
అసాధరణమైన జీవితాన్ని అనుభవించి....
నల్లని దుస్తువుని ధరించి...
పోలీసుల జులుం ను ఎదుర్కొని...
అమాయకమైన ప్రజలకు
అండగా నిలబడ్డ గొర్రెపాటి
గుండె సెలవు ప్రకటించింది...

పొడవైన గొట్టాలను అడ్డుపెట్టి
రైతుల భూములను...
రాజ్యం పెత్రేగి గుంజుకున్న రోజుల్లో....
మాధవుడు రాసిన నిజనిర్ధారణ రిపోర్టు
ఆ రైతులకు వీరునిగా మారిన...
గొర్రెపాటి మాధవరావు కలం సెలవన్నది....

అడవుల్లో దాగి ఉన్న
ఆదీవాసుల బిడ్డలను రక్షించేందుకు...
అన్యాయాలను ఎదుర్కోనేందుకు...
ప్రభుత్వం మీద... ప్రజాస్వామ్యం మీద...
ఉక్కుపాదం మోపిన ఆనాటి ప్రభుత్వాలపై
ప్రశ్నిస్తున్న అడవిబిడ్డల ఎన్ కౌంటర్ లపై
నిరసన వ్యక్తం చేసిన
పీడిత పక్షపాతి గొంతు మూగబోయింది...

బీడికార్మికులకై...
పీడిత వర్గ ప్రజల బాధలపై...
అణగారిన వర్గాల ప్రజలపై
ఉక్కుపాదం మోపుతున్న
ఆనాటి ఖాకీజులం పై...
ఎగరేసిన ఎర్రజెండా వీరుడు...
గొర్రెపాటి మాధవరావు
అమరుడయ్యాడు...

దాదాపు వారం రోజులు....
మాధవరావు సెలవు ప్రకటించి..
కాని కలం కదలలేదు....
ఆరవతేదీన కలిసిన
జ్ఞాపకాలు నేటికి వినిపిస్తూనే ఉన్నాయి...
ఏంమోయ్ హరీష్...
కాస్తా మురుకులైన తినవయ్య అన్న...
మాధవరావు అంకుల్...
భౌతికంగా సెలవు ప్రకటించినా...
జీవిత ప్రయాణంలో
ఆయన బాటలో పయనిస్తా....
నా కలం మంజీరా నివాళులర్పిస్తుంది....

# కార్మిక పక్షపాతీ సెలవ్...

– లావా

ఎక్కడ  ఎన్కౌంటర్ జరిగినా..
గన్ మీద పెన్ ఎక్కుపెట్టి
బుల్లెట్ల లెక్కలు బయటకు తీసిన  మానవవాది సెలవ్...

ఎక్కడ ఏ కార్మిక పోరాటం జరిగినా
దాని చరిత్ర విప్పిచెప్పి కార్మికుల భుజం  తట్టిన
కార్మిక పక్షపాతి సెలవ్. ...

ఎక్కడ ఏ రైతాంగ పోరాటం జరిగినా
రైతుల వెన్నుముకయిన రైతుభాంధవుడా సెలవ్..

రాజ్యాంగానికి బీటలు పారుతుంటే.
ప్రజలను చైతన్యం చేసిన
నిత్య చైతన్య శీలి సెలవ్..

మా జంటకు స్ఫూర్తి అయ్యి
నా గుండెను కరిగించిన మిత్రడికి...
నా కన్నీటి వీడ్కోలు

# కాలమనే కడలిలో

- ఎస్‌వికె

కాలమనే కడలిలో
కన్నీటి దారులలో
బరువెక్కిన మాగుండెలయాదుగా బయలెల్లవా మా మాధవా గౌరైపాటి మాధవా
యిందూరు ప్రజల్లోనా
యింతింబై వెలుగంతై
మనుసుల్ని దోచిన మాధవా
గౌరైపాటి మాధవా
ముసి ముసి నవ్వులతో మురిపించే మాటలలో
స్నేహన్ని పేనవేసి
సెలవంటూ పోయావా మాధవా గౌరైపాటి మాధవా
పీడించే శక్తులపై
పిడికిలి బిగించిన
పి.డి.ఎస్.యూ నేస్తమా
పీడిత ప్రజల ప్రాణమా
గౌరైపాటి మాధవా
కాళ్ళకు గజ్జె కట్టి
గళ్ళు గళ్ళున అడుగేసి
అరుణోదయ బాటల్లో
ఆలోచన రేపే గానమా
మెరిసే ఆణి ముత్యమా
మాలో వెల్లె మాణిక్యమా
మాధవా గౌరైపాటి మాధవా
మనషుల్ని మానాన
వదిలేయని నీ హృదయం
శ్రామిక కష్టాలు చూసి
అండగా నీవు నిలచి

నిజాయితి నిక్కచ్చిగా
ప్రశ్నించిన నీ గొంతు
హడలెత్తిన సర్కారు
తోకముడిచే నీవు గెలిచె అన్యాయన్ని ఎదిరించిన
మాధవా మా మదిలో నిల్చావు నీవయ్యా
అంతరంగ మంత ఎర్రజండనే
ఆశయ మంద ఎర్రమందారమే
హక్కుల కోసం నిలచి
కూడగట్టి గొంతు ఎత్తి
హక్కుల హరివిల్లు మాధవా
నీ ఇల్లే నిలిచే మాధవా
నీ ఆశయాల పిడికిలి ఎత్తి
నవ తరం నిల్చింది
నడుము కు కొంగును చుట్టి ఎర్రబాటలో మహిళ నిలిచి
ఆశయ పుట్టిన పునే మాధవా
అమరుడనైని నిలిచవు నీవయ మాధవా!
గౌర్రెపాటి మాధవా !

# అక్కడ చూస్తే....

– ఘనపురం దేవేందర్

అక్కడికి వెళ్లి చూస్తే
మనిషి ఎలా బతకాలో
తెలిపే ఒక పాఠశాల
కనిపించింది
కళ్ళు దానం చేయడం
ప్రత్యక్షంగా కనబడింది
శరీరం దానం చేయడం
ఉద్వేగంతో బోధించబడింది
నిబద్ధతతో
పూర్తయిన జీవితం
త్యాగాల వేదంలా కనబడింది
నిరంతర పాఠకుడు
మంచు విగ్రహంలా మారడం కనబడింది
హక్కుల గొంతు ధ్వని
అనంత కిరణాలను వెదజల్లుతునే ఉంది
నివాళి అర్పించిన ప్రతి భుజంపై
బాధ్యతను అప్పగించినట్లుంది
అక్కడ దుఃఖసాగరాలు అదృశ్యంగా కనబడుతున్నాయి
జ్ఞాపకాల జలపాతాలు
క్షణం తీరిక లేకుండా కురుస్తూనే ఉన్నాయి
మనిషి పోయిండని
అందరూ అనుకుంటున్నారే కానీ
వెలిగించిన చైతన్య జ్యోతుల
ప్రమాణ స్వీకార వేదికలా కనబడింది
మనుషులు కాదు ....
విప్లవాలు ఉద్యమాలు వచ్చి

నివాళి ఘటిస్తున్నాయి
న్యాయవాదిని
న్యాయ దేవత
కళ్ళకు బట్టను తొలగించి
నివాళి ఘటించిన దృశ్యము కనబడింది
ఉద్యమాలకు..... హక్కులకు
పెద్ద దిక్కులేని ప్రపంచం పరిచయమయ్యింది
మరో పెద్దదిక్కు ఆవిర్భవించడానికి
అనివార్యత సృష్టించబడింది
ఆ పార్థివం నిర్జీవం కాదు
అచేతనంగా మారినా....
విద్యార్థులకు ప్రత్యక్ష విజ్ఞానాన్ని అందించే
ఒక ఆయుధం అయ్యింది...
ఆయన విరమణ లేని పెద్ద సారు
ఆయన ప్రపంచం
ఎప్పటికీ బాధ్యతలను
బోధించే పాఠశాల
మాధవయుగం ముగిసింది
మాధవ ఆశయ ప్రస్థానం
అనంతంగా సాగుతుంది....
మీతో ప్రత్యక్ష జీవితం తక్కువే అయిన
పరోక్షంగా తెలుసుకున్న జ్ఞానం ఎక్కువే...
జోహార్
గౌర్రెపాటి మాధవరావు సార్...

# కన్నీటి వీడుకోలు

- లావు వీరయ్య

ఎక్కడ ఎన్కౌంటర్ జరిగినా....
గన్ మీద పెన్ ఎక్కుపెట్టి
బుల్లెట్ల లెక్కలు బయటకు తీసిన మానవవాది సెలవ్...

ఎక్కడ ఏ కార్మిక పోరాటం జరిగినా
దాని చరిత్ర విప్పిచెప్పి
కార్మికుల భుజం తట్టిన కార్మిక పక్షపాతి సెలవ్. ...

ఎక్కడ ఏ రైతాంగ పోరాటం జరిగినా
రైతుల వెన్నుముకయిన రైతుభాంధవుడా సెలవ్..

రాజ్యాంగానికి బీటలు పారుతుంటే.........
ప్రజలను చైతన్యం చేసిన
నిత్య చైతన్య శీలి సెలవ్.........

మా జంటకు స్పూర్తి అయ్యి
నా గుండెను కరిగించిన మిత్రడికి ..
నా కన్నీటి వీడ్కోలు....

# హక్కుల పోరాటానికి నిలువెత్తు జెండా

- బచ్చు భూమన్న

ఉన్నత చదువు కొరకై పట్నం వెళ్ళాడు
అసలు చదువులెలా ఉండాలో అర్థం చేసుకున్నాడు.
ఉస్మానియా గడ్డ మీద ప్రగతిశీల శక్తులతో జత కలిశాడు
సమసమాజాన్ని కలగన్నాడు
ఉద్యమబాటపట్టాలని ప్రతినబూనాడు
అట్టడుగు జనాల గొంతుకైన పత్రికకు భుజాన్నందించాడు
ఎంచుకున్న న్యాయవాదవృత్తికి  న్యాయం చేశాడు
జనం మెచ్చిన వకీల్ సాబ్‌గా బాధితుల పక్షం నిలిచాడు
కార్మిక శ్రేణులకు అండగా నిలబడ్డాడు
అదనపు విలువను కొల్లగొడ్తున్న తీరును కళ్లకు కట్టాడు
శ్రమను దోచుకునే  సంస్కృతిపై కన్నెర్ర చేశాడు
సర్కార్  ప్రయోగించే నిర్బంధాన్ని  నిరసించాడు
రాజ్య హింసను.. ప్రైవేట్? హింసను ఒకేలా నిలదీశాధు
మానవ జీవన హక్కు కోసం నిరంతరం తపించాడు
సర్కారు హత్యల వెనుక నిజాలు నిగ్గుతేల్చాడు
బాలగోపాల్? అడుగులతో కలసి నడిచాడు
హక్కుల పోరాటానికి నిలువెత్తు జెండాగా మారాడు
విశ్వమానవ కల్యాణాన్ని కాంక్షించిన స్వాప్నికుడు ...
అతనే గొర్రెపాటి మాధవరావు...